www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 223 | శనివారం | 2 ఫిబ్రవరి, 2019 పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

Published from: **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**



అడుగు జాడ కెసిఆర్‌ది

మన ముఖ్యమంత్రి కెసిఆర్ అడుగుజాడల్లో కేంద్ర తాత్కాలిక బడ్జెట్ రైతుబంధు బాట పట్టింది. ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న రైతుల బ్యాంకు ఖాతాల్లో ఏడాదికి రూ.6వేల నగదును మూడు విడతల్లో జమచేయడానికి ఉద్దేశించి ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని ఏర్పాటు చేసింది. 2018 డిసెంబర్ నుంచే అమలులోకి వచ్చేలా మొదటి విడత చెల్లింపు కింద రూ.20వేల కోట్లు, వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.75వేల కోట్లు కేటాయించింది. అయితే తెలంగాణలో రైతు బంధు కెసిఆర్ ఏడాదిన్నర క్రితమే అమల్లోకి తెచ్చిన పథకాలకు ఇది సాటిరాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పీయూష్ తాత్కాలిక ఫుల్ బడ్జెట్




అందరి ఆకాంక్షల ప్రతిబింబం
– ప్రధాని మోడీ

రైతులను అవమానించారు
– రాహుల్ గాంధీ



నమో ఓటరు



అందరూ ఊహించినట్లుగానే ఎన్నికల వేళ ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో నరేంద్ర మోడీ సర్కార్ ప్రజాకర్షక పథకాలకు పెద్ద పీట వేసింది. అన్ని వర్గాల ఓటర్లను ఆకట్టుకునే విధంగా సంచలనాత్మక రీతిలో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రసంగాన్ని దాదాపు పూర్తిస్థాయి బడ్జెట్ ప్రసంగంగా మార్చి వేసిన తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ బిజెపికి దూరమవుతున్నట్లుగా భావిస్తున్న మధ్యతరగతి, రైతులపై వరాల జల్లు కురిపించారు.



కర్షక, కార్మిక, మధ్యతరగతి ఓట్ల వేట కనికట్టు

5ఎకరాలలోపు రైతులకు ఏటా రూ.6వేలు

ఆదాయపు పన్ను వర్తింపు శ్లాబు రూ. 5 లక్షలు

అసంఘటిత కార్మికులకు శ్రమ యోగి బంధన్ పింఛన్

గ్రామీణ ఉపాధి హామీకి రూ. 60వేల కోట్లు

రైల్వేకు రూ.1.58లక్షల కోట్లు





రక్షణకు రూ.3.05లక్షల కోట్లు

న్యూఢిల్లీ: పీయూష్ గోయల్ శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆద్యంతం ఓటర్ల ఆకాంక్షలను సంతృప్తిపరిచే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా మధ్యతరగతి వేతన జీవులు, రైతులు, అసంఘటిత రంగ కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు.. ఇలా తరువాయి 7లో

20 తర్వాత



రాష్ట్ర బడ్జెట్ సభ?

మన తెలంగాణ /హైదరాబాద్

రాష్ట్ర ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 20వ తర్వాత జరిగే అవకాశం ఉంది. తొలుత ఈ నెల 18 నుంచి ప్రారంభించాలని ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చినప్పటికీ పదిహేనవ ఆర్థిక సంఘం పర్యటన దృష్ట్యా వాయిదా పడినట్లు తెలిసింది. ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు పదిహేనవ ఆర్థిక సంఘం రాష్ట్రంలో పర్యటించనుంది. మొదటి రెండు రోజుల పాటు జూబ్లిహాల్‌లో జరిగే సమావేశానికి సిఎం కెసిఆర్‌తో పాటు ఆర్థిక శాఖ సలహాదారు, అధికారులు హాజరవుతున్నారు. మూడవ రోజున రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు మిషన్ భగీరథ పనులను ఆర్థిక సంఘం ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఆర్థిక సంఘం పర్యటన ముగిసిన తర్వాతనే రాష్ట్ర బడ్జెట్ సమావేశాలను ఖరారు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ఆర్థిక సంఘం మొదటి రెండు రోజులపాటు తరువాయి 12లో

- 18 నుంచి 3రోజులు 15వ ఫైనాన్స్ కమిషన్ పర్యటన
- ఈ నెల 20న కాళేశ్వరం, మిషన్ భగీరథ పనుల పరిశీలన

కుంచెపోటు



ఎందుకంత సంబురం,
మనకంత ఇన్‌కం లేదుగా?

ఓటుకు నోటు కేసులో వేం నరేందర్‌రెడ్డికి ఇడి నోటీసులు

2

బైసన్‌పోలోపై నిర్మలా సీతారామన్ సానుకూల స్పందన

అమెరికాలో అగచాట్లు

నకిలీ వర్శిటీ ఉదంతంలో కరీంనగర్‌కు చెందిన నిండు గర్భవతిపై ఆంక్షలు

- జియో ట్యాగింగ్ దిగ్బంధం
- 130మందిపై ఆంక్షలు
- లాయర్లకు భారీ డిమాండ్
- ఏకమైన తెలుగు సంఘాలు

మన తెలంగాణ/హైదరాబాద్: అగ్రరాజ్యం అమెరికా భారత విద్యార్థుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తోంది. వీసా గడువు ముగిసినప్పటికీ అక్రమంగా తరువాయి 12లో

12



నకిలీ వర్శిటీ వలలో చిక్కిన తెలుగు వారిని ఆదుకోవాలని అమెరికన్ కాన్సుల్ జనరల్ కేథరిన్ హడ్డాను కలిసి విజ్ఞప్తి చేసిన కెటిఆర్

తగ్గిన చలిగాలుల తీవ్రత

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా చలిగాలుల తీవ్రత స్వల్పంగా తగ్గింది. 10 రోజులుగా చలితో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కొంత ఉపశమనం లభించినట్టయ్యింది. రానున్న మూడు రోజులు పొడి వాతారణం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



వేం నరేందర్‌రెడ్డికి ఇడి నోటీసులు

- ఓటుకు నోటు కేసులో దర్యాప్తు
- వారంలోగా విచారణకు రావాలని ఆదేశాలు

మన తెలంగాణ/హైదరాబాద్: ఓటుకు నోటు కేసులో కాంగ్రెస్ నేత వేం నరేందర్‌రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు గచ్చిబౌలి రోలింగ్ హిల్స్‌లోని వేం నరేందర్‌రెడ్డికి ఇంటికి వెళ్లి ఈడి అధికారులు నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోగా విచారణకు హాజరు కావాలని ఆ నోటీసులో ఇడి ఆదేశించింది. కాగా 2015 మే నెల 30వ తేదీన వెలుగులోకి వచ్చిన ఓటుకునోటు కేసులో వేం నరేందర్‌రెడ్డిపై సైతం ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో టిడిపి కార్యనిర్వాహక అధ్యక్షునిగా ఉన్న రేవంత్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికలలో వేం నరేందర్‌రెడ్డిని గెలిపించుకోవాలన్న ఉద్దేశ్యంతో నామినేటెడ్ ఎమ్మెల్యే స్టిఫెన్‌సన్‌ను ప్రలోభపెడుతూ రూ.50 లక్షలతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడేనని ఆరోపణలు సైతం వెల్లువెత్తాయి. అయితే ఓటుకు నోటు కేసులో కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి అనుచరుడు వేం నరేందర్‌రెడ్డికి ఈడీ నోటీసులు ఇవ్వడంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఓటుకు నోటు కేసులో చేతులు మారిన రూ.50 లక్షలపై ఈడీ వేం నరేందర్‌రెడ్డిని వివరణ కోరుతూ వారం రోజుల పాటు గడువునిచ్చింది

'బైసన్'కు సానుకూలం

సిఎం కెసిఆర్ లేఖను కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు అందజేసిన టిఆర్‌ఎస్ ఎంపిలు



మన తెలంగాణ / న్యూఢిల్లీ, హైదరాబాద్ : సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో ఉన్న బైసన్ పోలో గ్రౌండ్స్ స్థలాన్ని, రక్షణ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌కు టిఆర్‌ఎస్ ఎంపిలు చేసిన విజ్ఞప్తికి ఆమె సానుకూలంగా స్పందించారు. లోక్‌సభలో బడ్జెట్ ప్రసంగం ముగిసిన తర్వాత ఆమెను కలిసిన టిఆర్‌ఎస్ ఎంపిలు ఈ స్థలాన్ని అప్పగించాలని కోరుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ రాసిన లేఖను ఆమెకు అందజేశారు. ప్రధానిని కలిసి ఈ విషయాన్ని గురువారం చర్చించిన సందర్భంగా ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలను కూడా ఆమెకు వివరించారు. తాజాగా హైకోర్టు వెలువరించిన తీర్పు గురించి కూడా ఆమెకు వివరించడంతో రక్షణ శాఖ అధికారులతో, కంటోన్మెంట్ అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోనున్నట్లు సానుకూల అభిప్రాయాన్ని తెలియజేశారని టిఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నాయకుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రక్షణ శాఖ భూముల బదలాయింపుపై ఇప్పటికే అనేక మార్లు ప్రధాని మోడిని కలిసి చర్చించిన విషయాన్ని ఆమెకు వివరించారు. బైసన్ పోలో స్థల వివాదం కేసు హైకోర్టు విచారణలో ఉందని గతంలో ప్రధాని చెప్పారని, అయితే తాజాగా హైకోర్టు వెలువరించిన తీర్పులో బైసన్ పోలో స్థలం కేంద్రానిదే అని స్పష్టతనిచ్చిందని, దీంతో ఈ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించడానికి ఉన్న లీగల్ అభ్యంతరాలన్నీ తొలగిపోయినట్లు ఆమెకు వివరించినట్లు జితేందర్‌రెడ్డి తెలిపారు. ప్రధానితో చర్చించిన తర్వాత ఆయన వెలువరించిన అభిప్రాయాన్ని నిర్మలాకు వివరించామని, ముఖ్యమంత్రి తన లేఖలో పేర్కొన్న అంశాలన్నింటినీ ఆమె చదవడంతో పాటు కొన్ని సందేహాలకు తమ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారని పేర్కొన్నారు. బైసన్ పోలో స్థలానికి బదులుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలాన్ని, కొంత పరిహారం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్న విషయాన్ని కేంద్ర మంత్రికి వివరించామని తెలిపారు. తమ విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపి జితేందర్ రెడ్డి తెలిపారు.

దేశానికే కెసిఆర్ రోల్ మోడల్

తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆలోచనల్లోంచి పుట్టుకొచ్చిన రైతుబంధు పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తాజా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రస్తావించడం సంతోషంగా ఉందని జితేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పటికే పలు రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలుచేస్తుండగా ఇప్పుడు ఏకంగా కేంద్ర ప్రభుత్వమే ప్రవేశపెడుతోందని, 'కెసిఆర్ ఈజ్ నౌ ఆ రోల్ మోడల్ ఆఫ్ ది కంట్రీ' అనడానికి ఈ బడ్జెట్ ప్రసంగమే నిదర్శనమని అన్నారు.

ఐఐటిహెచ్‌లో విద్యార్థి ఆత్మహత్య

మన తెలంగాణ/ సంగారెడ్డి ప్రతినిధి : సంగారెడ్డి జిల్లాలోని కంది గ్రామ పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ కళాశాలలో బీటెక్ (మెకానిక్ హెరోస్పోస్ ఇంజనీరింగ్) చివరి సంవత్సరం చదువుతున్న అనిరుధ్య(23) గురువారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకొని మృతిచెందిన సంఘటన నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఐఐటీ డిబ్లాక్‌లో ఉన్న అనిరుధ్య గురువారం అర్ధరాత్రి 12.30 నిమిషాల ప్రాంతంలో స్నేహితుడి గది నుంచి బయటకు వచ్చాడు. ఫోన్ చేతిలో పట్టుకొని భవనంపై అంతస్తుకు వెళ్లి తాను మృతిచెందుతున్నట్లు తన మిత్రుడు కనిష్‌రెడ్డికి మెసేజ్ చేసి భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు సిఐ శివకుమార్ వెల్లడించారు. గాయాలైన అనిరుధ్యను ఐఐటీలోని ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి అక్కడి నుంచి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారని తెలిపారు. మృతుడి స్వస్థలం గుంటూరు జిల్లా తెనాలి కాగా .. హైద్రాబాద్‌లోని తిరుమలగిరి బోయిన్‌పల్లిలో తల్లిదండ్రులు నివాసముంటున్నట్లు తెలిసింది. ఇటీవలే ఇంటికి సెలవుపై వెళ్లి వచ్చిన అనిరుధ్య అర్ధరాత్రి వరకు స్నేహితుడి గదిలో గడిపిపై అంతస్తుకు వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. కొడుకు మృతితో తండ్రి రాజన్, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివకుమార్ తెలిపారు.



అనిరుధ్య (ఫైల్)

ఎసిబి వలలో జిహెచ్‌ఎంసి ఎఇ



మన తెలంగాణ/హైదరాబాద్ : జిహెచ్‌ఎంసి చంద్రాయణగుట్ట డివిజన్ పరిధిలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా విధు లు నిర్వహిస్తున్న ఎం.వెంకటరాములు హఫీజ్ బాబానగర్‌లోని ప్రభుత్వ స్కూల్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం రూ. 40 వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే.. చంద్రాయణగుట్టలో నివాసముంటున్న గులామ్ రిజ్వాన్ ఫరూఖీ జిహెచ్‌ఎంసి పరిధిలో రోడ్డు నిర్మాణ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో కాంచన్‌బాగ్ డివిజన్‌లోని ఓ సిసి రోడ్డు నిర్మాణానికి సంబంధించిన బిల్లులు ఎం బుక్ నమోదు చేయడం కోసం కాంట్రాక్టర్ గులామ్ రిజ్వాన్ ఫరూఖీ హెచ్‌ఎంసి ఎఇ వెంకట్రాములును సంప్రదించాడు. సిసి రోడ్డు నిర్మాణానికి సంబంధించిన బిల్లులు ఎం బుక్ నమోదు చేయాలంటే 40వేలు లంచం ఇవ్వాలని ఎఇ వెంకట్రాములు డిమాండ్ చేశాడు. దీంతో గులామ్ రిజ్వాన ఫరూఖీ ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. దీంతో రంగంలోకి దిగిన ఎసిబి అధికారులు కాంట్రాక్టర్ గులామ్ రిజ్వానఫరూఖీ నుంచి ఎం వెంకటరాములు రూ.40వేలు లంచం తీసుకుంటుండగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఎఇ వెంకట్రాములు కుడి చేతికి వేళ్లకు రసాయన పరీక్షలు నిర్వహించి అరెస్టు చేసి ఎసిబి కోర్టులో హాజరుపరిచారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు లంచం కోరితే బాధితులు 1064 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎసిబి అధికారులు వివరించారు.

ఇంకా.. వెంటాడుతూనే ఉన్నారు

ప్రణయ్ తండ్రి బాలస్వామి ఆవేదన

మన తెలంగాణ/హైదరాబాద్ : తన కుమారుడిని దారుణంగా చంపిన వారు తమను అంతమొందించేందుకు ఇంకా వెంటాడుతూనే ఉన్నారని ప్రణయ్ తండ్రి బాలస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో బాలస్వామి మాట్లాడుతూ, తమ బతుకు తాము బతుకుతున్నా ఇప్పటికీ తమను ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారో తెలియడం లేదన్నారు. ప్రజా సంఘాలు, మీడియా, పోలీసుల సహకారం వల్లే తాము ఇప్పటికీ బతికున్నామని ప్రణయ్ తండ్రి బాలస్వామి అన్నారు. కొంతమంది వ్యక్తులు తమ కుంటుంబం వెంటపడుతున్నారని, అయినా అమృత తమ వెంటే ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో అమృత పండంటి బాబుకి జన్మనిచ్చిందన్నారు. అచ్చం ప్రణయ్‌ను చూసినట్టే ఉందన్నారు. కచ్చితంగా దోషులకు శిక్ష పడేవరకు తాము పోరాడతామని చెప్పారు. పోలీసు శాఖ ఎప్పటికప్పుడు తమకు భద్రత కల్పిస్తోందని బాలస్వామి వివరించారు. ప్రణయ్ తల్లి ప్రేమలత మాట్లాడుతూ మిర్యాలగూడలో భద్రత లేకనే హైదరాబాద్‌లో అమృతకు డెలివరీ చేయించామన్నారు. ఇప్పటికీ అమృత తల్లి తమ ఇంటికి మధ్యవర్తులను పంపించి బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. తాము మూడు రోజుల్లో మిర్యాలగూడకు వెళ్తున్నామని తమకు పోలీసులు రక్షణ కల్పించాలని ఆమె కోరారు.

వెనిజులాలో అమెరికా జోక్యం అనవసరం

సురవరం సుధాకర్‌రెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్ : వెనిజులా ప్రభుత్వం వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకోవడాన్ని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఖండించారు. అఖిల భారత శాంతి సంఘీభావం సంఘం ఆధ్వర్యంలో రాజబహదూర్ హాల్‌లో కేవియల్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. 'వెనిజులా దేశంలో ప్రజాస్వామ్య ప్రభుత్వంపై అమెరికన్ సామ్రాజ్యవాదం దాడి, ప్రపంచ శాంతికి విఘాతం' అనే అంశంపై ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురవరం మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వ వ్యవహారంలో అమెరికా జోక్యం తగదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎన్నికైన మదురొ ప్రభుత్వాన్ని కూల్చివేసి గుయ్‌డొ తానే అధ్యక్షుడిగా ప్రకటించుకున్నారని, ఆయనకు అమెరికా మద్దతు పలికి అంతర్జాతీయ న్యాయ సూత్రాలను తుంగలో తొక్కిందని ఆయన ఆరోపించారు. వెనిజులాలో చమురు నిక్షేపాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిపై తమ ఆధిపత్యాన్ని కొనసాగించాలంటే మదురొ ప్రభుత్వం అమెరికాకు అడ్డంకిగా ఉందన్నారు. అందువల్లనే వెనిజులా ప్రజాస్వామ్యం ప్రభుత్వ వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకొని తన సామ్రాజ్యవాద వైఖరిని చాటుకుందని, తద్వారా ప్రపంచశాంతికి విఘాతం కలిగే చర్యలకు పాల్పడిందని విమర్శించారు. ప్రపంచంలో కార్పొరేట్ కంపెనీలు ఆయా ప్రాంతాల్లోని ప్రగతిశీల ప్రభుత్వాలను కూలగొట్టి తమ కనుసన్నల్లో నడిచే పాలకులను అధికారంలోకి తీసుకొచ్చే చర్యలను ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, ఎఐపిఎస్‌ఓ జాతీయ అధ్యక్షులు యాదవరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.సుధాకర్, రామచంద్రారెడ్డి, ఉమా మల్లేష్, కాచం సత్యనారాయణ, శ్రీశైలం, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ దేశానికి క్షమాపణ చెప్పాలి

ప్రధాని మోడీ దేశానికి క్షమాపణ చెప్పాలని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మఖ్ధూభవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో బడ్జెట్‌లో తాయిలాలు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. వాస్తవాలను కప్పిపుచ్చుకునేలా రాష్ట్రపతి ప్రసంగం సాగిందన్నారు. ఈ మధ్య వచ్చిన సర్వేలు మోదీ దిగజారిన పాలనకు అద్దం పడుతున్నాయన్నారు. దేశంలో ఎన్డీయే ప్రభుత్వం విధానాల వలన నిరుద్యోగం పెరిగిందని ఆయన ఆరోపించారు. మేక్ ఇన్ ఇండియా ఒక బోగస్ నినాదంగా మారిందన్నారు. రైతులకు ఆరువేల పెట్టుబడి సరిపోదని, కనీసం రూ.12 వేల సాయం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



రక్షణ ఛత్రం

బడ్జెట్‌లో రక్షణ రంగానికి రూ 3.05 లక్షల కోట్లు

కేంద్ర బడ్జెట్‌లో ఈసారి రక్షణ రంగానికి రూ 3.05 లక్షల కోట్లు కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ 2.85 లక్షల కోట్లుగా ఉంది. దీనితో పోలిస్తే రాబోయే ఆర్థిక సంవత్సరానికి పెరిగిన బడ్జెట్ దాదాపు రూ 20000 కోట్లు. కేంద్ర బడ్జెట్‌లో పీయూష్‌గోయల్ ఈ కీలక విభాగం కేటాయింపులు తెలిపారు. రక్షణ రంగానికి అదనపు నిధులను అవసరాన్ని బట్టి కేటాయించడం జరుగుతుందని, దేశ సరిహద్దులను పరిరక్షించేందుకు, రక్షణ సన్నద్ధతకు అవసరమైన విధంగా కేటాయింపులు ఉంటాయని వివరించారు. మన రక్షణ శాఖ బడ్జెట్ ఇప్పుడు తొలిసారిగా మూడు లక్షల కోట్ల రూపాయలను మించి పోయిందని, , సరిహద్దులలో సర్వం సన్నద్ధతకు ఇది కీలకం అని తెలిపారు. మన వీర జవాన్లు అన్ని రకాల ప్రతికూలతల్లోనూ సరిహద్దులను పరిరక్షిస్తారని దీనికి తగ్గట్లుగా రక్షణ, జాతీయ భద్రతల పరిరక్షణ అవసరం అని తేల్చిచెప్పారు. గత 40 ఏళ్లుగా నానుతూ వస్తున్న ఒఆర్ఒపి సమస్య పరిష్కారం అయిందన్నారు. గత ప్రభుత్వాలు మూడు బడ్జెట్‌లలో దీనిని పొందుపర్చారని, దీనికి ఒక్కసారి కేవలం తాత్కాలిక బడ్జెట్‌లో రూ 500 కోట్లు కేటాయించారని , అయితే ఇందుకు విరుద్ధంగా తమ ప్రభుత్వం ఈ పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తూ ఇప్పటికే రూ 35000 కోట్లు పంపిణీ చేసిందని గోయల్ చెప్పారు. ఇక ప్రభుత్వం అన్ని స్థాయిల్లోని సైనిక సిబ్బందికి సైనిక వేతన చెల్లింపులు (ఎంఎస్‌పి)ని గణనీయంగా పెంచిందని తెలిపారు. అత్యంత ప్రమాదకర విధులలో ఉండే నౌకా, విమానాయాన సైనిక సిబ్బందికి ఇచ్చే ప్రత్యేక అలవెన్సులను కూడా పెంచడం జరిగిందన్నారు.

రక్షణ రంగానికి 6.87 శాతం పెంపుదల

పీయూష్ బడ్జెట్‌లో ఈసారి రక్షణ రంగానికి కేటాయింపులు గతంతో పోలిస్తే 6.87 శాతం పెరిగింది. రక్షణ మంత్రిత్వశాఖ తాజా వివరణలో ఈ విషయం స్పష్టం అయింది. 2018–19 సంవత్సరానికి రూ 2.98 లక్షల కోట్లు కేటాయించారు. అయితే ఇప్పటి 2019– 20 ఆర్థిక సంవత్సరంలో దీనిని రూ 3.18 లక్షల కోట్లుగా ఖరారు చేశారు. అయితే ఓ వైపు చైనా, మరో వైపు పాకిస్థాన్‌లు తమ సైనిక పాటవాన్ని పెంచుకుంటున్న దశలో అందుకు అనుగుణంగా ఇప్పుడు రక్షణ కేటాయింపులు లేవని వెల్లడైంది. మొత్తం కేటాయింపులలో రూ 1,08,248 కోట్లను వ్యయ పద్దులో ఖరారు చేశారు. దీని పరిధిలో కొత్త ఆయుధాలు, విమానాలు, యుద్ధ నౌకలు, ఇతర సైనిక సాంకేతిక పరిజ్ఞానానికి వెచ్చించడం జరుగుతుంది. గత ఏడాది దీని కోసం రూ. 93,982 కోట్లను కేటాయించారు. రక్షణ రంగానికి మొత్తం కేటాయింపులలో పింఛన్లకు ఇప్పటికే పొందుపర్చిన రూ 1,12,079 కోట్ల మొత్తం జమచేయలేదు. ఇది వేరుగానే ఉంటుంది. అయితే మూల ధన వ్యయ కేటాయింపులు సరిపోయ్యే విధంగా లేవని రక్షణ అధ్యయనాలు, విశ్లేషణల సంస్థకు చెందిన డాక్టర్ లక్ష్మణ్ బెహెరా అసంతృప్తి వ్యక్తం చేశారు. అవసరాల మేరకు మన సాయుధ బలగాలు అన్ని విధాలుగా అధునాతన ప్రక్రియను సంతరించుకోవాల్సి ఉంది. అయితే ఇందుకు అనుగుణంగా వ్యయ పద్దులు లేవని తెలిపారు. జిడిపిలో రక్షణ బడ్జెట్ కేవలం 1.44 శాతంగా ఉందని, చుట్టుపక్కల భద్రతా వాతావరణం కోణంలో ఇది అతి తక్కువ మొత్తం అని తేల్చిచెప్పారు. అయితే అవసరాలను బట్టి రక్షణ రంగానికి నిధుల కేటాయింపులు పెరుగుతాయని పీయూష్ గోయల్ బడ్జెట్‌లో తెలిపారు.



ఇది ట్రయల్ మాత్రమే

రైతులు, మధ్యతరగతి, వేతన జీవులు సహ అందరి ఆకాంక్షలను ప్రతిబింబించేలా బడ్జెట్ ఉంది. ఈ బడ్జెట్ కేవలం ట్రైలర్ మాత్రమే. సార్వత్రిక ఎన్నికల అనంతరం దేశాన్ని మరింతగా అభి–వృద్ధి బాటలో పరుగులెత్తిస్తాం. 12కోట్ల మంది రైతులు, 3కోట్ల మధ్యతరగతి కుటుంబాలు, 30 నుంచి 40కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు, ఉద్యోగులు ఈ బడ్జెట్ ద్వారా లబ్ధి పొందబోతున్నారు. బడ్జెట్‌లో పలు వర్గాలు ఎదుర్కొంటున్న సమస్య–లను పరిష్కరించేలా చొరవ చూపాము. ప్రభుత్వ పథకాల అమలు నేపథ్యంలో దేశంలో పేదరికం గణనీయంగా తగ్గు–ముఖం పట్టింది. దేశవ్యాప్తంగా 1.5 కోట్ల మంది శాశ్వత గృహాలు నిర్మించుకున్నారు. 130కోట్ల మంది భారతీయులు ఈ బడ్జెట్ ద్వారా నూతన భారతావనికి బాటలు పడుతుందని భావి–స్తున్నా

– నరేంద్ర మోడీ, ప్రధానమంత్రి

ఇంకా నయం 70 పైసలనలేదు

చిన్నకారు రైతులకు సంవత్సరానికి రూ.6000 రూపా–యలు చొప్పున రోజుకూ రూ.17 ఇవ్వజూపుతూ వారిని అవమానపరుస్తారా? అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేసిన విమర్శ–లను బీజేపీ దీటుగా తిప్పికొ–ట్టింది. 'ఇంకా నయం గంటకు 70 పైసలని మీరు ట్వీట్ చేయకపోవడమే మమ్మల్ని ఆశ్చర్యపరుస్తోంది' అని బీజేపీ ట్వీట్ చేసింది. మేము అంచనా వేసినట్టే బడ్జెట్ మీకు అర్థం కాలేదని మాకు అర్థమైంది. రైతులకు రూ.6000 అనేది వారి నికర ఆదాయం కాదు. వారి ఆదా–యానికి అదనం. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథ–కాలకు అదనం ' అని ఆ ట్వీట్ పేర్కొంది.



కృత్రిమ మేధో సంస్థ

బడ్జెట్‌లో పీయూష్ వెల్లడి

న్యూఢిల్లీ : త్వరలోనే కృత్రిమ మేధో (ఎఐ) జాతీయ సంస్థ ఏర్పాటు చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. సామాన్య ప్రజానీకానికి కృత్రిమ మేధో సంపత్తి, సబంధిత పరిజ్ఞాన ఫలితాలను అందించేందుకు ఈ కేంద్రం ద్వారా కృషి జరుగుతుందని వివరించారు. ప్రపంచంలోనే భారతదేశం అతి పెద్ద రెండవ అంకుర కేంద్రం – స్టార్టప్‌హబ్‌గా నిలిచిందన్నారు. ఈ రంగంలో మన యువత సృజనాత్మక ఆలోచనలు ఎంతగానో దోహదం చేశాయి. అంతకాకుండా అకుంఠిత దీక్ష, కష్టించి పనిచేయడం మనకు గర్వకారణంగా మారింది. స్టార్టప్‌లో దేశాన్ని కీలక దశకు చేర్చిందని పీయూష్ చెప్పారు. ఈ దశలో కృత్రిమ మేధోకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. దీనిని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం కృత్రిమ మేధో వికాసానికి జాతీయ కార్యక్రమాన్ని రూపొందించింది. ఇందులో కీలకమైన రీతిలో ఎఐ జాతీయ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి సభకు తెలిపారు. భారతదేశం సమీప భవిష్యత్తులో కృత్రిమ మేధకు కేంద్రంగా మారేందుకు జాతీయ సంస్థ ఏర్పాటుతో వీలేర్పడుతుందని వెల్లడించారు. ఇది అత్యంత ప్రతిష్ఠాత్మక పథకం, కేంద్ర ప్రభుత్వ వినూత్న ప్రయత్నం అని, దీనికి సంబంధించి ప్రభుత్వం తొమ్మిది ప్రాధాన్యతా రంగాలను ఖరారు చేసుకుందని వివరించారు. ముందస్తుగానే కృత్రిమ మేధో ఆవిష్కరణలపై జాతీయ పోర్టల్‌ను త్వరలోనే రూపొందించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతానికి స్టార్టప్‌లకు సంబంధించిన నియంత్రణ అవరోధాల పరిష్కారం , ఆమోదయోగ్య విధి విధానాల గురించి సమాలోచనలు జరుగుతున్నట్లు తెలిపారు. దేశంలో స్టార్టప్ సానుకూల వాతావరణం నెలకొనడం సంతోషకరమని గోయల్ తెలిపారు. ఇంతకు ముందటి లాగా ఫ్యాక్టరీలలోనే ఉద్యోగాల కల్పన కుదరదని, ఉద్యోగార్థులే ఉద్యోగ ప్రదాతలు కావాల్సిన అవసరం ఉందని, ఇందులో భాగంగానే స్టార్టప్‌లు అందుకు అనుగుణంగానే కృత్రిమ మేధో సాధనకు అపార కృషి సాగుతోందన్నారు.

మధ్యంతర బడ్జెట్ (2019-20)

పైసల్లో



రూపాయి రాక

19	అప్పులు మరియు ఇతరములు
21	కార్పొరేట్ పన్ను
17	ఆదాయం పన్ను
4	కస్టమ్స్
7	కేంద్ర ఎక్సైజ్ సుంకాలు
21	వస్తు సేవల పన్ను
8	పన్నేతర రాబడి
3	రుణేతర పెట్టుబడి, రాబడులు

రూపాయి పోక

9	కేంద్రం ఆదాయంలోని పథకాలు
12	కేంద్ర రంగ పథకాలు
18	వడ్డీ చెల్లింపులు
8	ఇతర ఖర్చులు
9	సబ్సిడీలు
8	రక్షణ
23	పన్నులు మరియు సుంకాల్లో రాష్ట్రాల వాటా
5	పింఛన్లు
8	ఆర్థిక సంఘం మరియు ఇతర బదిలీలు

రూ. 3 వేల పింఛన్

అసంఘటిత కార్మికులకు వయో పరిమితిని బట్టి ప్రీమియం
పిఎం ఎన్‌వైఎం పథకంలో వర్తింపు • రూ 15000 వేతన పరిధి ఖరారు

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో అసంఘటిత కార్మికులకు కొంత ఆసరా కల్పించారు. 60 సంవత్సరాలు దాటిన వారికి నెల వారిగా రూ 3000 పింఛన్ హామీ కల్పించే పథకాన్ని ప్రకటించారు. దీనితో దేశంలో పది కోట్ల మంది అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించినట్లు అవుతుంది. అయితే అసంఘటిత కార్మికులు ఈ పింఛన్ పొందేందుకు ప్రతి నెల వారు రూ 100 వరకూ కార్మికులు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి వారికి ఈ పింఛన్ నిధి కోసం నెలకు రూ వంద జమ అవుతుంది. ప్రధాన మంత్రి శ్రమ్ – యోగి మాంథన్ (పిఎంఎస్‌వైఎం) పేరిట ప్రభుత్వం ఈ భారీ పెన్షన్ పథకాన్ని తీసుకువచ్చింది. రూ. 15000 నెలసరి మొత్తం వరకూ పొందే వారికి ఈ పథకం వర్తిస్తుంది. ప్రభుత్వ – కార్మికుల చెరి సమాన మ్యాచింగ్ మొత్తంతో 60 ఏళ్లు దాటిన తరువాత కార్మికులకు ఈ పింఛన్ అందుతుంది. 2019–20 తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ పీయూష్ గోయల్ ఈ విషయాన్ని వెల్లడించారు. దేశంలో అసంఘటిత కార్మిక రంగానికి చెందిన 42 కోట్ల మంది చెమటోడ్చడంతోనే , వారి శ్రమతోనే భారతదేశ జిడిపిలో సగం వరకూ సమకూరుతుందని ఆయన చెప్పారు. రిక్షా వాలాలు, నిర్మాణ కార్మికులు, వీధులలోని విక్రేతలు ఈ విధంగా ఇటువంటి పలు వృత్తులకు చెందిన వారి కష్టంతోనే దేశ తలసరి ఆదాయ పరిస్థితి మెరుగుపడుతోందన్నారు. ఇంటిపని వారు కూడా ఎక్కవ సంఖ్యలోనే ఉన్నారు. వారి కష్టాన్ని గుర్తించాల్సి ఉంది. వయస్సు మళ్లిన తరువాత వారికి సరైన సామాజిక భద్రత దక్కేలా చేయాల్సి ఉందన్నారు. పిఎంఎస్‌వైఎం పరిధికి రూ 15000 ఆదాయం పరిమతి విధించారని గోయల్ వివరించారు. అసంఘటిత కార్మికులు పనిచేసే కాలంలో అతితక్కువ మొత్తాన్ని జమచేయడం ద్వారా వృద్ధాప్యంలో ఇబ్బంది లేకుండా పింఛన్‌కు వీలేర్పడుతుందన్నారు. తమ 29వ ఏట ఈ పథకంలో చేరే వారు 60 ఏళ్ల వరకూ నెలకు 100 రూపాయలు జమ చేయాల్సి ఉంటుందన్నారు. ఇక 18 ఏండ్ల ప్రాయపు అసంఘటిత కార్మికులు ఈ పథకంతో పింఛన్ పొందేందుకు నెల వారిగా కేవలం రూ 55 చెల్లిస్తే సరిపోతుంది. ప్రభుత్వం నుంచి ఇంతే మొత్తంలో మ్యాచింగ్ వాటా జమ అవుతుంది. వచ్చే ఐదేళ్లలో కనీసం పది కోట్ల మంది కార్మికులకు భవిష్య భద్రతగా నిలిచే ఈ పథకం ప్రపంచంలోనే అతి భారీ పెన్షన్ స్కీంగా ఉంటుందని వివరించారు. ఈ పథకం సమగ్ర అమలుకు కేంద్రం రూ 500 కోట్లు సమకూర్చింది. ఇక ముందు అవసరాన్ని బట్టి మరిన్ని నిధులు అందించడం జరుగుగుతుందని మంత్రి చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచే దీనిని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

- అన్నికేటగిరీల అంగన్‌వాడీల, ఆశా వర్కర్లకు ఇచ్చే గౌరవ భృతిని దాదాపు 50 శాతం పెంచారు.
- అత్యధిక వృద్ధి, ఆర్థిక వ్యవస్థ క్రమబద్ధీకరణతో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడ్డాయని పీయూష్ తెలిపారు. ఉద్యోగ కల్పన ఆశాజనకంగా ఉందన్నారు. ఇపిఎఫ్ఒ సభ్యత్వ సంఖ్యను చూస్తే ఈ విషయం స్పష్టం అవుతుందన్నారు. ఈ భవిష్యనిధి సంస్థ ఖాతాదారుల సంఖ్య రెండేళ్లలో దాదాపు రెండు కోట్లు పెరిగిందని వివరించారు. ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణకు, ఉద్యోగ కల్పనకు ఇది మంచి ఉదాహరణ అని తెలిపారు.



అసంఘటిత కార్మిక పింఛన్ పథకం వివరాలు

- 60 ఏళ్లు దాటిన వారికి అందే నెల వారి పింఛన్ రూ. 3000
- కార్మికులు అందించాల్సిన నెలవారి ప్రీమియం మొత్తం 100 (29వ ఏట పథకంలో చేరే వారు)
- 18వ ఏటనే పింఛన్‌లో చేరే వారు చెల్లించాల్సిన మొత్తం నెలకు రూ 55
- ప్రభుత్వం తరపున అందే మ్యాచింగ్ వాటా నెలకు రూ. 100...,. రూ. 55

పన్ను రహిత గ్రాట్యుటీ పరిమితి పెంపు

కేంద్ర బడ్జెట్‌లో గ్రాట్యుటీ అంశాన్ని సంబంధిత పన్ను రహిత పరిధిని ప్రస్తావించారు. పన్ను రహిత గ్రాట్యుటీ పరిమితి ఇప్పటివరకూ రూ 10 లక్షల వరకూ ఉండగా, దీనిని రూ.20 లక్షలకు పెంచనున్నారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు ఉద్యోగం వదులుకున్నా, రిటైరయినా గ్రాట్యుటీకి అర్హులు అవుతారు. నూతన పెన్షన్ స్కీంను మరింతగా ఉదారవంతం చేసినట్లు మంత్రి తెలిపారు. ఉద్యోగి వాటాను ఇప్పటి పది శాతంగానే ఉంచుతూ, ప్రభుత్వ వాటాను 4 శాతం పెంచి దీనిని 14 శాతం అయ్యే లా చేశామని మంత్రి తెలిపారు. కార్మికులకు ఇచ్చే బోనస్ గరిష్ట పరిమితిని ఇప్పుడున్న రూ 3500 నుంచి రూ 7000కు పెంచారు. ఇక వేతనాలపై ఇప్పుడున్న నెలవారి రూ 10,000 పరిమితిని రూ 21000కు పెంచారు. గత ఐదేళ్లలో వివిధ స్థాయిల కార్మికుల కనీస వేతనాలను ఇంతకు ముందెన్నడూ లేని రీతిలో 42 శాతం పెంచారని మంత్రి చెప్పారు.

కోటి మంది యువతకు ఉపాధి శిక్షణ

ఉద్యోగాల కొరత నేపథ్యంలో యువత తమ కాళ్ల మీద తాము నిలబడేందుకు కేంద్రం అన్ని చర్యలు తీసుకొంటోందని పీయూష్ గోయల్ చెప్పారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకాన్ని దీనికోసం తీసుకువచ్చినట్లు వివరించారు. ఈ పథకంలో భాగంగానే కోటి మందికి పైగా యువజనులకు తగు శిక్షణను ఇప్పించి వారు సొంతంగా జీవనోపాధి కల్పించుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ముద్ర వంటి పథకాలతో దేశంలోని యువశక్తిని సరైన దిశకు మళ్లించడం జరుగుతుందని, దీని ద్వారా సరైన విధంగా దేశ ప్రగతికి వీలేర్పడుతుందని వివరించారు. ముద్ర, స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా వంటివి ఈ దిశలో నమూనా పథకాలని తెలిపారు. ఈ ప్రక్రియలతో ప్రపంచంలోనే ఇండియా ఇప్పుడు అతి పెద్ద రెండో స్టార్టప్ హబ్ అయిందన్నారు. యువత వందలాది మందికి స్వయంగా ఉద్యోగాలు కల్పించే స్థితి కోసం వినూత్న పథకాలకు నాంది పలికినట్లు తెలిపారు.

ఇఎస్ఐకి పరిమితి

కార్మికులకు ఆరోగ్య సౌకర్యం కోసం ఉద్దేశించిన ఇఎస్ఐ వర్తింపు ఇప్పటివరకూ నెల వారి వేతనం రూ 15000 వారికి ఉండగా దీనిని ఇప్పుడు రూ 21000 పరిమితికి పెంచారు. ప్రతి కార్మికుడికి కనీస పింఛన్ నెల వారికి రూ 1000 ఖరారు చేశారు. పనిలో ఉండగా మరణం సంభవించే కార్మికులకు భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఒ) ద్వారా అందే మొత్తాన్ని రెండున్నర లక్షల నుంచి ఆరు లక్షల రూపాయలకు పెంచారు.

రైల్వేకు రూ 1.58 లక్షల కోట్లు

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌లో ఈ సారి రైల్వేకు రూ 1.58 లక్షల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్లు పీయూష్ గోయల్ చెప్పారు. ఈసారి రైల్వే ఛార్జీలలో పెంపుదల ఏమీ ఉండదని వెల్లడించారు. ఉ జాతీయ రవాణా సంస్థ అయిన రైల్వేకు అపూర్వ రీతిలో రూ 1.58 లక్షల కోట్ల స్థాయి మూలధన వ్యయ కేటాయింపులు జరిపినట్లు ఆర్థిక మంత్రిగా బాధ్యతలు తీసుకున్న రైల్వే మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. ఆదాయ వనరులు తగ్గుతున్న రైల్వేకు ఊతం కోసం ఈ మొత్తం సమకూరుస్తున్నట్లు వెల్లడించారు. గత ఏడాది బడ్జెట్‌లో రైల్వేకు ఆర్థిక మంత్రి జైట్లీ రూ 1.48 లక్షల కోట్లు కేటాయించారు. గడిచిన ఏడాది రైల్వేకు సురక్షిత సంవత్సరంగా ఉందని, బ్రాడ్‌గేజ్ పరిధిలో కాపలా లేని క్రాసింగ్‌లను పూర్తిగా తొలిగించినట్లు, దీనితో దుర్ఘటనలకు అవకాశాలు ఉండవని ఆశిస్తున్నట్లు వివరించారు. వచ్చే ఏడాది రైల్వే మూలధన వ్యయం ఇంతకు ముందు ఎప్పుడూ లేని విధంగా ఉంటుందని, వందే భారత్ వంటి స్వదేశీ నిర్మిత పాక్షిక హైస్పీడ్ రైళ్లను సిద్ధం చేసినట్లు, దీనితో భారతీయ ప్రయాణికులకు ప్రపంచ శ్రేణి ప్రయాణ సౌకర్యం కలుగుతుందన్నారు. మన ఇంజినీర్లు రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానం మేకిన్ ఇండియా పథకానికి ప్రోత్సాహం కల్పిస్తుందని, అంతేకాకుండా ఎంతో మందికి



ఉద్యోగ కల్పన ఉంటుందన్నారు. 2019–20 ఆర్థిక సంవత్సరానికి ఆదాయ పరిధిలో బడ్జెట్ అంచనాలు స్థూలంగా రూ 2,72,705.68 కోట్లు . 2018–19 సంవత్సరపు సవరించిన అంచనాలు రూ 2,49,851 .01 కోట్లతో పోలిస్తే ఆదాయ పెరుగుదల రూ 22,854.67 కోట్లు ఉంటుందని గణాంకాలలో తెలిపారు. నూతన రైల్వే లైన్లకు రూ 7,225 కోట్లు కేటాయించారు. గేజ్‌ల మార్పిడికి రూ 2200 కోట్లు, డబ్లింగ్ పనులకు రూ 700 కోట్లు, వ్యాగన్లు, లోకోమోటివ్‌ల వంటి రోలింగ్ స్టాక్‌కు రూ 6,114.82 కోట్లు, సిగ్నలింగ్, టెలీకంకు రూ 1750 కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆపరేటింగ్ రేషియో 96.2 శాతంగా మెరుగుపడిందని, దీనిని వచ్చే ఆర్థిక సంవత్సరం 95 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. 2014 స్థాయిలో చూస్తే వ్యయ అంచనాలు 148 శాతం పెరుగుతుంది. ఇక రైల్వే ప్రయాణికులకు సౌకర్యాల కల్పనకు రూ 3,422 కోట్లు కేటాయించారు. ఇంతకు ముందటితో పోలిస్తే ఇది ఇప్పుడు రూ 1000 కోట్లు అదనం అని తెలిపారు.



సంపాదకీయం

అయస్కాంత బడ్జెట్!

క్షీ లకమైన లోక్‌సభ ఎన్నికల వేళ ఓటర్లను లక్ష్యంగా చేసుకొని ప్రధాని నరేంద్ర మోడీ అత్యంత సునిశితమైన అయస్కాంత బాణాన్ని సంధించారు. నాలుగున్నరేళ్లకు మించి సాగించిన తమ పాలనలో దేశ ప్రజలను ఏ విధంగానూ సంతృప్తి పరచలేకపోగా, పలు కష్టాలకు గురి చేశామన్న ఆత్మజ్ఞానంతో చిట్టచివరి అవకాశంగా అందివచ్చిన తాత్కాలిక బడ్జెట్‌ను వారి మెప్పు పొందడం కోసం ఆయన పూర్తిగా వినియోగించుకున్నారు. ఎంతగా అంటే ఎన్నికలకు గల ఈ రెండు మాసాల వ్యవధిలోనే ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రెండు హెక్టార్ల (5 ఎకరాలు) వరకు భూమిగల ప్రతి రైతు ఖాతాలో రూ. 2000 నగదు పడేలా చూడడమనే తక్షణ లబ్ధి పాచికను ప్రయోగించారు. ప్రస్తుతానికి ఎన్నికల ముగిసే వరకు వినియోగావసరాలకు సరిపడే మేరకు తాత్కాలిక బడ్జెట్‌ను మాత్రమే ప్రతిపాదించవలసి ఉండగా పూర్తి స్థాయి పద్దును తలపించేలా రూపొందించి పార్లమెంటుకు సమర్పించడం గమనించవలసిన అంశం. అలాగే ఏప్రిల్ 1 నుంచి మొదలయ్యే 2019 – 20 ఆర్థిక సంవత్సరానికి వర్తించే విధంగానే ఉండవలసిన బడ్జెట్‌లో నడుస్తున్న ఏడాదికి కూడా నిధులు కేటాయించడం మరొక విశేషం. 2018 డిసెంబర్ నుంచి ఎన్నికలు ముగిసే వరకు గల స్వల్ప వ్యవధిలోనూ రైతులకు నగదు ముట్టేలా 20,000 కోట్ల రూపాయలను ఈ బడ్జెట్‌లో కేటాయించడమే ఇందుకు నిదర్శనం. ఆ విధంగా ప్రధాని మోడీ ప్రభుత్వం ఈ బడ్జెట్ రూపకల్పనలో సంప్రదాయ విరుద్ధమైన పద్ధతులను పాటించిందని చెప్పకతప్పదు.

అరుణ్ జైట్లీకి అస్వస్థత కారణంగా ఆపద్ధర్మ ఆర్థిక మంత్రి హోదాలో రైల్వే శాఖా మాత్యులు పీయూష్ గోయల్ ప్రవేశ పెట్టిన ఈ బడ్జెట్‌లో రాబడి పన్ను వర్తించే కనీస ఆదాయ శ్లాబును రెండున్నర నుంచి ఒక్కసారిగా ఐదు లక్షల రూపాయలకు పెంచి మధ్య తరగతి నికరాదాయ వర్గాలను కలా, నిజమా అనే పరిస్థితికి లోనుచేసి ఆశ్చర్యచకితులను గావించారు. దీనివల్ల ఏడాదికి ఆరున్నర లక్షల రూపాయల వరకు ఆదాయం కలవారందరూ పన్ను మినహాయింపును పొందుతారు. ఇంకా గృహ నిర్మాణాది అవసరాలకు కొన్ని సడలింపులను కల్పించారు. ఆదాయపు పన్ను శ్లాబును ఐదు లక్షల రూపాయల వరకు సడలించాలని వేతనాదాయపరులు చిరకాలంగా కోరుతున్నా ఏ ఆర్థిక మంత్రీ పట్టించుకోలేదు. అగ్ని పరీక్షవంటి ఈ ఎన్నికలవేళ మాత్రం ఆ డిమాండ్‌కు తల ఒగ్గక తప్పలేదు. ఏ విధంగానైనా కేంద్రం లో మళ్లీ అధికారం చేపట్టాలనే దృష్టితో ప్రధాని మోడీ ఈ బడ్జెట్‌ను సర్వవర ప్రదాయినిగా రూపొందింప చేశారని స్పష్టపడుతున్నది. నెలకు వంద రూపాయలు చెల్లిస్తే 60 ఏళ్లు దాటిన తర్వాత నెలవారీ 3000 రూపాయల పెన్షన్ వచ్చేలా 'ప్రధాన మంత్రి శ్రమ యోగి బంధన్' అనే మరో వరాన్ని కూడా గుప్పించి అవ్యవస్థీకృత రంగ కార్మికులను అబ్బురపరిచారు. ఇలా చెప్పుకుంటూపోతే ఈ బడ్జెట్ ఎన్నికల తరణోపాయ లీలలు అన్నీ ఇన్నీ కావు. అయితే దీని కూర్పులో ఇరుసు వంటి అంశం రైతులకు నేరుగా నగదు చెల్లింపు. ఇది తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు మానస పుత్రిక. ఈ విషయంలో వేరే మాటకు తావులేదు.

నిరంతరం శ్రమించి బంగారం పండించినా గుక్కెడు గంజినీళ్లకు నోచుకోక ఆత్మహత్యల బాటపడుతున్న రైతుల దుస్థితిని, చిరకాలంగా మంటలు రేగుతున్న వ్యవసాయ సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకొని ఎకరాకు నాలుగు వేల (తాజాగా ఐదు వేలు) రూపాయల వంతున ఖరీఫ్, రబీ సీజన్లు రెండింటికీ కలిపి ఏడాదికి ఎనిమిది వేల (ఇప్పుడు పది వేలు)రూపాయలను భూవిస్తీర్ణంతో నిమిత్తం లేకుండా అందేలా రైతు బంధును, ప్రీమియం భారాన్ని ప్రభుత్వమే భరించి ప్రతిఒక్క రైతు కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు అందేలా రైతు బంధు జీవిత బీమా పథకాన్ని ఏడాదిన్నర ముందే అనుకున్నదే తడవుగా అమలు చేసి తెలంగాణ రైతాంగం జీవితాల్లో కెసిఆర్ నవ శకాన్ని ఆవిష్కరించారు. దీనికి దేశమంతా చప్పట్లు కొట్టి జయజయ ధ్వానాలు పలికింది. అయితే రైతు బంధు, రైతు బంధు బీమా పథకాలతో పోల్చుకుంటే ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి దిగదుడుపే. కేంద్రంలో అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ సర్వశక్తులూ ఒడ్డుతున్నది. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి అమలులో అతి కారణంగా ప్రధాని మోడీ గ్రాఫ్ పడిపోతున్న దృశ్యం కళ్లకు కదుతున్నది. ఈ నేపథ్యంలో కెసిఆర్ అడుగు జాడల్లో రైతుకు నగదు వ్యూహాన్ని ఆశ్రయించడంతోపాటు పలు తాయిలాల ప్రకటన అనివార్యమని ఆయన భావించినట్టు స్పష్టపడుతున్నది. అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశాన్ని ముందుకు తీసుకుపోడానికి ఉపయోగించవలసిన బడ్జెట్ నిర్మాణాన్ని తక్షణ ఎన్నికల ప్రయోజనాల సాధనకు పరిమితం చేయడం బాధాకరం.

ప్రియాంక కాపాడునా?



టంకశాల అశోక్
9848191767

ప్రియాంక గాంధీ ప్రత్యక్ష రాజకీయాలలోకి రావటంలో కాంగ్రెస్ శ్రేణులలో ఉత్సాహం పెల్లుబుకటం సహజమే. కాని ఆమె వల్ల పార్టీకి నికరమైన ప్రయోజనం ఎంత కలుగుతుందన్నది చర్చనీయాంశం.

ప్రియాంకను పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ, ఉత్తరప్రదేశ్‌లోని తూర్పు ప్రాంతానికి పర్యవేక్షకురాలిని చేశారు. ఆమె ఈ విధంగా ప్రత్యక్ష రాజకీయాలలోకి రావటం ఇది మొదటి సారి అయినా, యథాతథంగా ఈ రంగానికి కొత్త కాదు. తమ "కుటుంబ లోక్‌సభ నియోజక వర్గాలు" గా భావించే అమేథీ, రాయబరేలీలను ఆమె చాలా కాలంగా పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికలు వచ్చినపుడు అక్కడి విషయాలు ప్రత్యక్షంగా చూస్తున్నారు. తనను ప్రతిసారి ప్రజలు బాగానే ఆదరిస్తున్నారు. కాని దాని ప్రభావం వారిపై ఓటర్లుగా ఎప్పుడూ అంతగా లేదు. ఆ రెండు లోక్‌సభ నియోజకవర్గాలలోని ఏడేసి అసెంబ్లీ స్థానాలలో పెద్ద మెజారిటీని ఎస్‌పి, బిఎస్‌పి, బిజెపి వంటి ఇతర పార్టీలే గెలుస్తూ వస్తున్నాయి. లోక్‌సభకు సంబంధించినంతవరకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు గెలుస్తున్నారంటే అది కాంగ్రెస్ స్వంత బలం వల్ల కాదన్నది బహిరంగ రహస్యం. నెహ్రూ – గాంధీ కుటుంబంపట్ల గల సంప్రదాయిక గౌరవం వల్ల ఇటువంటి ప్రతిపక్షాలు అక్కడ బలహీనమైన అభ్యర్థులను నిలబెడుతూ వస్తున్నాయి. ఈసారి కూడా ఇటీవలనే ఎన్నికల ఒప్పందానికి వచ్చిన ఎస్‌పి, బిఎస్‌పిలు ఆ రెండు సీట్లను కాంగ్రెస్‌కు వదలివేయటం తెలిసిందే. అనగా ఈసారి కనీసం బలహీన అభ్యర్థులను అయినా రంగంలోకి దింపటంగాక పూర్తిగా గాంధీ కుటుంబానికి వదిలి వేశారన్నమాట.

ప్రియాంక గాంధీ ప్రభావం ఆ రెండు స్థానాలలో ఓట్ల రూపంలో ఎంత ఉంటూ వస్తున్నదనేది ప్రశ్నార్థకం. అక్కడే ప్రశ్నార్థకం అయినపుడు తక్కిన తూర్పు యుపి విషయం చెప్పనక్కర లేదు. వాస్తవానికి ఆమెను పార్టీ ప్రధాన కార్యదర్శిగా, పర్యవేక్షకురాలిగా నియమించిన రాహుల్ గాంధీ ప్రభావమే ఎప్పుడూ కన్పించలేదు. ఆయన పదిహేను సంవత్సరాల క్రితం రాజకీయాలలోకి వచ్చిన సమయంలో ఒక విషయం సరిగానే అర్థం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌ను గెలవకుండా భారతదేశాన్ని గెలవలేమని, ఉత్తరప్రదేశ్‌ను గెలవాలంటే అక్కడ కాంగ్రెస్‌కు దూరమైన వర్గాలను తిరిగి దగ్గరకు చేర్చుకోవాలని. ఆ పని కోసం ఏమి చేయాలన్న దానిపై ఆయన కొంతకాలం పాటు సామాజిక శాస్త్రవేత్తల వద్ద, యుపి నిపుణుల వద్ద ట్యూషన్ క్లాసుల వంటివి చెప్పించుకున్నారు. దృష్టిని పూర్తిగా అదే రాష్ట్రంపై కేంద్రీకరించారు. గాంధీ కుటుంబ సభ్యుడు, వారసుడు అయినందున ఇతర రాష్ట్రాల నుంచి పదేపదే అందిన ఆహ్వానాలను ఎక్కువగా మన్నించలేదు. ఉత్తరప్రదేశ్‌లోని రైతులు, బడుగువర్గాల సమస్యలను చేపట్టి వాటి గురించి మాట్లాడుతూ చిన్నపాటి ఆందోళనలవంటివి కూడా చేశారు. ముఖ్యంగా రైతులను ఎస్‌పి నుంచి, దళితులను బిఎస్‌పి నుంచి ఆకర్షించనిదే ఉపయోగం లేదనుకున్నారు. ఆ క్రమంలో ఆ రెండు పార్టీలకు ఆగ్రహం కూడా తెప్పించారు. కాని ఇదంతా ఒక పరిమిత స్థాయిలో మిగిలిపోగా అంతిమంగా ఆయన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఆ స్థితి కొన్ని దశాబ్దాల పాటు కొనసాగటం వల్లనే



లోక్‌సభకు సంబంధించినంత వరకు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీలు గెలుస్తున్నారంటే అది కాంగ్రెస్ స్వంత బలం వల్ల కాదన్నది బహిరంగ రహస్యం. నెహ్రూ – గాంధీ కుటుంబం పట్ల గల సంప్రదాయిక గౌరవం వల్ల ఇటువంటి ప్రతిపక్షాలు అక్కడ బలహీనమైన అభ్యర్థులను నిలబెడుతూ వస్తున్నాయి. ఈసారి కూడా ఇటీవలనే ఎన్నికల ఒప్పందానికి వచ్చిన ఎస్‌పి, బిఎస్‌పిలు ఆ రెండు సీట్లను కాంగ్రెస్‌కు వదలివేయటం తెలిసిందే. అనగా ఈసారి కనీసం బలహీన అభ్యర్థులను అయినా రంగంలోకి దింపటంగాక పూర్తిగా గాంధీ కుటుంబానికి వదిలి వేశారన్నమాట.

కాంగ్రెస్ ఈ రోజున దయనీయ స్థితిలో ఉంది. దీనిని ప్రియాంక మార్చగలరా?

వాస్తవానికి ఈ స్థితి రాహుల్, ప్రియాంకల నాయనమ్మ ఇందిరా గాంధీ కాలంలోనే మొదలైంది. రాజకీయ అవగాహన, ఎత్తుగడలలో ఉద్దండురాలైన ఆమె హయాంలోనే మొదలైన క్షీణ దశకు బలమైన కారణాలున్నాయి. గరీబీ హటావో నినాదంతో మొదలైన తన పరిపాలన రైతులకు, బడుగులకు చేసిన మేలు లేకపోయింది. వారితోపాటు అల్ప సంఖ్యాక వర్గాలు కూడా అసంతృప్తి చెందాయి. మరొక వైపు ఈ వర్గాలకు స్వంత పార్టీలు ఏర్పడటం, లేదా ఉన్నవి బలపడటం, ఆయా వర్గాల అస్తిత్వం కోసం ప్రత్యేక ప్రయోజనాల కోసం పోరాటం చేయసాగాయి. ఆ పరిణామాల మధ్య ముందుకు వచ్చిన బిజెపి అగ్రవర్ణాల ఓట్లను ఆకర్షించింది. ఇక కాంగ్రెస్‌కు మిగిలిన వారు లేకపోయారు. ఆ విధంగా ఇందిర కాలంతో మొదలైన క్షీణ దశను రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ వెనకకు తిప్పలేకపోయారు. వారిద్దరి వల్లకాని పనిని రాహుల్ మాత్రం ఎట్లా చేయగలరు? అందువల్లనే అమేథీ, రాయబరేలీ కోసం ఇతర పక్షాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసి వచ్చింది. ఇపుడు 2019 కోసం కూడా అదే జరుగుతున్నది. ఇటువంటి దయనీయమైన స్థితి కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తున్నపుడు, ప్రియాంక నియామకం వల్ల జరిగేది ఏమిటో ఊహించటం కష్టం కాదు.

ప్రియాంక ఇందిరను పోలి ఉంటుందని, కనుక ప్రజలు ఆటోమేటిక్‌గా కాంగ్రెస్‌కు ఓటు వేస్తారని కాంగ్రెస్ నాయకత్వం నిజంగా నమ్ముతున్నదో లేదో తెలియదుగాని పైకి మాత్రం తమ కార్యకర్తలను ఉత్సాహపరిచేందుకు, ఓటర్లను నమ్మించేందుకు ఇటువంటి మాటలు మాట్లాడుతున్నారు. కేవలం పోలికల వల్ల ఓటు వచ్చే పరిస్థితి ఉంటే ఆ పోలికలు గతంలోనూ ఉండిన స్థితిలో అపుడెందుకు ఎన్నికలలో పని చేయలేదు? ఆమెను చూసేందుకు గుంపులు ఉత్సుకత చూపటం వేరు, ఓటు వేయటం వేరు. ప్రజలు అమాయకులు కారు. పైగా అనేక సంవత్సరాల పాటు కాంగ్రెస్ పరిపాలనను చూసి నిరాశ చెందిన వివిధ వర్గాలు చిరకాలం కిందటనే ఇతర పార్టీల వైపు వెళ్లిపోయిన తర్వాత ఆ నిరాశల అనుభవాలన్నింటిని మరచిపోయి కేవలం ఇందిరా గాంధీతో పోలికలు ఉన్నాయని తిరిగి కాంగ్రెస్ వైపు వస్తారా? ఇది ప్రజల వివేకాన్ని ప్రశ్నించటం అవుతుంది. పైగా అదే ప్రజలు సాక్షాత్తూ ఇందిర గాంధీనే తిరస్కరించిన తర్వాత కేవలం ఆమెను పోలిన వ్యక్తిని చూసి సమ్మోహితులు కాగలరా?

ఇంతకన్నా ముఖ్యమైన విషయాలు రెండున్నాయి. ప్రియాంకకు ఇందిరతో పోలికలు ఉండటం సరే. కాని ఇంతకూ ప్రియాంక ఆలోచనా ధోరణి ఏమిటన్నది మొదటి విషయం. ఆర్థిక, రాజకీయ, సామాజిక విషయాలపై, ప్రజలూ దేశం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ఆమె ఆలోచనలు ఏమిటో మనకు ఆవగింజంత అయినా తెలియదు. తను వాటి గురించి ఇన్ని సంవత్సరాలలో ఎప్పుడూ మాట్లాడలేదు. అయినప్పటికీ అకస్మాత్తుగా, కేవలం ఒక కుటుంబపు వారసులుగా వచ్చి, ఇంత పెద్ద పార్టీకి ప్రధాన కార్యదర్శిగా నియమితురాలైపోయారు. ఆ హోదాలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యురాలు కూడా అవుతున్నారు. ఇపుడు ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వర్కింగ్ కమిటీ సభ్యులవుతారన్న మాట. అయినప్పటికీ కాంగ్రెస్ వారు ఇతరులను కుటుంబ వారసత్వాలు, పాలనలు అంటూ నిందిస్తారన్నది అట్లుంచితే, ప్రియాంక గాంధీకి వచ్చిన వారసత్వ భావజాలం ఏమిటో, ఆ భావజాలం విఫలమైన స్థితిలో తన కొత్త భావనలు ఏమైనా ఉన్నాయేమో మనకు తెలియదు. అవి ముందుగా ప్రజలకు తెలిసినట్లయితే గాని వాటిని ఆదరించాలో లేదో, ఎంతవరకు విశ్వసించవచ్చునో వారొక అభిప్రాయానికి రాలేరు. అదేమీ లేకుండా కేవలం ముఖ పోలికలు చూసి ఓట్లు వేసేంత చైతన్య రహితంగా, అనుభవరాహిత్యంగా ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంత ప్రజలు ఉన్నట్లు భావించగలమా?

ఇది ప్రియాంక భావజాలలకు సంబంధించిన ప్రశ్న కాగా, రెండవది ఆమె సమర్థతకు సంబంధించినది. పార్టీ వ్యవహారాలు, ఎన్నికల వ్యవహారాల నిర్వహణలో తన సమర్థత ఏమిటో మనం ఇంతవరకు ఏమీ చూడలేదు. ఇతర పక్షాలు బలహీనమైన అభ్యర్థులను పోటీకి నిలబెట్టగా రెండు నియోజక వర్గాలలో పైపైన తిరిగి గెలవటానికి, గట్టి పోటీలు ఉండే 30కి పైగా సీట్లు గల తూర్పు యుపిలో పార్టీ నిర్వహణ, ఎన్నికల ప్రచార నిర్వహణకు భూమ్యాకాశాల అంత తేడా ఉంటుంది. రాష్ట్రంలో ఎట్లాగూ పార్టీ అధోస్థితిలో ఉన్నందున ఎన్ని సీట్లు గెలిచినా, ఎన్ని ఓడినా రాగల తేడా ఏమిటని ఎవరైనా వాదించవచ్చు. ఒక విధంగా అది నిజమే. కాని వ్యక్తిగతంగా ప్రియాంక ఓట్ల ఆకర్షణ శక్తి గురించి, గెలుపు సామర్థ్యం గురించి ఆమెను ఆకాశానికి ఎత్తుతూ సాగుతున్న ప్రచారం మాటేమిటి? ప్రశ్న బిజెపి, ఎస్‌పి, బిఎస్‌పిలలో ఎవరు ఓడి ఎవరు గెలుస్తారన్నది కాదు. స్వయంగా కాంగ్రెస్‌కు రాగల సీట్లు ఎన్ని అనేది ప్రశ్న. రాష్ట్రంలో అన్ని చోట్లా పోటీ చేయగలమని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించిన స్థితిలో, ఆమెకు గల ప్రశ్న సీట్ల గెలుపు మాత్రమే.

అమెరికా, ఆస్ట్రేలియాలకు వలసలు



నాగేందర్ రెడ్డి కాసర్ల
(అధ్యక్షుడు టిఆర్ఎస్ ఆస్ట్రేలియా)

వలస పక్షులు ఒక ప్రాంతం నుండి ఇంకో ప్రాంతానికి గుడ్లు పెట్టే స్థలాల కోసం, ఆహార సేకరణ కోసం, వాతావరణ అననుకూలత నుంచి తప్పించుకోడం కోసం వలస పోవడం జరుగుతాయి. అలాగే మనుషులు ఒక ప్రాంతం నుండి ఇంకో ప్రాంతానికి పని కోసం, ఆహారం కోసం, మంచి భవిష్యత్తు కోసం వలస పోవడం పురాణాల నుండి జరుగుతుంది. వలసలకు హద్దులు, ఎల్లలు లేవు. సప్త సముద్రాలూ కూడా దాటి భవిష్యత్తు వెతుక్కుంటారు.

వలసల వల్ల మానవాభివృద్ధి, సమాజంలో మార్పు, సంపద సృష్టికి బాటలు వేస్తున్నాయి. ఉన్న ఊరిని వదిలిపెట్టి వెళ్లినవారు పేదరికం నుంచి బయటపడటం ఖాయమని ఒక కచ్చితమైన అభిప్రాయం సమాజంలో ఉంది. వలస వెళ్లిన కుటుంబాలు దారిద్ర్యాన్ని అధిగమించినట్లు సర్వే లు కూడా వెల్లడిస్తున్నాయి. ఇక మన తెలుగు వారి వలసలు బయటి దేశాలకు స్వాతంత్ర్యం తర్వాత రెండు రకాలుగా జరుగుతున్నాయి. ఒకటి ఉన్నత చదువుకున్నవారు గొప్ప ఉద్యోగాల కోసం విదేశాలకు అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్ , కెనడా లాంటి దేశాలకు వెళ్లడం, రెండు ఉన్నత చదువులు లేక ఇక్కడ ఉపాధి లేక కూలీలుగా దుబాయ్, మస్కట్, మలేషియా, సింగపూర్ లాంటి దేశాలకు వలస వెళ్తున్నారు.

గత దశాబ్దంలో భారత ఐటి పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో భారత ఐటి ఇంజనీర్లలో ఎక్కువమంది విదేశాల్లో అవకాశాల కోసం చూశారు. ఈ ధోరణి 1990లో నుంచి ప్రారంభమైంది. ఐఐటిలు వంటి ప్రముఖ కళాశాలల నుండి గ్రాడ్యుయేట్లు అమెరికాకు కన్సల్టెంట్‌గా వచ్చారు . భారతదేశం 'మెదడులను' స్మార్ట్ బ్రెయిన్‌లుగా అక్కడ పరిగణించారు. కానీ దురదృష్టవశాత్తు, గత 4 నుండి 5 సంవత్సరాలలో, ఈ ధోరణి మారింది. అమెరికాకు వెళ్లే భారత ఐటిల గుంపు రోజురోజుకు క్షీణిస్తున్నది. దీనికి ముఖ్యంగా ఆర్థిక మాంద్యం (గ్లోబల్ రిసెషన్ , ట్రంప్ వలసల పై ఒంటి కాలితో లేవడం ముఖ్య కారణాలు. ఐతే ఇప్పుడు ఉన్నత విద్య కోసం, ఉన్నత ఉద్యోగాల కోసం వెళ్లేవారు అమెరికాను వదిలి ఆస్ట్రేలియా వైపు చూస్తున్నారు. ఆస్ట్రేలియా దేశం అన్నింటికీ అణువుగ ఉండడం ముఖ్యంగా ఇక్కడి ఇమ్మిగ్రేషన్ రూల్స్ మన వారికీ అనువుగా ఉండటమే.

19 వ శతాబ్దం తొలినాళ్ళలో చిన్న సంఖ్యలో అమెరికా మొదటిసారిగా వలస వెళ్లిన వారు ప్రధానంగా తక్కువ నైపుణ్యం గల వ్యవసాయ కార్మికులు. ఇటీవలి దశాబ్దాల్లో జనాభా గణనీయంగా పెరిగి 2.5 మిలియన్ల మంది భారతీయ వలసదారులు 2017 నాటికి అమెరికాలో నివసిస్తున్నారు. ఇది మెక్సికన్లు తర్వాత భారతదేశం నుండి రెండవ అతిపెద్ద వలసదారుల సమూహం. 1960లో కేవలం 12,000 మంది భారత వలసదారులు అమెరికాలో నివసిస్తున్నారు. 9.7 మిలియన్ల మొత్తం జనాభాలో 0.5 శాతం కంటే తక్కువగా ఉన్నారు.

భారతదేశం నుండి 1965–1990 మధ్య వలసల జాతీయ మూలాధార కోటాలను తొలగించాయి. తద్వారా తాత్కాలిక నైపుణ్యం గల కార్మికుల కార్యక్రమాలు ప్రవేశపెట్టబడ్డాయి, ఉపాధి ఆధారిత శాశ్వత వీసాలు సృష్టించబడ్డాయి. 2016లో అత్యధిక భారతీయులు అధిక నైపుణ్యం కలిగిన హెచ్ 1 బి తాత్కాలిక వీసాలను స్వీకరించారు . అమెరికాలో అంతర్జాతీయ విద్యార్థుల రెండవ అతి పెద్ద సమూహం భారతీయులే. 1980 నుండి 2010 వరకు, జనాభా పదకొండు రెట్లకు పైగా పెరిగింది. 2013లో భారతదేశం, చైనాలు అమెరికాకు కొత్తగా వచ్చిన వలసదారుల్లో అగ్రస్థానంలో నిలిచింది.

ఆస్ట్రేలియా

19వ శతాబ్దం ప్రారంభంలో భారతదేశంలో కొద్ది మంది భారతీయులు ఆస్ట్రేలియాలో బ్రిటీష్ వలస రాజ్య ప్రభుత్వానికి రవాణా చేయబడ్డ నేరస్థులుగా వచ్చారు. ఇతరులు భారతదేశంలో నివసిస్తున్న బ్రిటీష్ వ్యక్తులతో కార్మికులుగా వచ్చారు. అప్పట్లో భారతీయ కార్మికులను పెద్ద స్థాయిలో నియమించేందుకు చేసిన ప్రయత్నాలకు ఆస్ట్రేలియా ప్రజలు పెద్దగా మద్దతు ఇవ్వలేదు. భారతదేశ వలసలను పరిమితం చేసేందుకు వైట్ ఆస్ట్రేలియా పాలసీ అందుకే ప్రవేశపెట్టబడింది. 1947లో బ్రిటన్ నుండి భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత భారతదేశంలో జన్మించిన బ్రిటీష్ పౌరులను ఆంగ్లో ఇండియన్లతో పాటు ఆస్ట్రేలియాకు వలస వచ్చారు. 2016 జనాభా లెక్కల ప్రకారం ఆస్ట్రేలియాలో భారతీయ జనాభా 455,389 కు పెరిగి 295,362 మంది జనాభా గణనను నమోదు చేసింది.

2016 జూన్ 30 నాటికి ఆస్ట్రేలియా జనాభాలో 28 శాతం మంది విదేశీయులు జన్మించారు. 2017 మార్చిలో ఆస్ట్రేలియన్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ (ఎబిఎస్) విడుదల చేసిన గణాంకాల ప్రకారం. నికర విదేశీ వలసల పెరుగుదలతో, ఎబిఎస్ భారతదేశంలో జన్మించిన వ్యక్తులను ఆస్ట్రేలియన్ జనాభాలో 1.9%గా గుర్తించారు. ఆస్ట్రేలియాలో నివసిస్తున్న 468,800 మంది ప్రజలు భారతదేశంలో జన్మించినట్లు నమోదు చేయబడ్డారు. ఇందులో సుమారుగా యాభై వేల ప్రజలు తెలుగువారు ఉన్నారు. విద్యార్థి వీసా అవసరాల కోసం భారతదేశం ఇటీవల అధిక ప్రమాదం దేశం నుండి అతి తక్కువ ప్రమాదం దేశంగా ఆస్ట్రేలియా ఇమ్మిగ్రేషన్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ డిపార్ట్‌మెంటు గుర్తించింది. ఇది అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యను పెంచుతుంది.

క్రైమ్ రేటు

ఆస్ట్రేలియాలో నేరం రేటు చాలా తక్కువగా ఉండటం. ఇక్కడ నేరస్థుల సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. అమెరికాలో నేరం రేటు ఎక్కువగా ఉండటమే కాదు మన వారిపై జాత్యహంకార దాడులు అధికం కావడం.. ఇటీవల తెలుగు వారు ఈ దాడులలో ప్రాణాలు కోల్పోవడం అమెరికాపై భయాందోళనలకు గురి చేస్తుంది.

జీవితపు నాణ్యత

ఆస్ట్రేలియాలో మెరుగైన జీవన నాణ్యత ఉంది. సిడ్నీ , మెల్‌బోర్న్ అత్యంత అందమైన ప్రపంచంలో అత్యంత నివాసయోగ్యమైన నగరాలుగా పరిగణించబడుతున్నాయి. రాష్ట్ర రాజధాని నగరాల్లో నాలుగు పెర్త్, మెల్‌బోర్న్, సిడ్నీ, అడిలైడ్‌లలో అన్నింటికంటే టాప్ 10లో నివశించే నగరాలు. అమెరికాలో ఇటువంటి గొప్ప నగరాలు లేవు.

పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్

యూరప్, అమెరికాల కన్నా ప్రజల మౌలిక సదుపాయాలు ఇక్కడ చాలా మంచివి. సాపేక్షికంగా చిన్న జనాభాతో, ప్రభుత్వం ప్రజా అవస్థాపన, ప్రజా స్మారక, ఇతర ప్రజా భవనాల విస్తరణ, నిర్వహణలో పెట్టుబడి పెడుతుంది. సిడ్నీ ఒపెరా హౌస్ ప్రపంచంలో అత్యంత అధునాతన సమకాలీన మౌలిక సదుపాయంగా ఉంది. రెండు దేశాలలో మౌలిక వసతులైన రోడ్, రవాణా, పోలీస్, రెవెన్యూ, ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ లాంటి ఇతర వ్యవస్థలు చాల పటిష్టంగా ఉన్నాయి .

ప్రభుత్వ విధానాలు

ఆస్ట్రేలియా మొదట ఆస్ట్రేలియాలో నివసించే వారి గురించి శ్రద్ధ తీసుకుంటుంది. అమెరికాలో, ఇతర దేశాల సమస్యల గురించి ప్రభుత్వం మొదట శ్రద్ధ తీసుకుంటుంది. అప్పుడు అమెరికన్లు పక్కన పడటం, అమెరికా లోపరిష్కరించని సమస్యలను వదిలివేస్తారు. ఆస్ట్రేలియాలో ప్రభుత్వం మరింత పారదర్శకంగా, జవాబుదారీగా ఉంది. ఆస్ట్రేలియాలో బడ్జెట్ ఆమోదించబడకపోతే వారు కొత్త ప్రభుత్వాన్ని తిరిగి ఎన్నుకోవాలి.

ఉద్యోగ అవకాశాలు

ఆస్ట్రేలియాలో సగటు గంటకు ఆదాయం 21 డాలర్లగా ఉంది. అమెరికాలో ఇది 5.50 డాలర్లు తక్కువగా ఉంటుంది. తక్కువ జనాభా కారణంగా ఇది జరుగుతుంది. ఆస్ట్రేలియా హ్యూమన్ రిసోర్స్ గొప్పదిగా పరిగణించబడుతుంది. అమెరికాతో పోల్చితే ఆస్ట్రేలియా దేశ జనాభా సుమారుగా రెండు కోట్ల ఇరవై లక్షలు అంటే మన తెలంగాణ జనాభా కంటే తక్కువ. కాబట్టి ఇక్కడ ఉద్యోగ అవకాశాలు అదే నిష్పత్తి లో ఉంటాయి. అమెరికా లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువ ఇక్కడితో పోల్చితే. అలాగే ఐటి రంగం అమెరికాలో విస్తృతంగా వ్యాపించింది. ఆస్ట్రేలియా ఇప్పుడిప్పుడే ఐటి రంగం వ్యాప్తి చెందుతుంది.

అసమానతలు

అన్ని నగరాల్లో అమెరికా, ఆస్ట్రేలియా అభివృద్ధి చెందింది. అమెరికాలో అరిజోనాలో, లాస్ వెగాస్‌లో విపరీతమైన పేదలు ఉన్నారు. లాస్ వెగాస్, న్యూయార్క్, వాషింగ్టన్ డిసి, లాస్ ఏంజెల్స్, అమెరికాలోని అతిపెద్ద నగరాల్లో కొన్ని, ఆస్ట్రేలియాలోని సిడ్నీ, మెల్‌బోర్న్ వంటి నగరాలలో పేదలుగా ఉన్న కొన్ని కౌంటీలో ప్రాంతీయ అసమానతలుఉన్నాయి .

సహజ సౌందర్యం

ఆస్ట్రేలియా జీవన శైలి రోజువారీ మార్పులేని రొటీన్‌ల వెల్లదీస్తారు. అలాగే ఈ ప్రాంతం గొప్ప ప్రకృతి అద్భుతాలను కలిగి ఉంది. గ్రేట్ బారియర్ రీఫ్, పింక్ సరస్సు, సొరచేప బే, బ్లూ మౌంటైన్స్, గ్రేట్ ఓషన్ డ్రైవ్, ఐలాండ్స్. పిన్నకిల్స్ డెజర్ట్ వంటి అందమైన, సుందరమైన దృశ్యలు. అమెరికాలో జీవన శైలి చాలా బిజీగా ఉంటుంది. అమెరికా ఐతే గొప్పగొప్ప సుందర ప్రదేశాలకు నిలయం. పాఠశాలల్లో విద్యార్థులందరికి అన్ని కేటగిరీలు, విషయాలలో ఆస్ట్రేలియా ఉత్తమ ఫలితాలను అందిస్తున్నది. ఉపాధ్యాయుల శిక్షణ, విషయ అంశాలకు అధిక ప్రమాణాల కారణంగా ఇది ఉంది. సిడ్నీ, మెల్‌బోర్న్ ప్రపంచ వ్యాప్తంగా ఉత్తమ ఉత్తీర్ణత శాతం, ఫలితాలను కలిగి ఉంది. వీటన్నికీ తోడు వృత్తి నైపుణ్యత, ఆ రంగంలో అనుభవం ఉన్న వారికీ ఆస్ట్రేలియా దేశం ఆ అభ్యర్థి కుటుంబానికి నేరుగా శాశ్వత వీసాలు ఇవ్వడం జరుగుతుంది. కుటుంబం తోసహా ఆస్ట్రేలియా రావడం అనేది ఇక్కడ గొప్ప మౌలిక వసతులు ఉండడం వలన ఆస్ట్రేలియా దేశం ఎక్కువ మందిని ఆకర్షిస్తుంది.

ఆడపిల్ల పుట్టుకే ప్రశ్నార్థకమా?



వాసిలి సురేష్
9494615360

జనాభాలో ప్రతి వెయ్యి మంది పురుషులకు ఎంతమంది స్త్రీలు ఉన్నారో తెలిపేదే లింగ నిష్పత్తి. ఒక సమాజంలో, ఒక నిర్దిష్ట కాలంలో సమానత్వం ఎంత ఉందో తెలుసుకోవడానికి ముఖ్యమైన సామాజిక సూచికగా లింగ నిష్పత్తి ఉపయోగపడుతుంది. భారతదేశంలో పురుషుల కంటే ఎప్పుడూ స్త్రీల సంఖ్య తక్కువగానే ఉంది. ఇటీవల విడుదల చేసిన సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టం నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో బాలబాలికల నిష్పత్తిలో అంతులేని అంతరం ఉన్నట్లు తెలుస్తోంది.

2007 నుంచి 2016 కి ఆంధ్రప్రదేశ్ బాలబాలికల నిష్పత్తి దేశంలోకెల్లా అత్యంత దారుణంగా పడిపోవడం సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో బాలబాలికల నిష్పత్తి 2007 నుంచి 2016కి 168 పాయింట్లు పడిపోయి ప్రతి వెయ్యి మంది మగ పిల్లలకు కేవలం 806 మంది మాత్రమే ఆడపిల్లలు ఉన్నట్లు తెలుస్తుంది. 2007లో 974 మంది ఆడపిల్లలంటే ఆ సంఖ్య తీవ్రంగా పడిపోవడం ఆందోళన కలిగించే విషయం.

తెలంగాణ ఆవిర్భావం తర్వాత బాలబాలికల నిష్పత్తి ప్రతి వెయ్యి మంది బాలురకు 954 మంది బాలికలు ఉంటే, 2016 నాటికి 73 పాయింట్లు పడిపోయి బాలికల సంఖ్య మరింత క్షీణించి 881 చేరింది. ఈ స్త్రీ పురుష నిష్పత్తి లేదా లింగ నిష్పత్తి నేడు ఆందోళన కలిగించే విషయం. ఎందుకంటే ఈ నిష్పత్తిని బట్టి స్త్రీలపట్ల వివక్ష ఎంత తీవ్రంగా ఉందో వెల్లడవుతోంది. బాలికలకు విద్య, అభివృద్ధిలో సమాన అవకాశాలు లభించడం లేదు. అత్యం త మౌలికమైన పోషకాహారం, శిశు సంరక్షణ, వైద్యం వంటి వాటిల్లో కూడా స్త్రీలు వివక్షకు గురవుతున్నారు. అంటే మగ పిల్లలకు ఇవి అందినంతగా ఆడపిల్లల అందడం లేదు.

ఒకే కుటుంబంలోనే ఇలా జరుగుతున్నది. ఇటువంటి వివక్ష అన్నిసార్లు బయటకి కనబడడం లేదు. వివక్షత ఉందని తెలిసినా ఎవరు ఒప్పుకోరు. అయితే మొత్తం జనాభాలో ఈ వివక్షత జరుగుతుందని కొన్ని సూచికల ద్వారా అర్థం అవుతుంది. ఒకే పరిస్థితులు ఉంటే మగపిల్లల కన్నా ఆడపిల్లలు ఎక్కువగా మనగలుగుతారుని వైద్య పరిశోధనలు చెబుతున్నాయి. అంటే వివక్ష లేకపోతే మగపిల్లల కంటే ఆడపిల్ల సంఖ్య ఎక్కువగాని లేదా సమానంగా గాని ఉండాలి. కానీ దీనికి విరుద్ధంగా సర్వేల, సైన్సెస్‌ల నివేదికను ఉంటున్నాయి. వీటి ద్వారా ఆడపిల్లల సంఖ్య తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆడపిల్లలు బతకడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నప్పటికీ వారి జనాభా శాతం తగ్గుతుంది అంటే వారి పోషణ, సంరక్షణలో వివక్ష ఉన్నట్లు తేటతెల్లం అవుతున్నది. మహిళలకు సమానత్వం, సమాన అవకాశాలు కల్పించిన సమాజాలను లేదా ప్రాంతాలను గమనించినట్లయితే లింగ నిష్పత్తి వేరేగా ఉంటుంది. అంటే అభివృద్ధి చెందిన దేశాలు, సమాజంలో స్త్రీల జనాభా పురుషుల కన్నా అధికంగా ఉంటుంది. స్త్రీ పురుషుల మధ్య అసమానతలు ఉండి పురుషులకు అనుకూలంగా స్త్రీల పట్ల వివక్షతో వ్యవహరించే ప్రాంతాలలో లింగ నిష్పత్తి అసమానంగా ఉంటుంది. ఆయా ప్రాంతాలలో అధిక ఆదాయ మార్గాలు ఉన్నప్పటికీ ఇలానే జరుగుతున్నది. ఆడపిల్ల కంటే మగ పిల్లవాడు పుట్టాలని కోరుకునే లింగ వివక్ష గల భారత దేశంలో ఇది రోజురోజుకూ పెరుగుతూనే ఉంది కాని తగ్గేలా లేదు.

మగ పిల్లలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఆడపిల్లల్లో మరణ శాతం అధికంగా ఉంటుంది, మగ పిల్లలకిచ్చే సంరక్షణ, శ్రద్ధలతో పోలిస్తే ఆడపిల్లల ఆరోగ్యం గురించి, జబ్బుల గురించి పట్టించుకోకపోవడం వల్ల ఇలా జరుగుతుంది. మగ పిల్లవాడిని కావాలనుకోవడం వల్ల గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలుసుకొని భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం లింగ నిర్ధారణ, గర్భస్థ దశకు ముందే మగ పిండాన్ని ప్రవేశపెట్టే టెక్నాలజీ అందుబాటులోకి రావడం ఆడపిల్లలకు జననం లేకుండా చేస్తోంది. దీనిపై పోరాడేందుకు సరైన చట్టాలుగాని నియమ నిబంధనలు గాని లేవు. మనదేశంలో ఆడపిల్లల పట్ల వివక్ష కొనసాగినంతకాలం ఈ లింగ నిష్పత్తిలో గల తేడాలను సరి చేయలేము.

లింగ నిష్పత్తిలో గల తేడాలు రూపుమాపాలంటే స్త్రీలపట్ల గల వివక్ష తగ్గాలి. ఆడైనా, మగైనా ఒక్కటిగా చూడగలగాలి, వారిని ఆరోగ్యంగా పెంచడం, మంచి విద్యను అందించడం జరిగినప్పుడే దేశానికి, కుటుంబానికి మేలు జరుగుతుంది. ప్రధానంగా బాలికావిద్యపై శ్రద్ధ పెట్టి ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. మహిళల పట్ల వివక్ష తగ్గించడానికి మహిళల చదువు మాత్రమే బలమైన శక్తిగా ఉపయోగపడుతుంది.మహిళల అక్షరాస్యత బాలికా విద్య వల్ల బాలికల మరణ శాతం తగ్గేందుకు, ఆడపిల్లల ఆరోగ్యంపట్ల చూపించే వివక్షత తగ్గించేందుకు దోహదపడుతుంది. ఆడపిల్లల పట్ల వివక్షతను రూపుమాపడానికి తగిన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్గాలను అన్వేషించాలి. ఏ రూపంలో అయినా వరకట్నం తీసుకోవడాన్ని నిషేధించాలి. లింగ నిర్ధారణ పరీక్షలు, అక్రమ అబార్షన్లు వాటికి సంబంధించిన నిబంధనలను కఠినతరం చేయాలి, కఠినంగా అమలు చేయాలి. ఉల్లంఘించిన వారికి కఠిన శిక్షలు వేయాలి. అన్ని రంగాలలో అమ్మాయిలకి అబ్బాయిలతో సమానంగా సమాన హక్కులు అవకాశాలు కల్పించాలి.



కామధేను

● రూ. 750 కోట్లతో నిధి ఏర్పాటు

న్యూఢిల్లీ : నరేంద్రమోడీ ప్రభుత్వం 2019 తాత్కాలిక బడ్జెట్‌లో గోవుల సంక్షేమానికి 'రాష్ట్రీయ కామధేను ఆయోగ్' పేరుతో ఒక కమిషన్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించింది. బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తాత్కాలిక ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ పథకం గురించి మాట్లాడుతూ ...'గోవనరుల్లో సుస్థిరమైన జన్యు మెరుగుదల, ఆవుల సంతతిని, వాటి ద్వారా వచ్చే ఉత్పాదకతను పెంచేందుకు రాష్ట్రీయ కామధేను ఆయోగ్ పథకం దోహదం చేస్తుంది. ఈ పథకాన్ని రూపొందించామని వెల్లడించేందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. గోమాత సంరక్షణ విషయంలో ప్రభుత్వం ఎన్నడూ వెనకడుగు వేయదు. ఈ సంవత్సరంలోనే రాష్ట్రీయ గోకుల్ మిషన్‌ను రూ.750 కోట్ల నిధిని ఏర్పాటు చేస్తున్నాం' అని వివరించారు.

రాజ్యాంగానికి లోబడే ఆయోగ్

'పశు సంవర్ధక రంగం, మత్స్య పరిశ్రమ రంగానికి తగిన రీతిలో అండదండలు అవసరం. ఆవులకు సంబంధించిన చట్టాలు, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు జరిగేలా కూడా ఆయోగ్ పర్యవేక్షిస్తుంది. పశుసంవర్ధక , మత్స్యరంగాలతో సంబంధం ఉన్న రైతులకు రెండు శాతం వడ్డీ రాయితీని కూడా ఈ తాత్కాలిక బడ్జెట్ కల్పించింది' అని పీయూష్ గోయల్ తెలిపారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర తాత్కాలిక ఆర్థిక మంత్రి ...'రాజ్యాంగంలోని అంశాలకు లోబడే గో సంక్షేమానికి ప్రతిపాదన చేశాం. గోవుల సంక్షేమానికి పనిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని, అది ప్రభుత్వ విధానంగా ఉండాలని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు నిర్దేశిస్తున్నాయి.

హోంశాఖకు రూ.1,03,000 కోట్లు



న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో తొలిసారిగా హోంశాఖకు కేటాయింపులు రూ.లక్ష కోట్లు మార్కును దాటింది. సరిహద్దులో పోలీసు బలగాల మౌలిక సౌకర్యాలు పెంపొందించేందుకు రూ.1,03,000 కోట్లు కేటాయించారు. గత ఏడాది కంటే 4.9 శాతం అధికంగా నిధులు ఇచ్చారు. 201819 బడ్జెట్‌లో హోంశాఖకు రూ.99.034 కోట్లు కేటాయించారు. ఇండో-పాక్, సైన-ఇండియన్ సరిహద్దుల్లో ఉద్రిక్తల సమయంలో మౌలిక సౌకర్యాల అభివృద్ధికి రూ. 2 వేల కోట్లు , దేశ రాజధాని ఢిల్లీలో శాంతి, భద్రతల పరిరక్షణకు రూ. 7,496.91 కోట్లు కేటాయించారు. సిఆర్‌పిఎఫ్‌కు 23,742.04 కోట్లు కేటాయించారు. 201819 బడ్జెట్‌లో రూ.22,646.63 కోట్లు ఇచ్చారు. ఇండోపాక్, ఇండోబంగ్లాదేశ్ సరిహద్దుల్లో విధులు నిర్వహించే బిఎస్‌ఎఫ్‌కు బడ్జెట్‌లో రూ.19,647.59 కోట్లు కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరంలో 18,585.96 కోట్లు ఇచ్చారు. సిఏపిఎస్, సిఆర్‌పిఎఫ్, బిఎస్‌ఎఫ్ ఎస్ఎస్‌బి, అస్సాం రైఫిల్స్, ఎన్ఎస్‌జిలతో కలిపి మొత్తం బలగాలకు ప్రస్తుతం రూ.71,618.70 కేటాయించారు. 201819 బడ్జెట్‌లో రూ.67,779.75 కోట్లు కేటాయించారు. ఇంటెలిజెన్స్ బ్యూరోకు రూ.2,198.35 కోట్లు కేటాయించారు. గత ఏడాది రూ. 2,056.05 కోట్లు కేటాయించారు. ఎస్‌పిజి ప్రస్తుతం రూ.530.75 కోట్లు కేటాయించగా , గత ఆర్థిక సంవత్సరంలో రూ.411.68 కోట్లు ఇచ్చారు. సరిహద్దులో మౌలిక సౌకర్యాల అభివృద్ధి, బరాక్‌లు, నివాస క్వార్టల నిర్మాణం, వాహనాలు, ఆయుధాలు, మందుగుండ్ల కొనుగోళ్లకు గానూ ఈ బడ్జెట్‌లో రూ.5117 కోట్లు కేటాయించారు. పోలీస్ శాఖ ఆధునికీకరణకు రూ.33.78 కోట్లు సరిహద్దు మౌలిక సౌకర్యాలు, నిర్వహణకు రూ. 2 వేల కోట్లు, మహిళల రక్షణ, సాధికారత కోసం రూ. 1,330 కోట్లు, సరిహద్దు ప్రాంత అభివృద్ధికి రూ.825 కోట్లు, వలస వచ్చిన వారికి సహాయ, పునరావాసం, జమ్మూ కశ్మీర్ నుంచి వచ్చిన వారిని తిరిగి పంపేందుకు రూ. 809 కోట్లు, స్వాతంత్ర్య సమర యోధుల పింఛన్లకు రూ.953 కోట్లు కేటాయించారు. మహిళ రక్షణకు 'నిర్భయ నిధి'కి రూ.50 కోట్లు కేటాయించారు. జాతీయ విపత్తుల పరిరక్షణ దళానికి రూ.10 వేల కోట్లు కేటాయించారు. 2021 జనాభా లెక్కల సేకరణ ప్రారంభమైన నేపథ్యంలో రూ.541.33 కోట్లు, కశ్మీర్ ప్రత్యేక పరిశ్రమల స్థాపనకు రూ.50 కోట్లు, హిందీ భాషా వ్యాప్తికి రూ.78.09 కోట్లు, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు గ్రాంట్ ఇన్ ఎయిడ్‌కు 4895.81 కోట్లు కేటాయించారు. అండమాన్ నికోబార్‌కు రూ.4817.48 కోట్లు, చండీగఢ్‌కు రూ.4291.70 కోట్లు, దాద్రా నగర్ హవేలికి రూ.1,177.99 కోట్లు, డామన్, డయ్యూకు రూ.821.4 కోట్లు, లక్షద్వీప్‌కు రూ.1276.74 కోట్లు కేటాయించారు. 201819 బడ్జెట్‌లో ఢిల్లీకి రూ.1,112 కోట్లు, పుదుచ్చేరికి రూ.1,545 కోట్లు కేటాయించారు.



కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని ప్రకటిస్తుండగా గట్టిగా బల్లను చరుస్తున్న ప్రధాని, చిత్రంలో రాహుల్ హావభావాలు కూడా చూడొచ్చు

" మోడీ ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్. ఈ తాత్కాలిక బడ్జెట్ ఢిల్లీని పూర్తిగా నిరాశపరిచింది. కేంద్రం వసూలు చేసే పన్నుల్లో మా వాటా రూ.325 ఉంది. అందుకు తగ్గట్టు ఢిల్లీ స్థానిక సంస్థలకు బడ్జెట్‌లో ఏమీ కేటాయించలేదు. మా మీద సవతి తల్లి ప్రేమ చూపించారు. ఇకముందు కూడా మేము మా సొంత ఆర్థిక వనరులమీదే ఆధారపడాలి. నా దృష్టిలో... కేంద్ర బడ్జెట్‌లో విద్య, ఆరోగ్య రంగాలకు ఎక్కువ పెట్టుబడులు ఉండాలి. సాగు వ్యయం కంటే పంట మద్దతు ధరలు 1.5 రెట్లుండాలి. కనీస వేతనాల్ని పెంచాలి. వీటిలో ఏవీ బడ్జెట్‌లో లేవు. "

అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి



ఆయుష్మాన్ హవా




ఆరోగ్యానికి రూ.61,398 కోట్లు

ఎపి-పిఎంజెఎవైకి రూ.6,400 కోట్లు

న్యూఢిల్లీ : 2019-20 ఆర్థిక సంవత్సరానికి గానూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి రూ.61,398 కోట్లు కేటాయించారు. ఇందులో కేంద్రం ప్రతిష్ఠాత్మక చేపట్టిన ఆయుష్మాన్ భారత్ – ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (ఎబి-పిఎంజెఎవై) పథకానికి రూ. 6,400 కోట్లు కేటాయించారు. ఇది గత రెండు ఆర్థిక సంవత్సరాల కంటే రానున్న ఆర్థిక సంవత్సరానికి వ్యయం అత్యధికం. 2018-19 సంవత్సరానికి రూ. 54, 302.50 కోట్ల కేటాయింపులలో 16 శాతం అధికం. ప్రధాని నరేంద్ర మోడీ ఎబి-పిఎంజెఎవై ఆరోగ్య పథకాన్ని సెప్టెంబర్ 23న అధికారికంగా ప్రారంభించారు. ప్రతి కుటుంబానికి వార్షికంగా రూ.5 లక్షల కవరేజీతో దేశవ్యాప్తంగా 10 కోట్ల పేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చడమే ఈ పథకం లక్ష్యం. సమగ్రమైన, నాణ్యతతో కూడిన వైద్యం అందించేందుకు నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ కింద ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ.250 కోట్లు కేటాయించింది. నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ కింద హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లకు రూ.1350.01 కోట్లు కేటాయించింది. ఈ పథకం కింద 2022 నాటికి దాదాపు 1.5 లక్షల సబ్ సెంటర్లు, ప్రైమరీ హెల్త్ సెంటర్లను హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లుగా మార్చనున్నారు. బిపి, డయాబెటీస్, క్యాన్సర్, వృద్ధాప్య సంబంధిత అనారోగ్యాలకు వెల్‌నెస్ సెంటర్లలో చికిత్స అందించనున్నారు. నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం)కు గత బడ్జెట్‌లో 30,683.05 కోట్లు కేటాయించగా, 2019-20 సంవత్సరానికి రూ.31,745 కోట్లు కేటాయించారు. ఎన్‌హెచ్‌ఎం కింద రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన (ఆర్ఎస్‌బివై)కి రూ.156 కోట్లు కేటాయించారు. గతం కంటే రూ.144 కోట్లు తగ్గించారు. నేషనల్ ఎయిడ్స్ అండ్ ఎస్‌టిడి నియంత్రణకు ప్రభుత్వం రూ.2,500 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌లో రూ.1,925 కోట్ల కేటాయింపుల కంటే ప్రస్తుతం రూ.575 కోట్లు ఎక్కువగా కేటాయించారు. ఎయిమ్స్‌కు 201819 ఆర్థిక సంవత్సరానికి రూ.3,298 కోట్ల నుంచి ప్రస్తుతం రూ. 3,599.65 కోట్లకు పెంచారు. వృద్ధుల ఆరోగ్యం సంరక్షణకు జాతీయ పథకం కింద కేటాయింపులను రూ.80 కోట్ల నుంచి ప్రస్తుతం రూ.105 కోట్లకు పెంచారు. నేషనల్ మెంటల్ హెల్త్ కార్యక్రమం కింద కేటాయింపులు రూ. 5.50 కోట్ల నుంచి రూ.40 కోట్లకు పెరిగింది. జాతీయ ఆరోగ్య పథకం కింద క్యాన్సర్, మధుమేహం, హృదయ సంబంధిత వ్యాధులు, స్ట్రోక్‌ల నియంత్రణకు రూ. 100.50 కోట్ల నుంచి రూ.175 కోట్లకు పెంచారు. పొగాకు నియంత్రణ, డ్రగ్ డీ అడిక్షన్ కోసం రూ.65 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్ కంటే ఇది రూ.2 కోట్లు తగ్గింది. నర్సింగ్ సర్వీసుల బలోపేతానికి ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం రూ. 64 కోట్లు కేటాయించింది. ఫార్మసీ స్కూళ్లు, కాలేజీల అప్‌గ్రెడేషన్‌కు రూ.5 కోట్లు, జిల్లా ఆస్పత్రులు, రాష్ట్ర మెడికల్ కాలేజీలు (పోస్ట్ గ్రాడ్యుయేట్) అప్ గ్రెడేషన్‌కు రూ. 800 కోట్లు కేటాయించింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు (అండర్ గ్రాడ్యుయేట్ సీట్లు), కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సంస్థల బలోపేతానికి రూ.1361 కోట్లు కేటాయించింది. కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు రూ. 2 వేల కోట్లు, రాష్ట్రాలలో పారా మెడికల్ సైన్స్ సంస్థల స్థాపన, పారా మెడికల్ కాలేజీల ఏర్పాటుకు రూ.20 కోట్లను కేటాయించింది.

చదువులకు రూ. 93,847 కోట్లు



న్యూఢిల్లీ : 201920 సంవత్సరానికి శుక్రవారం తాత్కాలిక బడ్జెట్‌న ప్రవేశ పెట్టిన ఆర్థిక శాఖ మంత్రి పీయూష్ గోయల్ విద్యా రంగానికి రూ. 93,847.64 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్ కేటాయింపుల కంటే ఇది 10 శాతం అధికం. ఉన్నత విద్యకు రూ.37, 461.01 కోట్లు కేటాయించగా, పాఠశాల విద్యకు రూ.56,386.63 కోట్లను కేటాయించారు. గత ఏడాది అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విద్యా రంగానికి రూ. 85,010 కోట్లు కేటాయించారు. రీవిటలైజింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ సిస్టం ఇన్ ఎడ్యుకేషన్ (రైజ్) పథకాన్ని పీయూష్ గోయల్ ప్రారంభించారు. ఆరోగ్య సంస్థలతో సహా ప్రముఖ విద్యా సంస్థలలో పరిశోధన, మౌలిక సౌకర్యాల అభివృద్ధికి 2022 నాటికి రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టనున్నారు. పరిశోధన, ఆవిష్కరణల కోసం ప్రభుత్వం రూ. 608. 87 కోట్లు కేటాయించారు. ఇది గత కేటాయింపుల కంటే రూ. 350.23 కోట్లు పెరిగింది. స్కూల్స్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎస్‌పిఎ) పేరుతో రెండు కొత్త పథకాలను గోయల్ ప్రతిపాదించారు. దీంతో పాటు 18 కొత్త ఎస్‌పిఎలు ఐఐటి, ఎన్ఐటిలలో స్వయం ప్రతిపత్తి సంస్థలను చాలెంజ్ మోడ్‌లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని ఐఐటి, ఎన్ఐటి, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలను కోరామన్నారు. నాణ్యమైన విద్యను అందించడంతో డిజిటల్ వినియోగం ముఖ్యపాత్రను పోషిస్తోందన్నారు.. డిజిటల్ విద్యతో బ్లాక్ బోర్డు స్థానంలో క్రమంగా డిజిటల్ బోర్డు ఆక్రమించిందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులలో నైపుణ్యం పెంచేందుకు ఇటీవల డిజిటల్ పోర్టల్ 'దీక్ష' ను పారంభించినట్లు గోయల్ తెలిపారు. టెక్నాలజీ, టెలికాం సర్వీసులను సమర్థంగా వినియోగించుకుంటామన్నారు. అన్ని పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు 'ఆపరేషన్ డిజిటల్ బోర్డు' అధ్యయనానికి విద్యాశాఖ కమిటీని ఏర్పాటు చేసినట్లు గోయల్ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ ఖర్చు

INTERIM BUDGET 2019-20

బడ్జెట్ అంచనాలు (2019-20) రూ.కోట్లలో

పద్దులు		పద్దులు	
పెన్షన్లు	1,74,300	వడ్డీ	6,65,061
రక్షణశాఖ	3,05,296	ఐటీ, టెలికాం	21,549
కీలక సబ్సిడీలు	2,96,684	ప్రణాళికలు మరియు గణాంకాలు	5,594
వ్యవసాయ అనుబంధ రంగాలు	1,49,981	గ్రామీణాభివృద్ధి	1,38,962
వాణిజ్యం & పరిశ్రమలు	27,660	శాస్త్ర, సాంకేతిక విభాగాలు	26,237
ఈశాన్య భారతం అభివృద్ధికి	3,000	సాంఘిక సంక్షేమం	49,337
విద్య	93,848	పన్ను వ్యవహారాలు	1,17,285
విద్యుత్‌శక్తి	44,101	రాష్ట్రాలకు బదిలీ	1,66,883
విదేశాంగ	16,062	రవాణా	1,56,187
ఆర్థికం	19,812	కేంద్రపాలిత ప్రాంతాలు	15,042
ఆరోగ్యం	63,538	పట్టణాభివృద్ధి	48,032
హోంశాఖ వ్యవహారాలు	1,03,927	ఇతరులు	75,822
		మొత్తం	27,84,200

రైతుబంధులో పావు వంతే!

● కేంద్ర పథకంతో రాష్ట్రానికి వచ్చేది రూ.2824 కోట్లు ● లబ్ధిదారులు 47.08 లక్షల మంది రైతులు

మన తెలంగాణ/హైదరాబాద్ : వ్యవసాయం, రైతుల సంక్షేమం విషయంలో తెలంగాణ ప్రభుత్వంలా సాహోసోపేతమైన నిర్ణయాలను ఇంతకాలం తీసుకోలేకపోయిన కేంద్ర ప్రభుత్వం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పేరుతో ఒక నూతన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందుకు స్ఫూర్తిగా నిలిచింది తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు పథకం. ఎన్నికల వేళ ఓట్ల కోసమే కంటి తుడుపుగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని రైతు సంఘాల నాయకులు, విశ్లేషకులు వ్యాఖ్యానించారు. ఐదు ఎకరాలలోపు సాగు భూమి ఉన్న రైతులకు ఏడాదికి రూ.6 వేల చొప్పున మూడు దఫాలుగా (ఒక్కో దఫాకు రూ. 2000 చొప్పున) దేశవ్యాప్తంగా దాదాపు 12 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేయాలని నిర్ణయించినట్లు బడ్జెట్ ప్రసంగంలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఇందుకు రూ.75 వేల కోట్లు ఖర్చు చేస్తామని తెలిపారు. ఈ లెక్కన ఏడాదిలో నాలుగు నెలలకోసారి 5 ఎకరాలలోపు ఉన్న రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2 వేల చొప్పున జమ చేయనుంది. దీంతో తెలంగాణలో ఐదెకరాలలోపు ఉన్న 47.08 లక్షల మంది రైతులకు లబ్ధి జరగనుంది. ఒక దఫాకు రూ. 941.53 కోట్లు చొప్పున ఏడాది కాలంలో రూ. 2824.59 కోట్లు (మూడు దఫాలకు కలిపి) అందనున్నాయి. అయితే ఒక వైపు ఇబ్బడి ముబ్బడిగా సాగు ఖర్చులు పెరిగిపోతున్నాయి. మన రాష్ట్రంలో వరి సాధారణ రకం ఎకరా విస్తీర్ణంలో పండించాలంటే రూ. 32 వేలు ఖర్చు అవుతోంది. ఒక రైతు 5 ఎకరాలలో వరి పంటను సాగు చేసేందుకు ఒక సీజన్‌లో రూ.1.60 లక్షలు ఖర్చు అవుతుంది. ఈ లెక్కన కేంద్రం ప్రకటించిన దాని ప్రకారం 5 ఎకరాల లోపు రైతుకు రూ.6 వేలు ఇవ్వడం పెద్దగా ఉపకరించేది కాదని రైతు సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. కేంద్రం ఇచ్చే సాయం ఏ మూలకు సరిపోదని సచివాలయ వర్గాలు కూడా అభిప్రాయపడ్డాయి.

'కిసాన్ సమ్మాన్' కంటే రైతుబంధు గొప్ప పథకం

కేంద్రం ప్రకటించిన 'కిసాన్ సమ్మాన్' పథకంకంటే తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు పథకం చాలా గొప్పగా ఉందని పలువురు ప్రస్తావిస్తున్నారు. రాష్ట్రాలన్నీ అదే తరహాలో ప్రణాళికలు వేసుకుని పథకాలను అమలు చేస్తే అన్నదాతలకు లాభిస్తుందని పేర్కొంటున్నారు. రాష్ట్రంలో ఎకరాకు రూ.4 వేల చొప్పున ఎన్ని ఎకరాలు ఉన్నప్పటికీ 2018 ఖరీఫ్, రబీల్లో రెండు సార్లు కలిపి దాదాపు రూ. 11 వేల కోట్లను ప్రభుత్వం 54 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేసింది. దీంతో సాగు వద్దనుకుని భూమి పడావు పెట్టిన రైతులు కూడా పంటలు సాగు చేశారు. కొన్ని పంటలకు కాలం అనుకూలించకపోయినా పెట్టుబడి అప్పుల బెడద తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ వచ్చే ఖరీఫ్ నుంచి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు రూ. 5 వేల చొప్పున ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పుడు కేంద్రం ప్రకటించిన పథకం ద్వారా రాష్ట్రంలోని 47.08 లక్షల మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు ద్వారా అందే సాయానికి అదనంగా రూ.6 వేల చొప్పున అందనున్నాయి. ఆ ప్రకారం ఎకరం సాగు భూమి ఉన్న రైతుకు తెలంగాణ ప్రభుత్వం నుంచి ఏడాదికి రూ. 10 వేలు, కేంద్రం నుంచి రూ.6 వేలు కలిపి మొత్తంగా రూ.16 వేలు అందనుంది.



తెలంగాణ ఓకే... మరి మిగతా రాష్ట్రాల్లో

మన రాష్ట్రంలోని ఐదెకరాలలోపు ఉన్న రైతుల సంఖ్య, వారి బ్యాంకు ఖాతాల వివరాలు ప్రభుత్వం దగ్గర ఇప్పటికే ఉన్నాయి. రైతుబంధు కోసం భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టడం, కొత్త పాసు పుస్తకాల జారీ, వ్యవసాయ విస్తరణ అధికారులతో సర్వే చేయించి బ్యాంకు ఖాతాలు, ఆధార్ నెంబర్‌లు, మొబైల్ నెంబర్‌లు సేకరించింది. ఈ సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వంతో షేర్ చేసుకుంటే చాలు మన రైతుల ఖాతాల్లోకి 'కిసాన్ సమ్మాన్' సొమ్ము వచ్చి పడుతుంది. అయితే మరో రెండు, మూడు రాష్ట్రాలు మినహా మరే రాష్ట్రంలోనూ రైతుల వివరాలు, బ్యాంకు ఖాతాల నెంబర్‌ల సమాచారం ఆ ప్రభుత్వాల దగ్గర లేదు. కేంద్రం వద్ద కూడా పూర్తి స్థాయి రైతుల సమాచారం లేదు. దీంతో 2018 డిసెంబర్‌లోనే ఈ పథకం ప్రారంభమైందని పేర్కొన్న కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా విజయవంతంగా ఎలా అమలు చేస్తుందన్న అనుమానాలు నెలకొన్నాయి. ఫిబ్రవరి చివరి వారం లేదా మార్చి 10కి కల్లా ఒక దఫాలో రూ.2 వేల చొప్పున జమ చేయాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలిసింది. యుద్ధ ప్రాతిపదికన రైతుల వివరాలు ఎలా సేకరిస్తారో వేచిచూడాలి.

నష్టానికి కూడా సరిపోదు

మల్లారెడ్డి, రైతుసంఘం, జాతీయ ఉపాధ్యక్షులు

కేంద్రం తాజాగా ప్రకటించిన ఏడాదికి రూ.6 వేల ఆర్థిక సాయం మద్దతు ధర (ఎంఎస్‌పి) లభించక నష్టపోతున్న రైతులకు ఏ మాత్రం సరిపోదు. సాగు ఖర్చులు విపరీతంగా పెరిగాయి. అందుకు అనుగుణంగా ఎంఎస్‌పి పెంచాలి. దానిని అమలు చేయాలి. అలాగే ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద ఇంకా ఎక్కువ మొత్తంలో రైతులకు ఇవ్వాలి.

రైతుబంధుకు సాటిలేదు

సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షులు

రైతుబంధు పథకాన్ని కేంద్రం అనుకరించే ప్రయత్నం చేసింది. రాష్ట్రంలో సిఎం కెసిఆర్ నేతృత్వంలో ఎకరాకు రూ. 4 వేల చొప్పున రెండు దఫాలుగా ప్రభుత్వం లబ్ధిదారులకు అందించింది. వచ్చే ఖరీఫ్ నుంచి ఎకరాకు రూ.5 వేలు లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వం సిఎం సూచనలను పూర్తిస్థాయిలో అమలు చేయాల్సింది. రైతుబంధుకు సాటిలేదు. వ్యవసాయాన్ని లాభాసాటిగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం మరింత పకడ్బందీగా వ్యవహరిస్తోంది.

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి రాష్ట్రంలో అర్హత పొందే రైతులు వీరే..

విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతుల సంఖ్య (లక్షల్లో)	మొదటి దఫా(రూ.కోట్లలో)	మూడు దఫాల మొత్తం
0 నుంచి 1	14.83	297.16	891.49
1 నుంచి 2	13.37	267.47	802.40
2 నుంచి 3	8.96	179.23	537.69
3 నుంచి 4	5.75	115.02	345.06
4 నుంచి 5	4.13	82.65	247.94
మొత్తం	47.08	941.53	2824.59



రోజూ 27 కిలోమీటర్ల హైవేల నిర్మాణం

న్యూఢిల్లీ: దేశంలో ప్రతి రోజూ 27 కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతోందని, ప్రపంచంలోనే వేగంగా హైవేలను అభివృద్ధి చేస్తున్న దేశం భారతేనని కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. సిక్కింలో ఇటీవల ప్రారంభమైన విమానాశ్రయంతో కలుపుకొని దేశంలో వంద విమానాశ్రయాలు పని చేస్తున్నాయని కూడా ఆయన చెప్పారు. ఏ దేశం అభివృద్ధికైనా రోడ్లు లాంటి మౌలిక సదుపాయాల అభివృద్ధే ముఖ్యమని యన చెప్తూ, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద మారుమూల ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం కోసం కేటాయింపులను ఈ ఆర్థిక సంవత్సరం సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.15,500 కోట్లనుంచి రూ.19 వేల కోట్లకు పెంచినట్లు తెలిపారు. ఈ పథకం కింద గ్రామీణ రోడ్ల నిర్మాణం మూడు రెట్లు పెరిగిందని, దేశంలోని మొత్తం 17.64 లక్షల మారుమూల నివాస ప్రాంతాల్లో 15.8 నివాస ప్రాంతాలను ఈ పథకం కింద అనుసంధానం చేయడం జరిగిందని ఆర్థిక మంత్రి చెప్పారు. రోడ్డు రవాణాతో పాటుగా వాయు, జల రవాణా మార్గాలను సైతం అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వం లక్ష్యమని ఆయన చెప్పారు. మేక్ ఇన్ ఇండియాకు అనుగుణంగానే వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను దేశీయంగా నిర్మించడం జరిగిందని గోయల్ చెప్పారు.

గుప్తధనం.. గురిచూసికొట్టారు

పన్ను పరిధిలోకి 1.3 లక్షల కోట్ల అక్రమ సొమ్ము



న్యూఢిల్లీ: నల్లధనం నిరోధక చట్టం , నోట్ల రద్దు ద్వారా గత నాలుగున్నరేళ్లలో నల్లధనం నిరోధానికి, వెలికి తీయడానికి ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంది. ఈ చర్యల ద్వారా గుప్త ఆదాయానికి సంబంధించిన రూ 1,30,000 కోట్లను వెలికి తీసి, ఆ మొత్తాన్ని పన్ను పరిధిలోకి తీసుకొచ్చింది. దాదాపు రూ 50,000 కోట్ల విలువ చేసే ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవడం వల్ల, నల్లధనం కలిగి ఉన్నవారు తమకు ఆ డబ్బు ఎక్కడిదో తప్పనిసరిగా వెల్లడించాల్సి వచ్చిందని శుక్రవారం పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. 'నల్లధనం రుగ్మతను దేశం నుంచి పూర్తిగా తొలగించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని ఆర్థికమంత్రి పేర్కొన్నారు. రూ 6,900 కోట్ల బినామీ ఆస్తులు, రూ 1,600 కోట్ల విదేశీ ఆస్తుల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. 3,38,000 డొల్ల కంపెనీల్ని గుర్తించి, వాటి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశాం. ఆ కంపెనీల డైరెక్టర్లపై అనర్హత వేటు వేశాం...మంత్రి వివరించారు. 'ప్రత్యక్ష పన్నుల సేకరణలో 2017–18లో 18 శాతం పెరుగుదల కనిపించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో (2018–19) 1.06 కోట్లమంది మొదటిసారి ఇన్‌కంటాక్స్ రిటర్న్స్ దాఖలు చేయడంవల్ల పన్నుల ఆదాయం పెరిగింది. ముఖ్యంగా నోట్ల రద్దువల్ల ఇది సాధ్యమైంది' అని పీయూష్ గోయల్ తెలిపారు.

'ఉపాధి'కి 60 వేల కోట్లు

గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్‌ఆర్‌ఇజిఎ)కు కేటాయింపులను వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.60 వేల కోట్లకు గోయల్ పెంచారు. '2022 నాటికి నవ భారతంగా ఎదగాలన్న కలను సాకారం చేసుకునే దిశగా ముందుకు సాగుతున్నామని కూడా ఆయన చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోనే ధ్రువతారగా భారతదేశాన్ని ప్రపంచమంతా గుర్తించిందని, ప్రపంచంలోనే శరవేగంగా ఎదుగుతున్న అతిపెద్ద అర్థిక వ్యవస్థ మనదని ఆయన చెప్పారు. రైతుల కష్టాలను తొలగించడానికి ప్రభుత్వం 22 గుర్తించిన పంటల కనీస మద్దతు ధరలను ఉత్పత్తి వ్యయానికన్నా ఒకటిన్నర రెట్ల స్థాయికి పెంచినట్లు చెప్పారు. కాగా ద్రవ్యోల్బణాన్ని కనిపించని, అన్యాయమైన పన్నుగా గోయల్ అభివర్ణిస్తూ, జనం వెన్ను విరుస్తున్న ద్రవ్యోల్బణం వెన్నును ప్రభుత్వం విరిచిందని, 2009 –14 మధ్య కాలంలో 10.1 శాతంగా ఉండిన ద్రవ్యోల్బణం ఇప్పుడు 2.1శాతం గామాత్రమే ఉందన్నారు. బ్యాంకుల నిరర్థక ఆస్తుల(ఎన్‌పిఎ) గురించి మాట్లాడుతూ, దివాలా చట్టాన్ని అమలు చేయడం ద్వారా బ్యాంకులు, రుణ సంస్థలు మొండి బకాయిదారుల నుంచి రూ.3 లక్షల కోట్లు రికవరీ చేశాయని చెప్పారు.

స్వచ్ఛభారత్ మిషన్...

స్వచ్ఛ భారత్ మిషన్ కింద గ్రామాల్లో శానిటేషన్ లక్ష్యంలో 98 శాతాన్ని సాధించగలిగామని ఆర్థిక మంత్రి చెప్పారు. దేశవ్యాప్తంగా 5.45 లక్షలకు పైగా గ్రామాలను బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించినట్లు ఆయన తెలిపారు.గత అయిదేళ్ల కాలంలో గ్రామీణ రోడ్ల నిర్మాణం మూడు రెట్లు పెరిగిందని గోయల్ చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 2014– 18మధ్య కాలంలో 1.53 కోట్ల ఇళ్లను నిర్మించడం జరిగిందన్నారు.

బడ్జెట్ లీకైంది : కాంగ్రెస్

న్యూఢిల్లీ : ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ పార్లమెంట్‌లో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందే అందులోని కీలకాంశాలు బయటకు పొక్కాయని కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి మనీష్ తివారి తెలిపారు. ప్రభుత్వ వర్గాలే ఈ వివరాలను మీడియాకు లీక్ చేశాయని ఆయన ఆరోపించారు. వీటికి సంబంధించిన ఫొటోలను ట్విటర్‌లో షేర్ చేశారు. ఇవే అంశాలు మధ్యంతర్ బడ్జెట్‌లో ఉన్నాయని వెల్లడించారు.

రాబోయే లోక్‌సభ ఎన్నికల్ని దృష్టిలో ఉంచుకొనే 2019–20 తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ముసుగు ఇది. రైతులకు వార్షిక ఆదాయ మద్దతు పథకంలో రైతుల జాబితాపైన, పథకం అమలు పైనా స్పష్టత లేదు. భూమి ఉన్న రైతులకే ఈ స్కీమ్ పనికొస్తుంది కానీ భూమిలేని రైతులకు ఉపయోగపడదు. రూ. 5 లక్షల వ్యక్తిగత ఆదాయంపై పన్ను మినహాయింపు ఇచ్చారు. మరో-వైపు సేవింగ్స్‌తో కలిపి ఏటా రూ.6.5 లక్షల పై పన్ను మినహాయింపన్నారు.

-డి.రాజా, సిపిఐ నాయకుడు





డిజిటల్ పల్లెలు

అయిదేళ్లలో లక్ష గ్రామాల డిజిటలైజేషన్

న్యూఢిల్లీ: మొబైల్ డాటా వినియోగంలో భారతదేశం వరల్డ్ లీడర్‌గా ఎదిగిన నేపథ్యంలో దేశంలోని మారుమూల గ్రామీణ ప్రాంతాలకు కూడా దీని పరిధిని విస్తరించాలని ప్రభుత్వం అనుకుంటోంది. శుక్రవారం పార్లమెంట్‌లో 2019 – 20 తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ఇందుకు సంబంధించి ఒక ప్రకటన చేస్తూ...రాబోయే అయిదేళ్లలో దేశంలో లక్ష గ్రామాల్ని ప్రభుత్వం డిజిటల్ గ్రామాలుగా మారుస్తుందని, కామన్ సర్వీస్ సెంటర్స్‌ను (సిఎస్‌సిలు) విస్తరించడం ద్వారా ఇది సాధ్యమవుతుందని తెలిపారు. 'సిఎస్‌సిలు వాటి సేవల్ని విస్తరిస్తున్నాయి. కనెక్టివిటీతో పాటు గ్రామాల్ని డిజిటలైజ్ చేసేందుకు అవసరమైన మౌలిక వసతుల్ని కల్పిస్తున్నాయి. మూడు లక్షలకు పైగా ఉన్న సిఎస్‌సిలు 12 లక్షల మంది సిబ్బందితో పనిచేస్తూ పౌరులకు డిజిటల్ సేవలందిస్తున్నాయి' అని మంత్రి పీయూష్ గోయల్ వివరించారు. ప్రపంచంలో మిగిలిన దేశాలతో పోలిస్తే మనదేశంలో మొబైల్ టారిఫ్ చాలా తక్కువని, అందువల్లే మొబైల్ డేటా వినియోగంలో ఇండియా వరల్డ్ లీడర్ అయిందని కేంద్రమంత్రి చెప్పారు. గత అయిదేళ్లలో మొబైల్ డేటా వినియోగం 50 రెట్లు పెరిగిందన్నారు. 'ఈ రోజు ...మేక్ ఇండియా కార్యక్రమం కింద మొబైల్ ఫోన్ తయారీ పరిశ్రమ రెండు నుంచి 268 కంపెనీల వరకూ విస్తరించింది. భారీ ఎత్తున ఉపాధి అవకాశాల్ని కల్పిస్తోంది' అని పీయూష్ గోయల్ పేర్కొన్నారు.

జామ్.. డిబిటి పెద్ద గేమ్ ఛేంజర్


బ్యాంకుల జాతీయీకరణ తర్వాత ...జన్ ధన్ ఆధార్ మొబైల్ (జామ్), డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటి) కొత్త ట్రెండ్ ను సృష్టించి, గేమ్ ఛేంజర్‌గా మారాయని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. '50 ఏళ్ల కిందట బ్యాంకుల జాతీయీకరణ జరిగింది. కానీ, ఫార్మల్ బ్యాంకింగ్ సదుపాయం లేకపోవడంతో ఇప్పటికీ దేశంలో చాలా ప్రాంతాలు ఆర్థికంగా ప్రధాన స్రవంతికి దూరంగా ఉండిపోయాయి. గత అయిదేళ్లలో 34 కోట్ల జన్‌ధన్ బ్యాంక్ ఖాతాలు కొత్తగా ఏర్పడ్డాయి' అన్నారు. ఆధార్ గురించి మాట్లాడుతూ కేంద్రమంత్రి మధ్యతరగతి వారికి ఇందువల్ల ఎంతో ప్రయోజనం కలిగిందన్నారు.

అంకెల్లో బడ్జెట్

INTERIM BUDGET 2019-20

(రూ. కోట్లలో)

	2017-18 (వాస్తవాలు)	2018-19 (బడ్జెట్ అంచనాలు)	2018-19 (సవరించిన అంచనాలు)	2019-20 (బడ్జెట్ అంచనాలు)
రెవెన్యూ రాబడులు	14,35,233	17,25,738	17,29,682	19,77,693
పెట్టుబడి రాబడులు	7,06,742	7,16,475	7,27,553	8,06,507
మొత్తం రాబడులు	21,41,975	24,42,213	24,57,235	27,84,200
మొత్తం వ్యయం	21,41,975	24,42,213	24,57,235	27,84,200
రెవెన్యూలోటు	4,43,602	4,16,034	4,10,930	4,70,214
వాస్తవ రెవెన్యూలోటు	2,52,568	2,20,689	2,10,630	2,69,474
ద్రవ్యలోటు	5,91,064	6,24,276	6,34,398	7,03,999
ప్రాథమికలోటు	62,112	48,481	46,828	38,938



బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసిన పీయూష్ గోయల్ టీమ్

మధ్యతరగతి మహాన్

3 నిర్ణయాలు.. 25కోట్ల మంది • ఎన్నికలకు బిజెపి ఓటువేట

న్యూఢిల్లీ : రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను రచించిందని చెప్పవచ్చు. దేశంలోనే అత్యధిక సీట్లున్న ఉత్తరప్రదేశ్‌లో భారీ ఓట్ బ్యాంక్ ఉన్న ఎస్‌పి, బిఎస్‌పి పొత్తు .. కాంగ్రెస్ తరఫున ప్రియాంక బరిలోకి దిగడం బిజెపిని ఆలోచనలో పడేసింది. మరోపక్క పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడుల్లో బిజెపి పరిస్థితి సంక్లిష్టంగా ఉంది. స్థానిక పార్టీలు చాలా బలంగా పాతుకుపోయాయి. ఇంకో పక్క జిఎస్‌టి, నోట్ల రద్దు, పెట్రోల్ ధరల పెంపు వంటి అంశాలతో పేద, మధ్యతరగతి జీవుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఇది ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో అధికార బిజెపికి ఓటరు షాక్ ఇచ్చారు. దీంతో బిజెపి ఎన్నికలకు ఇంకా మిగిలి ఉన్న దాదాపు రెండు నెలల గడువును సద్వినియోగం చేసుకోవాలని నిర్ణయించుకొంది. ప్రజా వ్యతిరేకతను తగ్గించుకోవడానికి అవసరమైన అన్ని మార్గాలను అన్వేషిస్తోంది. ఎన్నికల వ్యూహంలో భాగంగానే అగ్రవర్ణ పేదలకు 10శాతం రాయితీ ఇచ్చి ఉత్తర్ ప్రదేశ్‌లోని కీలకమైన బ్రాహ్మణ, ఠాకూర్ ఓట్లకు గాలం వేసింది. అదే సమయంలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టానికి సవరణలతో ఆ వర్గాలను శాంతింపజేసే ప్రయత్నం చేసింది. తాజాగా బడ్జెట్‌లో రైతులు, కార్మికులు, మధ్యతరగతి ఉద్యోగులను ఆకట్టుకునేలా నిర్ణయాలను తీసుకొంది. ఈ బడ్జెట్‌లో 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్' నిధి పేరుతో రైతుబంధు వంటి పథకానికి రూపకల్పన చేసింది. ఈ పథకం కింద ఏకంగా 12 కోట్ల మంది రైతులకు ప్రభుత్వం ప్రతి నాలుగు నెలలకు రూ.2 వేల చొప్పున వారి ఖాతాల్లోకి నేరుగా నిధులను జమ చేస్తుంది. ఈ పథకాన్ని ఫిబ్రవరిలో ప్రవేశపెట్టినా అమలు మాత్రం గత ఏడాది డిసెంబర్ నుంచి పరిగణనలోకి తీసుకొంటారు. అంటే, 2019 మార్చి నాటికి రైతుల ఖాతాల్లో రూ.2వేల నగదు పడుతుందన్నమాట. అంతకు ముందే ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. అంటే ఎన్నికల ముందు సరిగ్గా రైతుల్లో సానుకూల దృక్పథం ఏర్పడుతుందని బిజెపి వ్యూహకర్తల అంచనా.





ఐదేళ్లలో పదికోట్ల మందికి..

120 కోట్ల మంది జనాభాలో చాలామంది 60 ఏళ్లు దాటినా ఇంకా చిన్నాచితకా పనులు చేస్తూ జీవితం నెట్టుకొస్తున్నారు. ! 2005 లెక్కల ప్రకారమే, వీరి సంఖ్య 39 కోట్లను దాటింది. వారిని లక్ష్యంగా చేసుకొని ప్రవేశపెట్టారు ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్‌ధన్ పథకం. 60 ఏళ్లు నిండిన వారందరికీ ప్రతి నెలా రూ.3వేలు పింఛన్ వచ్చే విధంగా దీన్ని రూపొందించారు. నెలసరి ఆదాయం రూ.15వేల లోపు ఉండే వారు నెలకు రూ.100 చొప్పున ప్రీమియం చెల్లిస్తే 60ఏళ్ల తర్వాత రూ.3వేల పింఛన్ అందుతుంది. ఈ నిర్ణయంతో వచ్చే ఐదేళ్లలో 10 కోట్ల మంది ప్రయోజనం పొందుతారని బిజెపి లెక్కలేసుకుంటోందది. మధ్యతరగతి, ఉద్యోగ వర్గాల్లో విద్యావంతులు ఎక్కువ. సాధారణంగా వీరు ప్రభుత్వ పనితీరును విశ్లేషించుకొని ఓటు వేస్తారు. తటస్థ ఓటర్లూ వీరిలోనే అధికం. వీరి ఓటింగ్ మీదే గెలుపు ఓటములు ఆధారపడి ఉంటాయి. పెట్రోల్ ధరల పెంపునకు ప్రధాన బాధిత వర్గం ఇదే. అందుకే ఎన్‌డీఏ సర్కార్ వీరిని ఆకర్షించేందుకు భారీ తాయిలం ప్రకటించింది. రూ.5లక్షల వరకు ఆదాయంపై పన్నును పూర్తిగా తొలగించింది. ఇప్పటి వరకు మినహాయింపు పరిధిని కొద్దికొద్దిగా పెంచుతూ వచ్చిన ప్రభుత్వం ఒక్కసారిగా ఇంత మొత్తంలో పెంచడం విశేషం. దీనికి తోడు గ్రాట్యూటీ, స్టాండర్డ్ డిడక్షన్, గృహరుణ చెల్లింపులు, చెల్లించిన అద్దెకు పన్ను మినహాయింపులు ఇలా అవకాశం ఉన్నచోటల్లా వారికి లబ్ధి చేకూర్చి ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించింది.



- ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన కింద చిన్న, సన్నకారు రైతులకు ఆర్థిక సాయం. అయిదెకరాల లోపు ఉన్న రైతులకు ఏడాదికి రూ.6 వేలు ఆర్థిక సాయం అందిస్తారు. మూడు దఫాలుగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి మళ్లిస్తారు. ఈ పథకం కోసం బడ్జెట్‌లో రూ.75 వేల కోట్లు కేటాయించారు. దీనివల్ల మొత్తం 12 కోట్ల మందికి లబ్ధి. గత డిసెంబర్ నుంచే పథకం వర్తిస్తుంది.
- ఆదాయం పన్ను పరిమితి రూ.5 లక్షలకు పెంపు. రూ.6.5 లక్షల ఆదాయం ఉండి పిఎఫ్‌లాంటి ప్రతిపాదిత పథకాల్లో పెట్టుబడి పెట్టే వారు కూడా పన్ను చెల్లించనక్కరలేదు.
- స్టాండర్డ్ డిడక్షన్ పరిమితి రూ.40 వేలనుంచి 50 వేలకు పెంపు
- పోస్టాఫీసు పొదుపు పథకాలపై వచ్చే వడ్డీపై టిడిఎస్ రూ.10 వేలనుంచి రూ.40 వేలకు పెంపు.
- రూ.2 వరకు క్యాపిటల్ గెయిన్స్‌నుంచి మినహాయింపు. అయితే జీవితకాలంలో ఒకసారి మాత్రమే ఈ మినహాయింపు వర్తిస్తుంది.
- పన్ను వ్యవస్థ పూర్తిగా కంప్యూటరీకరణ.
- ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ నిధికి కేటాయింపులు రూ.76,800 కోట్లకు పెంపు. గత ఏడాదితో పోల్చితే కేటాయింపులు 35శాతం పెరిగాయి.
- రాష్ట్రీయ గోకుల్ మిషన్‌కు రూ.750 కోట్లు కేటాయింపు
- ప్రధానమంత్రి శ్రమయోజన కింద అసంఘటిత రంగ కార్మికుల కోసం పింఛను పథకం. నెలకు 100 రూపాయల చొప్పున చెల్లిస్తే 60ఏళ్ల తర్వాత నెలకు రూ.3 వేలు పింఛను. ఈ పథకం కింద అయిదేళ్లలో పది కోట్ల మంది లబ్ధి పొందే అవకాశం.
- రక్షణ బలగాలకు రూ.3 లక్షల కోట్లకు పైగా నిధులు. అవసరమయితే అదనంగా మరిన్ని నిధులు.
- సైనిక దళాల వేతనాలు పెంపు. ఒన్ ర్యాంక్ ఒన్ పెన్షన్ పథకానికి రూ.35,000 కోట్లు కేటాయింపు.
- నీతి ఆయోగ్ గుర్తించిన తొమ్మిది విభాగాల్లో కృత్రిమ మేధకు సంబంధించిన పోర్టర్ల అభివృద్ధి.
- మారుమూల ప్రాంతాల్లో పక్కా రోడ్ల నిర్మాణానికి రూ.19,000కోట్లు. గత ఏడాదితో పోల్చితే ఘననీయంగా పెంపు.
- ఈశాన్య భారత రాష్ట్రాలకు కేటాయింపులు 21 శాతం పెంపు.
- భారతీయ సినీ నిర్మాణ సంస్థలకు కూడా సింగిల్ విండో క్లియరెన్స్.
- సినీ పైరసీని అరికట్టడానికి సినిమాటోగ్రఫీ చట్టం.
- వచ్చే అయిదేళ్లలో భారత్ అయిదు ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా ఎదుగుతుంది. ఆ తర్వాత ఎనిమిదేళ్లలో 10 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా ఎదుగుతుందని అంచనా.

సూట్‌కేసు రంగుమారింది...



ప్రతి ఏటా బడ్జెట్ పత్రాలు మోసుకొచ్చే సూట్‌కేస్ రంగు ఈ సారి మారింది. సాధారంగా ఇప్పటివరకు ఆర్థిక మంత్రులుగా పనిచేసిన వారు నలుపు, ముధురు గోధుమ రంగులో సూట్‌కేస్‌లను వాడారు. కానీ ఈ సారి మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి మొదటి సారి వచ్చిన కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ఎరుపు రంగు సూట్‌కేస్‌తో పార్లమెంట్‌లోకి అడుగుపెట్టారు. దాంతో ఆ సూట్‌కేస్ రంగు కాస్తా సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. బడ్జెట్ అనే పదం 'బజెట్' అనే ఫ్రెంచ్ పదం నుంచి వచ్చింది. అంటే లెదర్ బ్యాగ్ అని అర్థం. మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ఆయన నలుపు రంగు సూట్‌కేస్‌నే వాడేవారు. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు ఆర్థిక మంత్రిగా పనిచేసిన యశ్వంత్ సిన్హా కూడా నలుపు రంగు సూట్‌కేస్‌నే వాడారు.

రెండుసార్లు ఆర్థిక మంత్రిగా..

పీయూష్ గోయల్ ఆర్థిక మంత్రిగా తాత్కాలిక బాధ్యతలు చేపట్టడం ఇది రెండోసారి. గతేడాది మే నెలలో అరుణ్‌జైట్లీ కిడ్నీ సంబంధిత శస్త్రచికిత్స కోసం ఆసుపత్రిలో చేరారు. ఆ సమయంలో గోయల్‌కు ఆర్థికశాఖ బాధ్యతలు అప్పగించారు. 2018 మే నుంచి ఆగస్టు వరకు ఆయన ఈ పదవిలో కొనసాగారు. ఇటీవల జైట్లీ మరోసారి అనారోగ్యానికి గురై చికిత్స నిమిత్తం అమెరికా వెళ్లారు. దీంతో గోయల్ మళ్లీ తాత్కాలిక ఆర్థికమంత్రి బాధ్యతలు చేపట్టారు. ఈ హోదాలో నేడు లోక్‌సభలో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు.

పదేపదే ఈ పదాలు...



పార్లమెంట్‌లో పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో పదేపదే కొన్ని పదాలను వల్లెవేశారు. బడ్జెట్ ప్రసంగంలో గోయల్ పలుమార్లు కోట్లు, ప్రభుత్వం, భారత్, పన్ను వంటి పదాలను అధికంగా వాడారు. బడ్జెట్ ప్రసంగంలో ఆయన కోట్లు అనేపదాన్ని 80 సార్లు ప్రయోగించగా, విల్ అనే మాటను 76 సార్లు, ప్రభుత్వం అనే పదాన్ని 60 సార్లు వాడారు. ఇక పన్నును 46 సార్లు, లక్షలను 32 సార్లు బడ్జెట్ ప్రసంగంలో ఉచ్ఛరించారు. ఇక సంవత్సరం అనే పదాన్ని 29 సార్లు, కూడా అంటూ 28 సార్లు మాట్లాడారు. పెంపు అనే పదాన్ని 23 సార్లు ప్రస్తావించారు. ఆర్థిక మంత్రిగా రెండోసారి తాత్కాలిక బాధ్యతలు చేపట్టిన గోయల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి. గత ఐదు సార్లు కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అరుణ్‌జైట్లీ ప్రస్తుతం అనారోగ్య కారణాల రీత్యా అమెరికాలో చికిత్స తీసుకుంటుండంతో గోయల్ బడ్జెట్ ప్రసంగం చేశారు. అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో కేంద్రమంత్రిగా పనిచేసిన వేద్ ప్రకాశ్ గోయల్ కుమారుడే పీయూష్ గోయల్. 1964 జూన్ 13న గోయల్ జన్మించారు. ముంబయిలోని మతుంగాలో పాఠశాల విద్యను పూర్తిచేసిన గోయల్.. సీఏగా ఆల్‌ఇండియా రెండో ర్యాంక్ సాధించారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి అడుగుపెట్టి బిజెపిలో చేరారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా బోర్డుల్లో ప్రభుత్వ నామినీ సభ్యుడిగా పనిచేశారు. బిజెపిలో అనేక కీలక పదవులు చేపట్టారు. 2016లో మహారాష్ట్ర నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. విద్యుత్, బొగ్గు, గనుల శాఖలకు సహాయమంత్రిగా వ్యవహరించారు. 2017 సెప్టెంబరు 3న గోయల్ రైల్వే మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

హిందీలో వివరణ ఇచ్చిన పీయూష్

న్యూఢిల్లీ: సాధారణంగా కేంద్ర ఆర్థికమంత్రులు బడ్జెట్ సమర్పించేటప్పుడు ఇంగ్లీషులో ముందుగా రాసుకున్న ఇంగ్లీషు పాఠాన్నే కొనసాగించడం ఆనవాయితీ. అయితే ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం తాత్కాలిక బడ్జెట్‌ను సమర్పించేటప్పుడు కొన్ని కీలక ప్రతిపాదనలను హిందీలో వివరించడానికి ప్రయత్నించారు. గోయల్ హిందీలో మాట్లాడిన ప్రతిసారీ అధికార పార్టీ సభ్యులు బల్లలు చరుస్తూ స్వాగతించారు. దాదాపు వంద నిమిషాల పాటు సాగిన తన బడ్జెట్ ప్రసంగంలో గోయల్ అనేక సందర్భాల్లో హిందీలో మాట్లాడారు. అంతేకాదు మధ్యమధ్యలో ఆయన సర్జికల్ దాడుల ఇతివృత్త ఆధారంగా తీసిన హిందీ సినిమా 'యూరి'ని, హర్యానా ఉప ఎన్నికల్లో బిజెపి విజయం లాంటి వాటిని ప్రస్తావించి అంకెలు, లెక్కలతో నిండి ఉండే బడ్జెట్ ప్రసంగానికి మసాలాను జోడించారు. ముఖ్యంగా మధ్య తరగతికి ప్రకటించిన ఆదాయం పన్ను రాయితీలు, రక్షణ శాఖకు కేటాయింపులు లాంటి వాటిని గోయల్ హిందీలో వివరించినప్పుడు అధికార సభ్యులు బల్లలు చరుస్తూ హర్షం తెలియజేశారు. గోయల్ బడ్జెట్ ప్రతిపాదనలు ప్రకటించేటప్పుడు ఒక సందర్భంలో ప్రతిపక్ష సభ్యులు గట్టిగా నవ్వగా వెంటనే ఆయన స్పందిస్తూ, ఇది తనకు 'రామ్‌లీలా'ను గుర్తుకు తెచ్చిందని వ్యాఖ్యానించారు.



జోష్ కైసాహై

ఆర్థిక మంత్రి ప్రపంగంలో ఇటీవలి బ్లాక్‌బస్టర్ హిందీ సినిమా యూరి, అందులోని పాపులర్ డైలాగ్ 'జోష్ కైసా హై' కూడా ప్రస్తావనకు వచ్చాయి. తాను ఈ సినిమా చేశానని, అది తనకెంతో నచ్చిందని గోయల్ తన ప్రసంగంలో చెప్పారు. 'యూరీ సినిమా చాలా మజా ఇచ్చింది. అందులో బోలెడంత జోష్ ఉంది'(యేరీ మూవీమే జో జోష్ ఆయా. జో జోష్ థా)అని గోయల్ అన్నారు. ఆయన ఈ మాటలు అనగానే కేంద మంత్రి రవిశంకర్ ప్రసాద్‌తో పాటుగా పలువురు బిజెపి సభ్యులు ఆ సినిమాలోని పాపులర్ డైలాగ్ 'జోష్ కైసాహై' అంటూ ఆయనను ఉత్తేజపరిచారు. ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఇటీవల తన బహిరంగ ప్రసంగాల్లో ఈ డైలాగ్‌ను ప్రస్తావించడం తెలిసిందే.

అథవాలె అత్యుత్సాహం

కేంద్ర మంత్రి రాందాస్ అథవాలెకు సమయం, సందర్భంతో సంబంధం లేకుండా కవితలు వినిపించడం అలవాటు. ఒక్కోసారి అది ఇతరులకు ఇబ్బందిగా కూడా మారుతుంది. శుక్రవారం లోక్‌సభలో పీయూష్ గోయల్ తాత్కాలిక బడ్జెట్ సమర్పణ సమయంలోను ఆదే జరిగింది. సుదీర్ఘంగా సాగిన తన బడ్జెట్ ప్రసంగం చివర్లో గోయల్ హిందీలో ఒక కవిత చదివి ప్రసంగాన్ని ముగించగానే అతవాలె లేచి ఓ కవితను వినిపించబోయారు. అయితే బిజెపి మంత్రులు ప్రసంగం మధ్యలో గోయల్‌ను డిస్ట్రబ్ చేయవద్దంటూ ఆయనను వారించారు. గోయల్ మధ్యతరగతి వారికి, రైతులకు రాయితీలను ప్రకటించే సమయంలో కూడా అతవాలె ఉత్సాహం ప్రదర్శించి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ దృష్టిని ఆకట్టుకోవడానికి ప్రయత్నించారు.


ఈ ఎన్నికల బడ్జెట్‌ను ఆర్థికశాఖ తయారు చేసిందా? లేక ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయం రూపొందించిందా? ఇందులో స్పష్టతలేదు. ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం వస్తుంది కాబట్టి దీన్ని సీరియస్‌గా తీసుకోకూడదు. మేము అమలు చేస్తున్న వ్యవసాయ రుణమాఫీని మోడీ ...లాలీపాప్ అన్నారు. నిరాశలో కొట్టుమిట్టాడుతున్న రైతాంగానికి ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా మోడీ ప్రభుత్వం కాటన్ క్యాండీ అందిస్తుంది. రైతుల పరిస్థితిని తెలుసుకోవడంలో మోడీ ప్రభుత్వం విఫలమైంది.

-హెచ్.డి. కుమారస్వామి, కర్ణాటక సిఎం



నమో ఓటరు

(మొదటిపేజీ తరువాయి)



అన్ని తరగతుల ప్రజలను ఆకట్టుకునే విధంగా గోయల్ తన బడ్జెట్‌లో తాయిలాలను ప్రకటించారు. నూ టికి నూరు శాతం ఎన్నికల బడ్జెట్‌ను ప్రతిబింబించేవిధంగా గోయల్ బడ్జెట్ ప్రసంగం సాగింది. ఎన్నికలకు ముందు వేతన జీవులు, పెన్షనర్లు, స్వయం ఉపాధి, చిన్న తరహా వ్యాపార వర్గాలకు మోడీ సర్కార్ భారీ ఊరట కల్పించింది. కనీస ఆదాయం పన్ను మినహాయింపును ఇప్పుడున్న రూ.2.5 లక్షలనుంచి రూ. 5లక్షలకు రెట్టింపు చేయడం ద్వారా మూడు కోట్లకు పైగా ఉండే ఈ వర్గాల ప్రజలు ఏటా ఆదాయం పన్నులో రూ.18,500 కోట్లు ఆదా చేసుకునే వీలు కల్పించింది. స్టాండర్డ్ డిడక్షన్‌ను ఇప్పుడున్న నలభై వేలనుంచి రూ.50 వేలకు పెంచుతున్నట్లు ప్రకటించిన గోయల్ బ్యాంకులు, పోస్టాఫీసు డిపాజిట్లపై వచ్చే వడ్డీపై పన్ను మినహాయింపును రూ.10 వేలనుంచి రూ.50 వేలకు పెంచుతున్నట్లు తెలిపారు. స్థిరాస్తి విక్రయం ద్వారా వచ్చే ఆదాయాన్ని ఇప్పుడు ఒక ఇంటిపై పెట్టుబడి పెట్టడానికి వీలుండగా, ఇకపై రెండు ఇళ్లపై పెట్టుబడి పెట్టడానికి వీలు కల్పించారు. అలా పెట్టుబడి పెట్టే మొత్తానికి క్యాపిటల్ గెయిన్ పన్నునుంచి మినహాయింపు కల్పించారు. ఈ వెసులుబాటు జీవిత కాలంలో ఒక్కసారి మాత్రమే వర్తిస్తుంది. అంతేకాకుండా ఇప్పుడున్న ఆదాయపన్ను శ్లాబులు వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ కొనసాగుతాయని చెప్పారు.

రైతులకు ఆర్థిక చేయూత

వ్యవసాయ రంగంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొన్న వేళ రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు మోడీ సర్కార్ ముందుకు వచ్చింది. ఎన్నికల వేళ అన్నదాతలను తమ వైపునకు తిప్పుకొనేందుకు వీలుగా 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పేరిట ఒక కొత్త పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం కింద పేద, సన్నకారు రైతులకు మూడు విడతలుగా ఏడాదికి 6 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని నేరుగా అందజేస్తామని , ఐదెకరాలకన్నా తక్కువ సాగు భూమి ఉన్న రైతుల ఖాతాల్లోకి నేరుగా ఈ సొమ్మును బదిలీ చేస్తామని గోయల్ తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. ఈ పథకం కోసం రూ.75 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు ఆయన చెప్పారు. మూడు విడతల్లో ఈ సొమ్మును అందజేస్తామని, 2018 డిసెంబర్‌నుంచే ఈ పథకం అమలులోకి వస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలతో సంబంధం లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లోకి ఈ నగదును మళ్లిస్తామని చెప్పారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం అమలుకు రూ.20 వేల కోట్లు ఖర్చవుతుంది.ఈ పథకంతో దేశవ్యాప్తంగా 12 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. అలాగే కిసాన్ క్రెడిట్ కార్డుల కింద రుణాలను అందజేస్తామని, రుణాలు సకాలంలో చెల్లించిన వారికి రాయితీలు ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతుల రుణాలను రీ షెడ్యూల్ చేస్తామని హామీ ఇచ్చింది. పాడి పరిశ్రమ, మత్స్య పరిశ్రమ రుణాలను సకాలంలో చెల్లిస్తే అదనంగా 3 శాతం వడ్డీ రాయితీ ఇస్తామని తెలిపింది. అయితే రైతులకు ఆర్థిక చేయూత పథకం కారణంగా ప్రభుత్వ ద్రవ్య లోటు వచ్చే ఆర్థిక సంవత్సరంలో అంచనాలను మించిపోవచ్చు. వచ్చే ఆర్థిక సంవత్రంలో ద్రవ్య లోటును జిడిపిలో 3.1 శాతానికి పరిమితం చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా, ఇప్పుడది 3.4 శాతానికి పెరగవచ్చని అంచనా వేశారు. అయితే 2018 –19 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్య లోటును జిడిపిలో 3.3 శాతానికి పరిమితం చేయాల్సి ఉందని, అయితే రైతులకు ఆర్థిక సహాయం కోసం రూ.20 వేల కోట్లను కేటాచించినందున ఇది పెరిగే అవకాశం ఉందని గోయల్ అభిప్రాయ పడ్డారు. మధ్యంతర బడ్జెట్‌లో పన్ను ప్రతిపాదనలను చేర్చడాన్ని ఆర్థిక మంత్రి సమర్థించుకుంటూ, రెగ్యులర్ బడ్జెట్‌లో ఈ ప్రతిపాదనలు చేయడం సంప్రదాయం అయినప్పటికీ చిన్న పన్ను చెల్లింపుదారులు ముఖ్యంగా మధ్య తరగతి, వేతన జీవులు, పింఛనుదారులు, సీనియర్ సిటిజన్స్ ఏడాది ప్రారంభంలోనే పన్ను చెల్లింపులకు సంబంధించి ఆలోచన చేస్తుంటారని, అందుకోసం ఆ వర్గాల వారు వేచి ఉండకుండా ఉండడం కోసమే ఈ ప్రతిపాదనలు తాత్కాలిక బడ్జెట్‌లో చేర్చినట్లు తెలిపారు. అంతేకాదు, ఇది తాత్కాలిక బడ్జెట్ కాదని, దేశం సాగిస్తున్న అభివృద్ధి ప్రయాణ సాధనమని ఆయన అభివర్ణించారు.' మనం చూస్తున్న ఈ మార్పు అంతా కూడా ఈ దేశ ప్రజల ఆకాంక్షే. ఈ క్రెడిట్ అంతా కూడా వారికే దక్కుతుంది. మా ప్రభుత్వ హయాంలో అభివృద్ధి అనేది ఒక ప్రజా ఉద్యమం అయింది' అని పీయూష్ గోయల్ అన్నారు. 'దేశ ప్రజల సాయంతో భారత దేశాన్ని ప్రపంచంలో ఒక గొప్ప దేశంగా తయారు చేస్తాం. వారితో కలిసి ప్రభుత్వం అందుకు పునాది వేసింది. వారి మద్దతులో భవనాన్ని నిర్మిస్తాం. ఒక నిర్ణయాత్మక నాయకత్వాన్ని మేము అందించాం. ఈ నాయకత్వం ఉద్దేశం సుస్పష్టం, పారదర్శకం, నిజాయితీ తిరుగులేనిది' అని కూడా ఆయన అన్నారు. ఒక గొప్ప సమాజంగా, బలమైన ఆర్థిక వ్యవస్థగా మన పూర్తి సామర్థ్యాన్ని సాధించే మార్గంలో అడ్డుగా ఉన్న అనేక సమస్యలను మేము పరిష్కరించాం. రాబోయే అయిదేళ్లలో భారత దేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగబోతోంది. అలాగే ఆ తర్వాత ఎనిమిదేళ్లలో 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్నది మా లక్ష్యం' అని గోయల్ చెప్పారు. దేశంలోని అసంఘటిత రంగ కార్మికులకూ మోడీ ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌లో భారీ ఊరట కల్పించింది. 'ప్రధాన మంత్రి శ్రమ యోగి బంధన్' పేరుతో పింఛను పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో నెలకు వంద రూపాయలు ప్రీమియం చెల్లిస్తే 60 ఏళ్ల తర్వాత నెలకు మూడు వేల రూపాయల పింఛను లభిస్తుంది. అసంఘటిత రంగంలోని పది కోట్ల మంది కార్మికులకు ఈ పథకం వర్తిస్తుంది.

జై కిసాన్

రైతుల కోసం కిసాన్ సమ్మాన్ నిధి

- ఏడాదికి రూ.6 వేల ఆర్థిక సాయం
- మూడు దఫాలుగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ
- 12 కోట్ల సన్నకారు రైతులకు ప్రయోజనం
- బడ్జెట్‌లో రూ.75 వేల కోట్లు కేటాయింపు



న్యూఢిల్లీ: దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉన్న నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఎన్నికల వేళ అన్నదాతలను తమ వైపునకు తిప్పుకునేందుకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎం–కిసాన్) పేరిట ఒక కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఏడాదికి ఆరు వేల రూపాయల ఆర్థిక సాయాన్ని నేరుగా అందజేస్తామని, అయిదెకరాలకన్నా తక్కువ సాగు భూమి ఉన్న రైతుల ఖాతాలలోకి ఈ నగదును బదిలీ చేస్తామని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ తన బడ్జెట్ ప్రసంగంలో తెలియజేశారు. ఈ పథకం వల్ల 12కోట్ల మందికి లబ్ధి కలుగుతుందని ఆయన చెప్పారు. ఈ పథకం కోసం వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.75 వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. మూడు దఫాలుగా ఈ సొమ్మను అందజేస్తామని చెప్పిన ఆయన 2018 డిసెంబర్‌నుంచే ఈ పథకం అమలులోకి వస్తుందని, తొలి విడత సొమ్మును మార్చి లోగా రైతుల ఖాతాల్లోకి జమ చేస్తామని చెప్పారు. ఇందుకోసం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.20,000 కోట్లను కేటాయిస్తున్నట్లు తెలిపారు. పిఎం–కిసాన్ పథకం పేద రైతు కుటుంబాలకు కచ్చితమైన అదనపు అదాయాన్ని అందించడమే కాకుండా అత్యవసర అవసరాలకు ముఖ్యంగా పంట కోతల సీజన్‌లో అవసరాలకు అవసరమైన డబ్బును సమకూరుస్తుందని, రైతులు తమ సంపాదనను పెంచుకోవడంతో పాటుగా గౌరవప్రదంగా జీవించడానికి ఈ పథకం తోడ్పడుతుందని గోయల్ చెప్పారు. ఇదే కాకుండా రైతులకు మరి కొన్ని ప్రోత్సాహకాలను కూడా గోయల్ ప్రకటించారు. వ్యవసాయ అనుబంధ రంగాలయిన పాడి పరిశ్రమ, చేపల పెంపకం లాంటి రంగాలను ప్రోత్సహించడం కోసం చర్యలు తీసుకోనున్నట్లు చెప్పా రు. గత బడ్జెట్‌లో తమ ప్రభుత్వం ఈ రంగాలకు కూడా కిసాన్ క్రెడిట్ కార్డు పథకాన్ని పొడిగిస్తున్నట్లు ప్రకటించిందని, ఇప్పుడు ఈ రంగాలలోని రైతు లు తీసుకునే రుణాలపై వడ్డీని 2 శాతం తగ్గిస్తున్నట్లు గోయల్ ప్రకటించారు. అంతేకాకుండా సకాలంలో రుణాలు చెల్లించిన వారికి అదనంగా మరో మూ డు శాతం వడ్డీ రాయితీ కూడా ఇవ్వనున్నట్లు ఆయన చెప్పా రు. అలాగే చేపల పెంపకం రం గాన్ని మరింతగా అభివృద్ధి చేయ డం కోసం ప్రత్యేకంగా ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌ను ఏర్పా టు చేయనున్నట్లు కూడా ఆయన తెలిపారు.



భారత్‌కు దశ దిశ

న్యూఢిల్లీ : రానున్న పదేళ్లకు దార్శనిక పత్రాన్ని కేంద్రం బడ్జెట్ లో ఆవిష్కరించింది. మరో పదేళ్ల తర్వాత పేదరికం, నిరక్షరాస్యత, పోషకాహారం లోపం, చెత్తాచెదారం వంటి ప్రస్తావన వస్తే అవి ఒకప్పుడు మన దేశంలో ఉండేవి అని చెప్పుకునే రోజులు రావాలి అని బడ్జెట్ ప్రసంగం సందర్భంగా కేంద్ర ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ చెప్పిన మాటలివి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ తాత్కాలిక బడ్జెట్‌తో రైతులు, మధ్యతరగతి ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేసిన మోదీ ప్రభుత్వం.. రానున్న దశాబ్దంపైనా ప్రత్యేక దృష్టిపెట్టినట్లు స్పష్టంగా చెప్పింది. 'విజన్–2030' పేరుతో నవభారత నిర్మాణానికి ప్రమాణాలు కూడా పెట్టుకుంది. ఈ ప్రమాణాలతో 2030 నాటికి ఆధునిక, సాంకేతిక, సమానత్వ, అభివృద్ధి భారతాన్ని నిర్మించడమే తమ లక్ష్యమని పేర్కొంది. రానున్న ఐదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ ఐదు లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంటుందని, ఆ తర్వాత 8ఏళ్లకు 10లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందని అంచనా వేసింది.

1. యువతకు అవకాశాలు కల్పన, స్టార్టప్ కంపెనీలు, లక్షల ఉద్యోగాల కల్పనతో డిజిటల్ భారత నిర్మాణం.
2. సేంద్రియ పద్ధతిలో తగినంత ఆహార పదార్థాల ఉత్పత్తి
3. ఆయుష్మాన్ భారత్ తరహా పథకాలతో 2030 నాటికి ఆరోగ్య భారతం
4. విద్యుత్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనాలతో దేశాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దడం
5. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి గ్రామీణ పారిశ్రామికీకరణ దిశగా చర్యలు చేపట్టడం
6. సాగరమాలను మరింత విస్తృత పరిచి రవాణా మెరుగు పరచడం
7. నదుల శుద్ధి, ప్రతి ఒక్కరికీ సురక్షిత మంచినీరు అందించడం, చిన్ననీటి వనరుల ద్వారా సమర్థంగా నీటి వినియోగం
8. 2022 నాటికి గగన్‌యాన్‌తో రోదసిలోకి దూసుకెళ్లి భారత్‌ను ఉపగ్రహాల ప్రయోగ వేదికగా ప్రపంచానికి పరిచయం చేయడం
9. బాధ్యతాయుతమైన ప్రభుత్వ అధికారులతో కనిష్ట ప్రభుత్వం గరిష్ఠ పాలన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడం
10. సులభతర జీవనాన్ని అందించడం, మౌలిక సదుపాయాలను పెంపొందించడం

> సినిమా రంగాన్ని నేను దేవాలయం కంటే ఎక్కువగా ఆరాధిస్తాను. సినిమాల వల్ల సమాజం ఎప్పుడూ చెడిపోదు. సమాజానికి సినిమా అద్దంలాంటిది. ఇక పదాల కూర్పునే పాటలు అనుకునే రచయితల శైలి మారినప్పుడు సినీ రంగంలో చక్కటి పాటలు వస్తాయి.
>
> – ప్రముఖ సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి

వైఎస్ఆర్‌ను అనుకరిస్తూ చేయాలనుకోలేదు

వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జీవిత చరిత్రలో ఆయన చేపట్టిన పాదయాత్రకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఆ పాదయాత్రలోని కీలక ఘట్టాలను ఆధారంగా చేసుకొని రూపొందించిన సినిమా 'యాత్ర'. వైఎస్ఆర్ పాత్రలో మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి అద్భుతంగా నటించారు. 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహి వి.రాఘవ్ దర్శకత్వంలో విజయ్ చిల్లా, శశిదేవి రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా మమ్ముట్టితో ఇంటర్వ్యూ విశేషాలు...



అనుకరిస్తూ చేయాలనుకోలేదు...

వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన 'యాత్ర'లో నటించడంతో ఎంతో హ్యాపీగా ఉంది. నేను వైఎస్ఆర్‌ను అనుకరిస్తూ ఈ సినిమా చేయాలనుకోలేదు. ఆయనలా మాట్లాడి, నడిచి, ప్రవర్తించడం అనేది సాధ్యం కాదు. ఆయన క్యారెక్టర్‌లోని సోల్‌ను ఆధారంగా చేసుకొని ఈ సినిమా చేశాం.

ఫుల్ బయోపిక్ కాదు...

దర్శకుడు మహి వి.రాఘవ్ పూర్తి స్క్రిప్ట్‌తో నా దగ్గరికి వచ్చారు. మంచి నిర్మాతలు ఉన్నారు. ఓ లెజెండరీ క్యారెక్టర్ చేయవచ్చని ఈ సినిమా చేయడానికి అంగీకరించాను. వైఎస్ఆర్ జీవితంలోని కొన్ని సంఘటనలను ఆధారంగా చేసుకొని తెరకెక్కించిన బయోపిక్ ఇది. అయితే ఇది ఆయన ఫుల్ బయోపిక్ కాదు. ఆయన పాదయాత్ర ప్రధానంగా సాగే కథ ఇది. అలాగే యాత్ర అంటే పాదయాత్ర మాత్రమే కాదు...వ్యక్తులను కలుసుకోవడం, వారి బాధలను తెలుసుకోవడం, భావోద్వేగాలను పంచుకోవడం. దాని ఆధారంగానే మహి ఈ స్క్రిప్ట్‌ను తయారు చేశాడు.

కొత్త దర్శకులు కొత్తగా చెబుతారు...

నా కెరీర్‌లో నేను 70కి పైగా డెబ్యూ డైరెక్టర్స్‌తో పనిచేశాను. అలా చూస్తే మహి వి.రాఘవ్ డెబ్యూ డైరెక్టర్ కాదు. ఈ 70 మంది దర్శకుల్లో ఎక్కువ మంది ఇంకా దర్శకులుగా కొనసాగుతున్నారు. ఇక కొత్త దర్శకులు ఓ విషయాన్ని కొత్తగా చెప్పడానికి ప్రయత్నిస్తారని బాగా నమ్ముతాను.

అలాగే ఉన్నానని...

చాలా కాలం తర్వాత తెలుగులో నేను చేసిన సినిమా 'యాత్ర'. ఈ కథ వినగానే నాకు సరిపోయే పాత్ర అనిపించింది. ఇక 'స్వాతి కిరణం'లో చేసినప్పుడు ఎలా ఉన్నానో ఇప్పుడు అలాగే ఉన్నానని అంటున్నారు.

మంచి పేరు తెస్తుందని...

గతంలో నేను అంబేద్కర్, బషీర్ బయోపిక్స్‌లో నటించాను. ఇప్పుడు వైఎస్ఆర్ బయోపిక్‌లో చేశాను. ఇక ఓ నటుడిగా నాకు మంచి పేరు తెచ్చే చిత్రంగా 'యాత్ర' నిలుస్తుందని భావిస్తున్నాను.

స్వయంగా డబ్బింగ్ చెప్పా...

ఈ సినిమాలో నేను స్వయంగా డబ్బింగ్ చెప్పాను. ఇక తెలుగు, మలయాళంలో చాలా పదాలు ఒకేలా ఉంటాయి. కొన్ని చోట్ల కొన్ని పదాలను ఒత్తి పలకాల్సి ఉంటుంది. వాటి విషయంలో కాస్త జాగ్రత్తలు తీసుకుంటూ డబ్బింగ్ చెప్పాను.

మంచి పరిణామమే...


ఈమధ్య ప్రతి చిత్ర పరిశ్రమలో చాలా మార్పులు వచ్చాయి. ఇక తెలుగు చిత్ర పరిశ్రమలో వైవిధ్యమైన సినిమాలకు మంచి ఆదరణ లభిస్తోంది. ఇది మంచి పరిణామమే.

సౌత్ మీదే ఫోకస్

మొన్నటిదాకా టాలీవుడ్ స్టార్లందరితోనూ వరుసగా సినిమాలు చేసి టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది రకుల్‌ప్రీత్ సింగ్. అయితే ఈమధ్య ఆమెకు తెలుగులో అవకాశాలు బాగా తగ్గిపోయాయి. హిందీలో ఆమె చేసిన 'అయారి' సినిమా పూర్తిగా నిరాశపరిచింది. అందుకే కోలీవుడ్‌లో నిలదొక్కుకుందామని రకుల్ ప్రయత్నాలు చేస్తోంది. గత ఏడాది కార్తి సరసన చేసిన 'ఖాకీ' ఈ భామకు అక్కడ మంచి పేరును తీసుకొచ్చింది. ఆ జోష్‌తోనే అదే కార్తీతో రకుల్ చేసిన 'దేవ్' చిత్రం ఈనెలలోనే విడుదల కానుంది. అడ్వెంచర్లు చేసే హీరోతో ప్రేమలో పడే అమ్మాయిగా రకుల్ పాత్ర చాలా కొత్తగా ఉంటుందని తెలిసింది. తమిళ్‌తో పాటు తెలుగులోనూ ఈ చిత్రం విడుదల కానుంది. దీంతో ఈ చిత్రం హిట్ అయితే కోలీవుడ్, టాలీవుడ్‌లలో తనకు మంచి ఆఫర్లు వస్తాయని రకుల్ భావిస్తోంది. ఇక ప్రస్తుతం రకుల్ మరో హిందీ సినిమా కూడా చేస్తోంది. అయితే ఇప్పుడు ఈ భామ ఫోకస్ అంతా సౌత్ మీదే ఉంది.



గ్లాస్ వెనుక మంచు తెర చాటున మెరిసిన రకుల్
(ఈ ఫొటోను రకుల్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది)



రకుల్‌ప్రీత్ సింగ్

నాలుగవ చిత్రం ఆ దర్శకుడితో?



'మిస్టర్ మజ్ను' చిత్రం ప్రేక్షకుల అంచనాలను అందులేకపోవడంతో మరోసారి అఖిల్‌కు నిరాశ తప్పలేదు. కెరీర్‌లో బ్రేక్ కోసం మరికొంత కాలం వేచి చూడక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ చిత్రం తర్వాత అఖిల్ నెక్స్ట్ సినిమా సంగతి ఏంటి? ఏ దర్శకుడితో సినిమా చేస్తాడు? ఇప్పటికే ఈ విషయంలో రూమర్లు చాలానే వినిపిస్తున్నాయి. అక్కినేని అభిమానులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. అస్సలు ఫామ్‌లో లేని దర్శకుడు శ్రీనువైట్లతో అఖిల్ సినిమా ఉంటుందని కొందరంటే... పూరి జగన్నాథ్‌తో అఖిల్ సినిమా చేస్తాడని మరికొందరు అంటున్నారు. వీటి సంగతేమో కానీ టాలీవుడ్ ఫిలిం సర్కిళ్లలో ఓ కొత్త టాక్ వినిపిస్తోంది. అఖిల్ నాలుగవ సినిమా బాధ్యతను నాగార్జున దర్శకుడు క్రిష్ చేతిలో పెట్టారని అంటున్నారు. 'ఎన్టీఆర్‌ః మహానాయకుడు' విడుదల తర్వాత అఖిల్ సినిమాపై క్రిష్ దృష్టి పెడతాడని చెబుతున్నారు. ఈ సినిమా ప్రకటించే లోపు అఖిల్ రెండు నెలల పాటు హాలిడే ట్రిప్ కోసం విదేశాలకు వెళ్తాడట. అఖిల్ నాలుగవ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై నాగార్జున స్వయంగా నిర్మిస్తారట. ఈ సినిమాకు క్రిష్, రాజీవ్ రెడ్డి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తారని సమాచారం.



జిఎస్‌టిని 12 శాతానికి తగ్గింపు

సినీ రంగంపై వరాల జల్లు

కేంద్ర ఆర్థిక మంత్రి పీయుష్ గోయల్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సినీ రంగంపై వరాల జల్లు కురిసింది. ముఖ్యంగా సింగిల్ విండో సిస్టమ్‌కు పూర్తి స్థాయిలో క్లియరెన్స్ ఇవ్వడం సర్వత్రా హర్షానికి కారణమైంది. దీనివల్ల నిర్మాతలపై చాలా వరకు అనవసర ఒత్తిడి తగ్గిపోతుంది. ఇన్నాళ్లు విదేశీ చిత్రాలకు మాత్రమే ఈ విధానం అందుబాటులో ఉండేది. ఇకపై దేశంలోని అన్ని చిత్ర పరిశ్రమలకు ఈ విధానం అందుబాటులోకి రానుంది. అలాగే వేలాది మందికి ఉద్యోగాలను కల్పించే చిత్ర పరిశ్రమపై జీఎస్టీని 12 శాతానికి తగ్గిస్తున్నామని ప్రకటించారు. పైరసీని అరికట్టేందుకు యాంటీ కామ్ కార్డింగ్ ప్రొవిజన్ చట్టాన్ని సినిమాటోగ్రఫీ చట్టానికి జత చేయనున్నామని ప్రకటించడంతో వినోద రంగానికి ఒక్కసారిగా కొత్త ఊపిరి పోసినట్లయింది. అయితే ఇవన్నీ ఎంత వేగంగా అమలైతే చిత్ర పరిశ్రమకు అంత మేలు జరిగినట్టు.

హాలీవుడ్ ఎంట్రీ



'బాహుబలి' చిత్రంలో భళ్లాలదేవ పాత్రలో అద్భుతంగా నటించి ఎంతో పేరు తెచ్చుకున్నారు రానా. ఆతర్వాత అతనికి వరుసగా మంచి అవకాశాలు వస్తున్నాయి. తెలుగుతో పాటు తమిళ్, హిందీ చిత్రాల్లో కూడా ఆఫర్లు వస్తున్నాయి. హిందీలో రానా 'హాతీ మేరే సాథీ' చిత్రంలో చేస్తున్నారు. ఇదిలాఉండగా రానా కెరీర్‌లో మరో మైలురాయి జత కాబోతోంది. అదే హాలీవుడ్ ఎంట్రీ. ఇప్పటికే ఒక టీం అతనితో ఈ ప్రాజెక్ట్ గురించి చర్చించినట్టు తెలిసింది. అందులో రానా హీరోనా లేదా విలనా అనే వివరాలు తెలియాల్సి ఉంది. గతంలో అనిల్‌కపూర్, ఇమ్రాన్ ఖాన్ వంటి బాలీవుడ్ నటులు ఇంగ్లీష్ సినిమాలు చేశారు. కానీ హాలీవుడ్ సినిమాల్లో తెలుగు వాళ్లు నటించడం బహుశా ఇదే మొదటిసారి కావచ్చు. అప్పుడెప్పుడో పాతికేళ్ల క్రితం చిరంజీవి హీరోగా 'అబు ది బాగ్దాద్ తీఫ్' అనే సినిమా షూటింగ్ ప్రారంభించుకొని ఆగిపోయింది. ఇప్పుడు రానా రూపంలో తెలుగు తేజం హాలీవుడ్ తెరపై మెరవబోతోంది. అయితే ఈ సినిమాకు సంబంధించిన వివరాలు తెలియడానికి ఇంకా కొంత సమయం పడుతుంది.



పూజా హెగ్డే

'లవ్ ఎట్ సెకండ్ లుక్' అనే కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్నాం



ఉదయ్ కుమార్ రఘురాజ్

ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరోహీరోయిన్లుగా పరిచయమవుతున్న చిత్రం '4 లెటర్స్'. ఆర్.రఘురాజ్ దర్శకత్వంలో దొమ్మరాజు ఉదయ్‌కుమార్, దొమ్మరాజు హేమలత నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ఆర్.రఘురాజ్ మాట్లాడుతూ ''ఇంజనీరింగ్ స్టూడెంట్స్‌ను దృష్టిలో పెట్టుకొని తీసిన సినిమా '4 లెటర్స్'. ఈ చిత్రాన్ని ఇంజనీరింగ్ స్టూడెంట్స్‌కు అంకితమిస్తున్నాం. ఈ విద్యార్థులకు మా సినిమాలో ఒక మంచి సందేశం కూడా ఉంటుంది. 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అని చెబుతూ ఉంటారు. కానీ అవన్నీ బ్రేకప్ అవుతున్నాయి. అయితే మేము 'లవ్ ఎట్ సెకండ్ లుక్' అనే కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్నాము. ఈ సినిమాలో హీరో తండ్రికి POOR అనే ఫోర్ లెటర్స్ నచ్చవు. మరోవైపు హీరోయిన్ తల్లికి RICH అనే ఫోర్ లెటర్స్ నచ్చవు. హీరోయిన్ LOVE అనే ఫోర్ లెటర్స్‌తో సతమతమవుతుంది. హీరోయిన్ తండ్రి జీవితంలో FAIL అనే ఫోర్ లెటర్స్ తప్ప ఏం అనుభవించడు. హీరో స్నేహితులు PASS అనే ఫోర్ లెటర్స్ గురించి ఆలోచించరు. యూత్‌కు నచ్చే ఫోర్ లెటర్స్ కూడా ఈ చిత్రంలో ఉన్నాయి. హీరోహీరోయిన్లు ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణాల కు ఇది మొదటి సినిమా అయినా చాలా చక్కగా నటించారు''అని అన్నా రు. నిర్మాత ఉదయ్‌కుమార్ దొమ్మరాజు మాట్లాడుతూ ''21 ఏళ్లుగా న్యూయార్క్ సిటీలో ఉంటున్నాను. న్యూయార్క్ సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్‌లో డైరెక్టర్‌గా పనిచేస్తున్నాను. మాకు ఈశ్వర్, దివ్య అనే ఇద్దరు పిల్లలున్నారు. మా కుటుంబానికి సినిమాలన్నా, సంగీతమన్నా చాలా ఇష్టం. మా అబ్బాయి ఈశ్వర్‌కు చిన్నప్పటి నుంచి సినిమాలంటే చాలా ఆసక్తి. ఇక ఈశ్వర్ వైజాగ్ సత్యానంద్ దగ్గర నటనలో శిక్షణ తీసు కున్నాడు. ఇక మేము దర్శకుడు రఘురాజ్‌ను నమ్మి ఈ సినిమా తీశాం. కాలేజీ బ్యాక్‌డ్రాప్‌లో జరిగే యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ '4 లెటర్స్'. నేటి యూత్‌కు బాగా కనెక్ట్ అవుతుంది ఈ చిత్రం. ఇటీవల ఫస్ట్ కాపీ చూశాను. నిజంగా పుత్రోత్సాహం పొందాను. నాతో పాటు చూసిన వారందరూ కూడా ఒక కొత్త హీరోలా కాకుండా ఎంతో అనుభవం ఉన్న హీరోలా ఈశ్వర్ నటించాడని అంటున్నారు. ఇక మా బ్యానర్‌లో వరుసగా సినిమాలు చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. మా ఈశ్వర్‌తో పాటు కొత్తవారికి, కొత్త దర్శకులకు అవకాశాలు ఇవ్వాలనుకుంటున్నాం''అని పేర్కొన్నారు.

ఊహించని విధంగా పారితోషికం

సూపర్‌స్టార్ మహేష్‌బాబు ప్రతిష్టాత్మక 25వ చిత్రం 'మహర్షి' మరి కొద్ది రోజుల్లో చిత్రీకరణను పూర్తి చేసుకోబోతోంది. ఏప్రిల్ చివరి వారంలో ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఇక ఈ చిత్రంలో హీరోయిన్‌గా పూజా హెగ్డే నటిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం టాలీవుడ్ క్రేజీ హీరోయిన్‌గా దూసుకుపోతున్న ఈ భామ 'మహర్షి' చిత్రానికి గాను 1.75 కోట్ల పారితోషికాన్ని తీసుకున్నట్లుగా తెలిసింది. భారీ బ్లాక్‌బస్టర్ హిట్స్ ఇప్పటివరకు పూజ ఖాతాలో పడింది లేదు. 'అరవింద సమేత' చిత్రం పర్వాలేదు అనిపించినా ఈ భామకు ఆ సినిమా అంతగా క్రేజ్‌ను తెచ్చిపెట్టలేదు. అయినా కూడా 'మహర్షి' ఫిల్మ్ మేకర్స్ ఈ చిత్రం కోసం పూజకు భారీ మొత్తంలో పారితోషికం ఇవ్వడం సినీ వర్గాల వారిని అవాక్కయ్యేలా చేస్తోంది. ఈ చిత్రం కోసం పూజా హెగ్డే డేట్లు ఎక్కువగా కేటాయించాల్సి ఉంటుందని... అంతేకాకుండా ఎప్పుడు అడిగితే అప్పుడు డేట్లు కేటాయించాలని నిర్మాతలు కండీషన్ పెట్టడం వల్ల రెండు కోట్ల వరకు ఈ బ్యూటీ డిమాండ్ చేసిందట. చివరికి ఫిల్మ్‌మేకర్స్ 1.75 కోట్ల పారితోషికాన్ని పూజకు అందజేశారట. 'మహర్షి' సినిమాకు తన అవసరం ఉంది కాబట్టి ఈ భామ ఈ స్థాయిలో పారితోషికాన్ని తీసుకుంది.

మరో బయోపిక్‌లో విద్యాబాలన్

బాలీవుడ్ నటి విద్యాబాలన్ ఇటీవల 'ఎన్టీఆర్‌ః కథానాయకుడు'లో బసవతారకం పాత్రలో నటించి ప్రేక్షకులను అలరించింది. ఈ చిత్రంలో తన నటనతో ఆమె ప్రేక్షకులను మైమరపించింది. అయితే విద్యాబాలన్ ఇప్పుడు బయోపిక్ చిత్రాలకు అడ్రస్‌లా మారింది. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత బయోపిక్‌లో కూడా ఆమె నటించనుంది. ఇక తాజాగా మరో బయోపిక్‌కు విద్యాబాలన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని సమాచారం. మానవ కంప్యూటర్, ప్రముఖ మ్యాథమెటీషియన్ శకుంతల దేవి జీవితం ఆధారంగా తెరకెక్కనున్న బయోపిక్‌లో ఆమె నటించనుంది. ఈ చిత్రంలో శకుంతల దేవి పాత్రలో విద్యాబాలన్ కనిపించనుంది. అను మీనన్ రూపొందించనున్న ఈ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది.



బ్యాలెన్స్ యోగాతో ఫిట్‌గా...



ప్రతి రోజు ఉదయం సూర్య నమస్కారాలు చేసి యోగ సాధన చేయమని పెద్దలు చెబుతుంటారు. డాక్టర్లు చెప్పేది ఇదే. ఇప్పుడు పలువురు సినీ సెలబ్రిటీలు కూడా యోగ చేస్తూ ఫిజికల్‌గా ఫిట్‌గా ఉంటున్నారు. అయితే ఈమధ్యన కొందరు సెలబ్రిటీలు బ్యాలెన్స్ యోగ చేస్తూ రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటున్నారు. బాలీవుడ్ బ్యూటీ మలైకా అరోరా కూడా ప్రతిరోజు బ్యాలెన్స్ యోగ చేస్తూ తన అందచందాలను కాపాడుకుంటోందట. మలైకా చేస్తున్న ఈ యోగ విద్య ఎంత కఠోరంగా ఉందో చూస్తేనే అర్థమవుతోంది. ఇక గత కొంతకాలంగా యంగ్ హీరో అర్జున్‌కపూర్‌తో మలైకా ఎఫైర్ గురించి బాలీవుడ్ మీడియాలో జోరుగా వార్తలు వస్తున్నాయి. అర్జున్, మలైకా చెట్టాపట్టాల్ వేసుకొని తిరుగుతున్న ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి.

మానవ సంబంధాలకు ప్రాధాన్యతనివ్వాలి




సూపర్ గుడ్ ఫిలింస్ అధినేత ఆర్.బి.చౌదరి తనయుడు జితన్ రమేష్ హీరోగా లార్డ్ వెంకటేశ్వర ఫిలింస్ పతాకంపై నారాయణ్ రామ్ నిర్మిస్తున్న చిత్రం 'ఒకటే లైఫ్'. హ్యాండిల్ విత్ కేర్ అనేది ఉపశీర్షిక. శృతి యుగల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి ఎం.వెంకట్ దర్శకుడు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తిచేసుకొని యు/ఎ సర్టిఫికెట్‌ను పొందిన ఈ చిత్రాన్ని ఈ నెలలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు వెంకట్ మాట్లాడుతూ ''నేటి తరం మానవ సంబంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న కాన్సెప్ట్‌తో తెరకెక్కిన చిత్రమిది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో సూపర్‌గుడ్ ఫిలింస్ అధినేత ఆర్.బి.చౌదరి అబ్బాయి జితన్ రమేష్ హీరోగా నటించారు. అమ్రీష్ అందించిన పాటలకు ఆదరణ బాగుంది. ఈ చిత్రాన్ని ఈ నెలలో విడుదల చేస్తాం''అని అన్నారు. నిర్మాత నారాయణ్ రామ్ మాట్లాడుతూ ''సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రానికి యు/ఎ సర్టిఫికెట్ వచ్చింది. దర్శకుడు ఈ సినిమాను తెరకెక్కించిన విధానం హైలైట్‌గా నిలుస్తుంది''అని తెలిపారు.

ఆర్థిక వృద్ధికి ఊతం

రైతులు, మధ్యతరగతికి అనుకూలం: పరిశ్రమ వర్గాలు

న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌తో డిమాండ్ పెరిగి, ఆర్థిక వృద్ధి ఊతం అందించనుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేశాయి. మధ్య తరగతి, రైతులు, అసంఘటిత రంగంలో వర్కర్లకు ఎన్నో వరాలు కురిపించారని, దీంతో వారి చేతికి మరింత ఆదాయం రానుందని అన్నారు. అనంద్ మహీంద్రా, గౌతమ్ అదానీ, ఐటిసి ఎండి సంజీవ్ పూరి, వాల్‌మార్ట్ ఇండియా సిఇఒ క్రిష్ అయ్యర్‌లు బడ్జెట్‌పై సానుకూలంగా స్పందించారు.

మధ్య తరగతి, రైతులకు ఊరట



ఈ బడ్జెట్ ప్రజాకర్షకంగా ఉంది. ఎలాంటి సమస్యాత్మక విధానాలు చేపట్టకుండా మధ్య తరగతి, రైతులకు ఊరట కల్గించడం గొప్ప విషయం. ఇది నియంత్రణతో కూడిన విధానం.
– మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా

ప్రజల ఆశలు చిగురించాయి



దేశీయ మధ్య తరగతి, చిన్న వ్యాపారులు, రైతులు ఆర్థిక వృద్ధికి జీవనాధారం. ఈ బడ్జెట్ – 2019లో ప్రకటనలతో కోట్లాది మంది ప్రజల ఆశలు చిగురించాయి.
– అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ

సరైన అంశాలతో ఉంది



బడ్జెట్–2019 సరైన అంశాలను స్పృశించింది. ఆర్థిక వ్యవస్థలో డిమాండ్, వృద్ధికి అనుకూలంగా ఉంది. రైతులు, మధ్యతరగతి ప్రజలు, అసంఘటిత రంగ కార్మికులు వంటి సమాజానికి ఎంతో మేలు చేసేలా ఉంది. వారి ఆదాయం స్థిరత్వానికి, సమస్యల పరిష్కారానికి దోహదం చేస్తుంది.
– సిఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ

మధ్య తరగతి, గ్రామీణంపై ఫోకస్




మధ్య తరగతి, గ్రామీణ రంగాలపై బడ్జెట్ సరిగ్గా దృష్టి పెట్టింది. రైతులు ఆదాయం పెంచేందుకు ఇది దోహదం చేయనుంది.
– వాల్‌మార్ట్ ఇండియా సిఇఒ క్రిష్ అయ్యర్

వృద్ధికి దోహదం



మధ్యంతర బడ్జెట్ ప్రతిపాదనలు దేశీయ ఆర్థిక వ్యవస్థకు ఎంతో సానుకూలం, వినిమయానికి ఊతం, అలాగే వృద్ధికి దోహదం చేస్తాయి. రైతులు, మధ్యతరగతి ప్రజలు, అసంఘటిత రంగ కార్మికులకు సరైన విధానాలను ప్రకటించారు.
– ఐటిసి ఎండి సంజీవ్ పూరి

పేదలకు వరాల జల్లు



బడ్జెట్–2019లో ప్రజలకు ఎన్నో తాయిలాలు ఇచ్చారు. మధ్యతరగతి, రైతులు, అసంఘటిత రంగ కార్మికులకు ఈ బడ్జెట్ ఎన్నో వరాలు కురిపించింది.
– డాబర్ ఇండియా సిఇఒ సునీల్ దుగ్గల్

పిఎం కిసాన్ యోజన భేష్




మధ్యంతర బడ్జెట్‌లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయానికి పటిష్టమైన నిర్ణయాలు ఉన్నాయి. ప్రత్యేకించి పిఎం కిసాన్ యోజన, రైతులకు ప్రత్యక్ష నగదు బదిలీ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల పట్ల ఎంతో ఆశావాహంతో ఉన్నాం. రైతులకు ఇది శుభ సూచకం.
– కార్గిల్ ఇండియా ప్రెసిడెంట్ సైమన్ జార్జ్

ద్రవ్య లభ్యతను పెంచుతుంది



వినియోగదారులకు ఈ బడ్జెట్ ద్రవ్య లభ్యతను పెంచుతుందని ఆశిస్తున్నాం. కొన్ని వస్తువులపై జిఎస్‌టి తగ్గింపు బాగుంది.
– వర్ల్‌పూల్ ఇండియా ఎండి సునీల్ డి'సౌజా

పెట్టుబడి అవకాశాలు



పెట్టుబడి అవకాశాలు, ఆపరేటింగ్ రేషియో మెరుగుదల, కొత్త సెమీ హైస్పీడ్ రైళ్లు ప్రవేశపెట్టడం వంటివి బాగనున్నాయి. బడ్జెట్‌లో ఎన్నో ముఖ్యమైన నిర్ణయాలు ఉన్నాయి.
– బంబార్డియర్ ట్రాన్స్‌పోర్ట్ ఎండి సుదీర్ రావ్

నష్టమెవరికి, లాభమెవరికి?



న్యూఢిల్లీ : తాత్కాలిక బడ్జెట్‌తో ఎవరు లాభపడతారు? ఎవరు నష్టపోతారు? అనే సందేహాలు నెలకొన్నాయి. ప్రభుత్వం జనాకర్షక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. కొద్ది నెలల్లో ఎన్నికలు ఉన్నాయనంగా ఈ బడ్జెట్ వరాలు ప్రభుత్వానికి ఎంతో సానుకూలంగా మారనున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

- ఈ బడ్జెట్ వల్ల ప్రధానంగా రైతులు, పన్ను చెల్లింపుదారులు, గ్రామీణ భారతం, కార్మికులు, రియల్ ఎస్టేట్, వాహన తయారీదారులు, ప్రధాని నరేంద్ర మోడీ లాభపడనున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు.
- నష్టపోయేదెవరంటే బాండ్ హోల్డర్లు, ప్రతిపక్ష పార్టీలు, వ్యవసాయ కార్మికులు, రక్షణ రంగాలని పేర్కొంటున్నారు.

రూ.5 లక్షల వరకు వార్షిక ఆదాయం కల్గినవారు పూర్తి పన్ను రిబేటును పొందుతారు. ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రావిడెంట్ ఫండ్స్, సేవింగ్స్, బీమా వంటి వాటిలో పెట్టుబడులు పెట్టినవారికి రూ.1.5 లక్షల వరకు అదనపు మినహాయింపు ఉంటుంది. ప్రస్తుతం రూ.2.5 లక్షల వరకు మాత్రమే వ్యక్తిగత ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఉంది. పన్ను సంస్కరణ ప్రయోజనాలను మధ్య తరగతి పన్ను చెల్లింపుదారులకు బదిలీ చేయాలని నిర్ణయించాం. దీనిలో భాగంగానే స్థూల ఆదాయం రూ.6.50 లక్షలు కల్గిన వారు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. అంటే రూ.5 లక్షలు + రూ.1.5 లక్షలు = రూ.6.50 లక్షల వరకు పన్ను మినహాయింపు పొందుతారు.
– కేంద్ర ఆర్థికమంత్రి పీయూష్ గోయల్



రూ.5 లక్షల వరకు..
పన్ను సునామీ



వేతన జీవులకు బంపర్ బొనాంజా

అదనంగా లక్షన్నర పెట్టుబడులకు మినహాయింపు ● లబ్ధి పొందనున్న 3 కోట్ల మంది ● ఎస్‌టిడి పెంపు

న్యూఢిల్లీ : బడ్జెట్–2019లో వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులకు భారీ ఊరట లభించింది. రూ.5 లక్షల వరకు వార్షిక ఆదాయం కల్గినవారు పూర్తి పన్ను రిబేటును పొందుతారని, ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం రూ.2.5 లక్షల వరకు మాత్రమే వ్యక్తిగత ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఉంది. శుక్రవారం తాత్కాలిక బడ్జెట్–2019 సందర్భంగా కేంద్ర ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ, గత నాలుగున్నర ఏళ్లలో కీలక పన్ను సంస్కరణలు చేపట్టిన కారణంగా పన్ను వసూళ్లు, అలాగే టాక్స్ బేస్ గణనీయంగా పెరిగిందని అన్నారు. దీంతో పన్ను సంస్కరణ ప్రయోజనాలను మధ్య తరగతి పన్ను చెల్లింపుదారులకు బదిలీ చేయాలని నిర్ణయించామని అన్నారు. దీనిలో భాగంగానే రూ.6.50 లక్షల స్థూల ఆదాయం కల్గిన వారు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రావిడెంట్ ఫండ్స్, ప్రత్యేకించి సేవింగ్స్, బీమా వంటి వాటిలో పెట్టుబడులు పెట్టినవారికి రూ.1.5 లక్షల వరకు మినహాయింపు ఉంటుంది.
అంటే రూ.5 లక్షల + రూ.1.5 = రూ.6.50 లక్షల వరకు పన్ను మినహాయింపు పొందుతారు. ప్రస్తుతం రూ.2.5 లక్షల వరకు వ్యక్తిగత ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఉండగా, రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల మధ్య ఆదాయం ఉంటే 5 శాతం పన్ను, అలాగే రూ.5–10 లక్షల మధ్య ఉంటే 20 శాతం ఉంది. ఇక రూ.10 లక్షల ఆదాయం కల్గినవారు 30 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

రూ.3 లక్షల ఆదాయం
బడ్జెట్–2019కు ముందు పన్ను రూ.2500.. ప్రస్తుతం ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. అంటే రూ.2500 ఆదా అవుతుంది.

రూ.5 లక్షల ఆదాయం
బడ్జెట్–2019కు ముందు పన్ను రూ.12,500.. ప్రస్తుతం ఎలాంటి పన్ను చెల్లించనవసరం లేదు. అంటే రూ.12,500 ఆదా అవుతుంది.

రూ.10 లక్షల ఆదాయం
బడ్జెట్‌కు ముందు పన్ను రూ.1,12,500.. ప్రస్తుతం రూ.1,00,000 పన్ను చెల్లించాలి. అంటే రూ.12,500 ఆదా అవుతుంది.

రూ.15 లక్షల ఆదాయం
బడ్జెట్‌కు ముందు పన్ను రూ.2,62,500 ... ప్రస్తుతం రూ.2,50,000 పన్ను చెల్లించాలి. అంటే రూ.12,500 ఆదా అవుతుంది.

స్టాండర్డ్ డిడక్షన్ పెంపు
వేతనజీవులకు స్టాండర్డ్ డిడక్షన్ రూ. 40,000 నుంచి రూ. 50,000 వరకు ప్రభుత్వం పెంచింది. దీని ద్వారా 3 కోట్ల మంది వేతనజీవులకు దాదాపు రూ.4,700 కోట్ల వరకు అదనపు పన్ను ప్రయోజనం పొందనున్నారని ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. టిడిఎస్ పరిమితి పెంపు దాంతో పాటు పోస్ట్ ఆఫీస్, బ్యాంకు డిపాజిట్లపై టిడిఎస్ పరిమితిని రూ.10 వేల నుంచి రూ.40 వేలకు పెంచారు.
గతంలో పన్ను శ్లాబ్‌ను మార్చకపోవడం ఉద్యోగ వర్గాల్లో నిరాశ ఉందని, ఇప్పుడు వారి ఆశలను నెరవేర్చామని గోయల్ అన్నారు. అయితే దేశాభివృద్ధికి, పేదల సంక్షేమానికి సహకరిస్తున్న పన్ను చెల్లింపుదారులపై ఆయన ప్రశంసలు కురిపించారు.

వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులపై పన్ను ప్రతిపాదనలు



	ప్రస్తుతం	ప్రతిపాదన	ప్రస్తుతం	ప్రతిపాదన	ప్రస్తుతం	ప్రతిపాదన
వేతనం	5 lakh	5 lakh	7.5 lakh	7.5 lakh	20 lakh	20 lakh
ఎస్‌టిడి డిడక్షన్	40,000	50,000	40,000	50,000	40,000	50,000
నికర మొత్తం ఆదాయం	4.6 lakh	4.5 lakh	7.1 lakh	7 lakh	19.6 lakh	19.5 lakh
పన్ను	10,500	10,000	54,500	52,500	3,00,500	2,97,500
నికర పన్ను	10,500	NIL	54,500	52,500	3,00,500	2,97,500
సర్‌చార్జ్						
ఎడ్యు సెస్	420	NIL	2,180	2,100	12,020	11,900
మొత్తం పన్ను	10,920	NIL	56,680	54,600	3,12,520	3,09,400
పన్ను ఆదా	--	10,920	--	2,080		3,120

ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

న్యూఢిల్లీ : ప్రస్తుతం భారత్ ప్రపంచంలో ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో చేపట్టిన సంస్కరణలు, పథకాలు దేశాన్ని వేగంగా వృద్ధి బాటలో పయనించేలా చేశాయి. 2013–14లో ప్రపంచంలో 11 స్థానంలో ఉన్న భారత్ ఇప్పుడు ఆరో స్థానానికి చేరుకుందని బడ్జెట్ ప్రసంగం సందర్భంగా ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. వార్షికంగా 7.3 శాతం జిడిపి(స్థూల దేశీయోత్పత్తి)తో భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధిని సాధిస్తున్న దేశంగా నిలిచిందని అన్నారు. 1991లో సంస్కరణలు ప్రారంభించినప్పటి నుంచి చూస్తే ఏ ప్రభుత్వం ఇంతటి ఘనతను సాధించలేదన్నారు.

2022 నాటికి నవ భారత్
2022 సంవత్సరంలో 75వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని సరికొత్త భారత్ ఆవిష్కృతం కానుంది. ప్రతి ఒక్కరికి ఇళ్లు, నీరు, విద్యుత్, టాయిలెట్లు పొందుతారని గోయల్ అన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు కానుందని, తీవ్రవాదం, అవినీతి రహిత దేశంగా భారత్ మారనుందని అన్నారు.

ద్రవ్యోల్బణం తగ్గుదల
ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2018–19) ద్రవ్య లోటును 3.4 శాతానికి సవరించినట్టు గోయల్ పేర్కొన్నారు. 2011–12లో 5.8 శాతం, 2012–13లో 4.9 శాతం నుంచి సవరించారు. 2000–2014 మధ్య కాలంలో సగటు ద్రవ్యోల్బణం 10.1 శాతం నుంచి 4.6 శాతానికి దిగివచ్చింది. 2018 డిసెంబర్‌లో ద్రవ్యోల్బణం 2.19 శాతంగా మాత్రమే ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో జిడిపిలో కరెంట్ ఖాతా లోటు(క్యాడ్) 2.5 శాతం మాత్రమే ఉండగా, ఆరు సంవత్సరాల క్రితం అత్యధికంగా 5.6 శాతంగా ఉంది. పటిష్టమైన విధానాలతో గత ఐదేళ్లలో దాదాపు 239 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డిఐ) వచ్చాయని అన్నారు. జిఎస్‌టి సత్ఫలితాలను ఇస్తోందని ఆయన పేర్కొన్నారు.

బ్యాంకు రుణాల రికవరీ
బ్యాంకింగ్‌లో సంస్కరణలు సత్ఫలితాలను ఇచ్చాయి. దివాలా చట్టం వంటి విధానాలతో బ్యాంకులు, రుణదాతలు దాదాపు రూ.3 లక్షల కోట్ల మేరకు రికవరీ చేశారు. 2014లో మొండి బకాయిలు రూ.5.4 లక్షల కోట్లుగా ఉన్నాయి. 2015 నుంచి ఆస్తుల నాణ్యత సమీక్షలు, తనిఖీలు నిర్వహించామని అన్నారు. బ్యాంకుల రీక్యాపిటలైజేషన్, సంస్కరణలు వెరసి ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ వ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడిందన్నారు.

టిడిఎస్ అంటే?

న్యూఢిల్లీ : పన్ను ఎగవేతల్ని తగ్గించేందుకు ఆదాయపు పన్ను శాఖ తీసుకున్న విధానమే ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్(టిడిఎస్). టిడిఎస్ అంటే ఉద్యోగులకు ఆయా సంస్థల దగ్గరే పన్ను కట్ అవుతుంది. ఆ పన్ను ఆదాయపు శాఖకు వెళ్తుంది. ఐటీ రిటర్న్స్ ఫైల్ చేసిన తర్వాత మీకు రావాల్సిన రీఫండ్ ఏమైనా ఉంటే ఆదాయం పన్ను శాఖ వెనక్కి ఇస్తుంది. బ్యాంకుల్లో లేదా పోస్ట్ ఆఫీసుల్లో డిపాజిట్లు చేసినప్పుడు ఆయా సంస్థలు వడ్డీ చెల్లిస్తాయి. అయితే ఆ వడ్డీ కూడా పన్ను పరిధిలోకి వస్తుంది. డిపాజిట్లపై మీకు వచ్చే వడ్డీ రూ.10,000 ఉంటే ఎలాంటి పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదు. రూ.10,000 దాటితే బ్యాంకు లేదా పోస్ట్ ఆఫీస్ 10 శాతం టిడిఎస్‌ను ఆదాయపు పన్ను శాఖకు జమచేస్తుంది. ఇప్పటివరకు రూ.10 వేలకు ఉన్న పరిమితిని ప్రభుత్వం ఇప్పుడు రూ.40 వేలకు పెంచింది. టిడిఎస్ మినహాయింపు పొందేందుకు సంబంధిత పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. ఫామ్ 15 జి, ఫామ్ 15 హెచ్ లాంటి ఫామ్స్‌లో పూర్తి వివరాలు వెల్లడించి టిడిఎస్ మినహాయింపు పొందొచ్చు. కేంద్ర ప్రభుత్వం తాజా నిర్ణయంతో పన్ను చెల్లింపుదారులకు అదనంగా రూ.30,000 లాభం చేకూరుతోంది.

బడ్జెట్ జోష్ అంతంతే..

● 212 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్ ● రాణించిన ఆటో, ఎఫ్‌ఎంసిజి, ఫార్మా షేర్లు

ముంబై : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వరాల జల్లు కురిపించినా స్టాక్‌మార్కెట్లు మాత్రం ఇందుకు భిన్నంగా స్పందించాయి. బడ్జెట్ సమయంలో సూచీలు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనయ్యాయి. ఆఖరి డబుల్ సెంచరీతో ముగించాయి. ఆటో, ఎఫ్‌ఎంసిజి, ఐటి, ఫార్మా, రియల్టీ రంగ షేర్లలో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దీంతో సెన్సెక్స్ 212 పాయింట్ల లాభంతో 36,469 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 63 పాయింట్లు పెరిగి 10,893 వద్ద స్థిరపడింది. మరోవైపు బ్యాంకింగ్, మెటల్, మీడియా రంగ షేర్లు నష్టాలతో ముగిశాయి. ఎన్‌ఎస్‌ఇలో కీలకమైన బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్ 209 పాయింట్ల క్షీణించి 27,086 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ సూచీ 36,221 నుంచి 36,778 పాయింట్ల మధ్య స్థాయిలో కదలాడింది. లోక్‌సభలో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో దేశీయ మార్కెట్ ఉత్సాహంగా ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఆ తర్వాత లాభాలు తగ్గాయి. బిజెపి ప్రభుత్వానికి ఈ బడ్జెట్ చివరిది కావడంతో సంక్షేమ పథకాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. ముఖ్యంగా వేతన జీవులకు భారీ ఊరట కలిగిస్తూ ఇప్పటివరకు ఇస్తున్న పన్ను మినహాయింపు రెట్టింపు చేసింది. ఆదాయపు పన్ను పరిమితి రూ.5లక్షల వరకు పెంచడంతో పాటు అదనంగా మరో రూ.1.5 లక్షల వరకూ పన్ను మినహాయింపులను ఇచ్చారు. దీంతో వ్యవస్థలో వినియోగ వ్యయాలు పెరుగుతాయనే అంచనాలతో ఆటో, ఎఫ్‌ఎంసిజి రంగ షేర్ల జోరుగా ర్యాలీ చేశాయి. బడ్జెట్‌లో రైతులకు సాయం కింద రూ.75 వేల కోట్ల బడ్జెట్ కేటాయింపుతో రానున్న రోజుల్లో వ్యవసాయ రంగ పరికరాలు, ట్రాక్టర్లు, వ్యక్తిగత వాహన



అమ్మకాలు పెరగవచ్చనే అంచనాలతో ఆయా కంపెనీల షేర్లు దూసుకెళ్లాయి. ద్రవ్య లోటు పెరగడంతో రూపాయి పతనం ఐటి షేర్ల ర్యాలీకి కలిసొచ్చింది. ఐసిఐసిఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఇండియా, యస్ బ్యాంక్ షేర్ల పతనం బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు నెలకొన్నాయి. ఈ క్యూ3 ఫలితాల్లో నిరాశజనకమైన ఫలితాలను నమోదు చేయడంతో వేదాంత 18శాతం క్షీణించడటం మెటల్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి.

అంచనాలను మించింది..

● క్యూ3లో ఎస్‌బిఐ లాభం రూ.3,955 కోట్లు
● మెరుగుపడిన ఆస్తుల నాణ్యత



న్యూఢిల్లీ : ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) మూడో త్రైమాసిక ఫలితాల్లో(క్యూ3) రాణించింది. బ్యాంక్ నికర లాభం రూ.3,955 కోట్లు నమోదు చేసింది. గతేడాది ఇదే సమయంలో సంస్థ రూ.2,416 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. గతేడాదితో పోలిస్తే లాభంలో 318.5 శాతం వృద్ధిని సాధించింది. ఎస్‌బిఐ రుణాల నాణ్యత మెరుగుపడింది. విశ్లేషకుల అంచనాలను మించి ఎస్‌బిఐ ఫలితాలున్నాయి. సమీక్షా కాలంలో నికర వడ్డీ ఆదాయం 21.4 శాతం పెరిగి రూ. 22,691 కోట్లకు చేరింది. రుణ వృద్ధి 12.1 శాతం పెరుగుదల నమోదు చేసింది. నికర వడ్డీ మార్జిన్లు 2.97 శాతానికి పెరిగాయి. క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో బ్యాంకు ఆస్తుల నాణ్యత మెరుగైంది. గత త్రైమాసికంతో పోలిస్తే స్థూల ఎన్‌పిఎలు 9.95 శాతం నుంచి 8.71 శాతానికి(రూ.1.877 లక్షల కోట్లకు) తగ్గాయి. ఇక నికర ఎన్‌పిఎలు 4.84 శాతం నుంచి 3.95 శాతానికి(రూ.80,943 కోట్లకు) దిగవచ్చాయి. రికవరీలు, అప్‌గ్రేడ్‌లు రూ. 4327 కోట్ల నుంచి రూ. 6617 కోట్లకు పెరిగాయి. బడా ఇన్‌ఫ్రా గ్రూప్‌లకు ఇచ్చిన రుణాలు స్థిరంగా ఉన్నట్లు బ్యాంకు తెలిపింది. సమీక్షాకాలంలో ప్రొవిజన్లు రూ. 6,006 కోట్లకు పడిపోయాయి. అయితే క్యూ2తో పోలిస్తే ఎన్‌పిఎలకు ప్రొవిజన్లు మాత్రం దాదాపు రూ.4వేల కోట్లు పెరిగి రూ. 13,971 కోట్లకు చేరాయి. ప్రొవిజన్ కవరేజ్ నిష్పత్తి 74.63 శాతానికి చేరింది. ఫలితాల నేపథ్యంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఎస్‌బిఐ షేరు విలువ 3 శాతం నష్టపోయి రూ.284.30కు చేరింది.

పన్ను చెల్లింపుదారులు రెట్టింపు


న్యూఢిల్లీ : ప్రత్యక్ష పన్ను ఆదాయం 2013–14తో పోలిస్తే రెట్టింపు అయింది. రూ.6.38 లక్షల కోట్ల నుంచి రూ. 12లక్షల కోట్లకు పెరిగింది. పన్ను చెల్లింపుదారుల సంఖ్య కూడా 3.79 కోట్ల నుంచి 6.85 కోట్లకు చేరింది.

- ఆదాయ పన్ను చట్టం సెక్షన్ 54 కింద ఒక ఇంటికి సంబంధించి వర్తించే మూలధన పన్ను మినహాయింపుని ఇప్పుడు రెండు ఇళ్లకు పెంచారు. ఈ క్రమంలో ఆ మొత్తం రూ.2 కోట్లకు మించకూడదు. అయితే ఒక వ్యక్తికి ఈ మినహాయింపు జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే ఉంటుంది.
- రెండు చోట్ల ఇళ్లు ఉండి అద్దెలు చెల్లించే వారు మినహాయింపునకు క్లెయిమ్ చేసుకోవచ్చు. అలాగే ఉద్యోగులు చెల్లించిన అద్దెకు పన్ను మినహాయింపును రూ.2.4 లక్షలకు పెంచారు. మధ్యతరగతి, వేతన జీవులు గృహరుణాల చెల్లింపుల్లో రూ.2 లక్షల వరకు పన్ను మినహాయింపును ఇచ్చారు.
- ఆదాయపు పన్ను రీఫండ్లు వేగవంతం కానున్నాయి. వీటిని 24 గంటల్లో పరిష్కరించేలా ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేసింది. వచ్చే రెండేళ్లలో అన్ని పన్ను రిటర్నుల అంచనాలను కంప్యూటరీకరించనున్నట్టు ఆర్థిక మంత్రి గోయల్ చెప్పారు. పన్ను చెల్లింపుదారులకు, అధికారులకు ఎటువంటి సంబంధం లేకుండా చేస్తామన్నారు. ఇది వాస్తవ రూపంలోకి వస్తే అవినీతి మరింత తగ్గే అవకాశం ఉంది.



బడ్జెట్‌పై ఎవరేమన్నారు?

పేదలు... రైతుల అనుకూలం



మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ దేశానికి ఇచ్చిన విధాన మార్గదర్శకాలలో కీలకాంశాలను పీయూష్ తాత్కాలిక బడ్జెట్ సమర్పించింది. గత ఐదేళ్ళ పనితీరును ఆత్మావలోకనం చేసుకుని వాస్తవాలను ప్రజల ముందు ఉంచాము. ఈ బడ్జెట్ దేశం ముందు ఉన్న సవాళ్ళను సమగ్రంగా ఎదుర్కొనేందుకు మోడీ నేతృత్వంలోని ప్రభుత్వ ఎజెండాను మరింత ముందుకు తీసుకెళ్తుంది. బడ్జెట్ ఆర్థిక దార్శనికతకు ఆచరణాత్మకంగా కట్టుబడి ఉంటూనే వ్యయాన్ని పెంచడానికి దోహదపడుతుంది. నిస్సందేహంగా వృద్ధికి అనుకూలం, ఆర్థికంగా వివేకవంతమైనది, రైతులకు, పేదలకు అనుకూలమైనది, భారతీయ మధ్య తరగతి వర్గాల కొనుగోలు శక్తిని బలోపేతం చేస్తుంది.

– అరుణ్‌జైట్లీ, కేంద్రమంత్రి

అకౌంట్ ఫర్ ఓట్స్



ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఓట్ల కోసం చేసిన జిమ్మిక్కు. ఓటాన్ అకౌంట్ కాదు.. అకౌంట్ ఫర్ ఓట్స్. కాంగ్రెస్ డిక్లరేషన్‌ను కాపీ కొట్టారు. ఇప్పటికైనా మా బాటలో నడుస్తున్నందుకు అభినందిస్తున్నాం. మధ్యంతర బడ్జెట్‌ను ఎక్కువసేపు చదివిన మంత్రిగా పీయూష్ నిలిచిపోతారు. దాదాపు గంటా 40 నిమిషాలు ఆయన బడ్జెట్ ప్రసంగం చదివారు. పీయూష్ బడ్జెట్ ప్రసంగం ఎన్నికల ప్రచారాన్ని తలపించింది. బడ్జెట్‌లో సంతోషించదగ్గ అంశాలు లేవు. రైతులకు రోజుకు 17 రూపాయలు ఇస్తే సంతోషించాలా? విద్య, ఉపాధి గురించి ప్రస్తావించలేదు. పది పాయింట్ల దార్శనిక పత్రంలో ఈ రెండు అంశాలు లేవు

– చిదంబరం, మాజీ ఆర్థికమంత్రి


మా పథకాలు కాపీ



తాత్కాలిక బడ్జెట్‌కు ఏమాత్రం విలువ లేదు. త్వరలో ఈ ప్రభుత్వం దిగిపోతుంది. ఈ బడ్జెట్‌ను ఎవరు అమలు చేస్తారు. ఇలాంటి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే నైతిక హక్కు బిజెపి ప్రభుత్వానికి లేదు. గత నాలుగేళ్ళలో రైతుల కోసం కనీసం ఒక్క ఎజెండానైనా ఎందుకు ప్రకటించలేదు. జిఎస్‌టిని హడావిడిగా అమలు చేయడం, పెద్ద నోట్లను రద్దు చేయడం వల్ల దేశం ఆర్థిక అత్యవసర పరిస్థితిని ఎదుర్కొంటోంది. బడ్జెట్‌లో మా పథకాలనే కాపీ కొట్టారు. వాటికే మార్పులు చేసి కొత్తగా ప్రకటించారు.

– మమతా బెనర్జీ, ప.బెంగాల్ సిఎం

రైతులకు సుదీర్ఘ ప్రయోజనం



ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా రైతులకు సుదీర్ఘకాలం పాటు ప్రయోజనం చేకూరుతుంది. రైతుల ఆదాయం రెట్టింపు చేయడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తుంది. రుణాలు తీసుకోని రైతులకు కూడా ఇందువల్ల మేలు జరుగుతుంది. బ్యాంకు రుణాలు అనేవి ఒక్కసారి మాత్రమే రద్దవుతాయి, అదికూడా రుణాలు తీసుకున్న రైతులకు మాత్రమే ప్రయోజనం చేకూరుతుంది. రుణాలు తీసుకోని రైతులు కోట్లాది మంది ఉన్నారు. ఈ పథకం వల్ల రైతులకు ప్రతి ఏటా ఉపయోగం జరుగుతుంది.

– అమిత్ షా, బిజెపి జాతీయాధ్యక్షులు

సమగ్ర వికాసమే లక్ష్యం : పీయూష్ గోయల్



న్యూఢిల్లీ : సమగ్ర వికాసమే ప్రధానమంత్రి నరేంద్రమోడీ లక్ష్యమని కేంద్ర ఆర్థిక శాఖ తాత్కాలిక మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని వర్గాలకు ఏదో ఒక రకంగా మేలు కలగాలనేది తమ ప్రభుత్వ ఆశయమని స్పష్టం చేశారు. రైతులకు ఏటా రూ.6వేలు చొప్పున చెల్లించాలనే నిర్ణయం చరిత్రాత్మకమైనదిగా గోయల్ అభివర్ణించారు. సంవత్సరానికి రూ.6వేల ఆర్థిక సహాయం చిన్న రైతులకు గొప్ప ఊరటన్నారు. ఆర్థిక క్రమశిక్షణ పాటించి, నిధులు పొదుపు చేసి రైతులకు మేలు చేస్తున్నాం. రైతుల కోసం మేం తీసుకున్న నిర్ణయం ఎవరూ తీసుకోలేదు. 12.5 కోట్ల మంది రైతులకు ఈ పథకం ద్వారా మేలు కలుగుతుంది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 2018 డిసెంబరు నుంచే అమలు చేయాలని నిర్ణయించాం. అసంఘటిత రంగ కార్మికులకు మేలు చేసే పింఛన్ పథకం కూడా చాలా గొప్పది. పింఛన్ పథకం ద్వారా కోట్లాది మందికి ప్రయోజనం కలుగుతుందన్నారు. ఇప్పటికే ముద్ర రుణాల ద్వారా అసంఘటిత రంగ కార్మికులను ఆదుకున్నామని, నామమాత్రమైన రూ.100 ప్రీమియం చెల్లిస్తే రూ.3వేలు పింఛను ఇస్తామని అని పీయూష్ గోయల్ తెలిపారు.

కేవలం అలంకారప్రాయం



ఇది అలంకార ప్రాయమైన మాటల బడ్జెట్. ఇందులో వాస్తవాలను పేర్కొనలేదు. రైతులు, పేదలకు బదులు కొంతమంది పెట్టుబడిదారులకు ప్రయోజనం చేకూర్చడంతో గత అయిదేళ్లలో ఆర్థిక అసమానతలు పెరిగాయి. ఇది తప్పు. దేశ ప్రయోజనానికి వ్యతిరేకం. కేవలం మాటలగారడీ దేశాన్ని మార్చలేదు.పేదరికం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి దీర్ఘకాలిక సమస్యల్ని పరిష్కరించేదిగా ఇది లేదు. బడ్జెట్ ప్రజల సమస్యలకుపరిష్కారం చూపాలి. చేసిన వాగ్దానాలను నెరవేర్చే స్థిర సంకల్పం ఉండాలి. ఇంతవరకు కేంద్ర ప్రభుత్వాల బడ్జెట్లలో ఇది కనపడలేదు. ఎన్నికల ముందు బిజెపి ప్రభుత్వం తెచ్చిన ఈ బడ్జెట్ సామాన్యుడిని కలవరపరిచేదిగా ఉంది.

– మాయావతి, బిఎస్‌పి అధ్యక్షురాలు

బిజెపి ఎన్నికల మేనిఫెస్టో



కేంద్ర బడ్జెట్ బిజెపి ఎన్నికల మేనిఫెస్టో. ఇది ఎన్నికల ముందు ఓటర్లకు ప్రభుత్వం ఇచ్చిన లంచం అని చెప్పవచ్చు. ఈ ఏడాది మే వరకు మాత్రమే బిజెపికి పాలనాధికారం ఉంది కాబట్టి ఈ బడ్జెట్‌లో బిజెపి ఇచ్చిన హామీలు ఎన్నికల తాయిలాలే. అవి నెరవేరవు. తమ పాలనలో వారు ఏం సాధించారు, ఎన్ని వాగ్దానాల్ని నెరవేర్చారో బిజెపి చెప్పలేదు. వాళ్లు చేసే ప్రతిదానిలో రాజకీయం ఉంది. తన ఎన్నికల మేనిఫెస్టోని బిజెపి పార్లమెంటులో చదివింది. అంతే. కేవలం ఓట్లు రాబట్టేందుకే ఈ బడ్జెట్‌ను రూపొందించారు.

–మల్లికార్జున్‌ఖర్గే, లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు

రూ.17తో రైతులను అవమానించారు



డియర్ నరేంద్ర మోడీ. ఐదేళ్ల మీ అసమర్థత, అహంకారం రైతుల జీవితాలను నాశనం చేసింది. రైతులకు రోజుకు రూ.17 ఇవ్వడమంటే వారిని పూర్తిగా అవమానించడమే. ఇదే మీ చివరి మోసపూరిత బడ్జెట్ అనుకుంటున్నా

– రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయాధ్యక్షులు



కెసిఆర్ బాటలో కేంద్రం




మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న 'రైతుబంధు' పథకం ఎన్నికల వేళ ప్రధాని మోడికి బ్రహ్మాస్త్రంగా కనిపించింది. అనేక రాష్ట్రాలు ఇప్పటికే ఈ పథకాన్ని అమలుచేస్తుండగా ఇప్పుడు స్వయంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్నట్లు తాజా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో మంత్రి పియూష్ గోయల్ ప్రకటించారు. కెసిఆర్ రాజకీయ దూరదృష్టి యావత్తు దేశ అవసరంగా మారింది. రైతుబంధు స్ఫూర్తిగా కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ పేరుతో అమలుచేయడం పట్ల టిఆర్‌ఎస్ ఎంపిలు, ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ స్పందించారు. పథకాన్ని కాపీ కొట్టడం ఒక రకంగా సంతోషంగా ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో అమలు చేయడానికి బదులు మొక్కుబడిగా ప్రకటించడం ఆశించిన ఫలితాలు ఇవ్వవని, రైతులకు పెద్దగా మేలు చేయదని అన్నారు.

దేశానికే కెసిఆర్ మార్గదర్శకం అవసరం : అసదుద్దీన్



కెసిఆర్ చురుకుదనం, ముందుచూపు, ఆయనలోని అమోఘమైన జ్ఞానం ఈ దేశానికి, రైతాంగానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రస్తుతం రైతుబంధు వెలుగులో కిసాన్ సమ్మాన్ నిధి గురించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం అర్థం పడుతోందని మజ్లిస్ పార్టీ ఎంపి అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించారు. కిసాన్ సమ్మాన్‌పై ఒవైసీ ట్విట్టర్‌లో స్పందిస్తూ, వ్యవసాయ సమస్యలపై కెసిఆర్‌కు ఉన్న లోతైన అవగాహన మరే నేతకు లేదన్నది స్పష్టమవుతోందని పేర్కొన్నారు. తెలంగాణ చేపట్టిన పథకాలనే ప్రధాని అమలు చేస్తున్నారని, ప్రధాని మోడికి స్వంత ఆలోచనలు లేవని పేర్కొన్నారు. దేశాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు కెసిఆర్ లాంటి నేతలు అవసరమన్నారు.



కెసిఆర్ మానసపుత్రిక రైతుబంధు దేశానికి ఆదర్శమైంది : కెటిఆర్



సిఎం కెసిఆర్ మానసపుత్రిక అయిన 'రైతుబంధు' పథకం ఇప్పుడు మొత్తం దేశానికి మార్గదర్శకమైందని టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వ్యాఖ్యానించారు. రైతుబంధు పథకానికి పేరుమార్చి 'కిసాన్ సమ్మాన్ నిధి' పేరుతో కేంద్రం 5 ఎకరాల భూమి ఉన్న రైతులకు ఏడాదికి 6 వేల రూపాయల చొప్పున అందించనున్నట్లు ప్రకటించిందన్నారు. ప్రపంచదృష్టిని ఆకర్షించిన రైతుబంధు పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం గత ఖరీఫ్ సీజన్‌లో ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు గుర్తుచేశారు. అయితే కేంద్రం రైతుబంధు పథకాన్ని కాపీకొట్టినా ఆపథకం స్ఫూర్తినిగానీ,లక్ష్యాలనుగానీ, ఆర్థిక సహాయం అందించే అంశాన్ని కానీ పూర్తిస్థాయిలో ప్రకటించలేకపోయిందన్నారు. 'కెసిఆర్ ప్రవేశపెట్టిన పథకం దేశానికి ఆదర్శం కావడం ఆనందంగా ఉంది, జై కిసాన్'' అంటూ కెటిఆర్ ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు.

రైతుబంధును కాపీ కొట్టిన కేంద్రం : ఎంపి కవిత



తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆలోచనల్లోంచి పుట్టుకొచ్చి ఏడాదిగా అమలవుతున్న రైతుబంధు పథకాన్ని కేంద్ర ప్రభుత్వం కాపీ కొట్టిందని టిఆర్‌ఎస్ ఎంపి కవిత వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌పై ఆమె తన ట్విట్టర్ ద్వారా స్పందిస్తూ, కెసిఆర్ రైతుబంధు పథకాన్ని కేంద్రం కాపీ కొట్టినా అది సరిగా లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులందరికీ పెట్టుబడి సాయంగా ప్రతీ ఎకరానికి ఒక్కో సీజన్‌కు ఐదు వేల రూపాయల చొప్పున ఏటా పది వేల రూపాయలు ఇస్తోందని, కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం 2 హెక్టార్లలోపు (ఐదు ఎకరాలు) ఉన్న ప్రతీ రైతుకు ఏడాదికి రూ. 6 వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించిందని పేర్కొన్నారు. తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు పథకాన్ని మరింత రిఫైన్ చేసి కేంద్రం ప్రకటించి ఉంటే బాగుండేదన్నారు. తెలంగాణ పథకాన్ని కాపీ కొట్టడం తమకు సంతోషంగా ఉందని, కొన్ని రాష్ట్రాలకు స్ఫూర్తిగా ఉన్నట్లే ఇప్పుడు మొత్తం దేశానికి వర్తించేలా కేంద్ర ప్రభుత్వం స్వీకరించడం సంతోషమేనని అన్నారు. నిజంగా కేంద్రానికి ప్రజల సంక్షేమం పట్ల, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలుచేయడం పట్ల చిత్తశుద్ధి ఉన్నట్లయితే 33 శాతం మహిళా రిజర్వేషన్ అంశాన్ని బడ్జెట్ ప్రసంగంలో ఎందుకు వెల్లడించలేదని కవిత ప్రశ్నించారు. కచ్చితంగా ఇది ఎలక్షన్ బడ్జెట్టేనని వ్యాఖ్యానించారు.

ఇది ఓట్ల కోసం పెట్టిన బడ్జెట్ : ఎంపి వినోద్‌కుమార్



కేంద్రం ప్రవేశపెట్టింది పేరుకు ఓటాన్ అకౌంట్ (మధ్యంతర) బడ్జెట్ అయినా అందులో ప్రకటించిన వరాలను చూస్తుంటే ఓట్ల కోసం ప్రవేశపెట్టినట్లుగానే ఉందని టిఆర్‌ఎస్ ఎంపి వినోద్ వ్యాఖ్యానించారు. ఐదు సంవత్సరాల కోసం 2014లో ఎన్నికైన ప్రభుత్వం ఈ ఐదేళ్ళ పాటు సాధారణ బడ్జెట్‌లను ప్రవేశపెట్టిందని, కానీ ఇంతకాలం ఈ దిశగా ఆలోచించని మోడీ ప్రభుత్వం ఇప్పుడు మూడు మాసాల కోసం పెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కిసాన్ సమ్మాన్ పేరుతో రైతుబంధు తరహా పథకాన్ని ప్రవేశపెట్టడం ఓట్ల కోసమేనని అన్నారు. కేంద్ర మంత్రి పియూష్ గోయల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం వినోద్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ, ఇది ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లా కాకుండా సాధారణ బడ్జెట్‌లా ఉందన్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు ఉన్న పరిధిని, పరిమితిని అతిక్రమించి పియూష్ గోయల్ వరాలతో కూడిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని అన్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రసంగం మొత్తం ఎన్నికల ప్రసంగంలా ఉందన్నారు. సం క్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే దిక్సూచిగా మారిందని, రైతుబంధును కాపీ కొట్టినందుకు సంతోషంగా ఉన్నప్పటికీ స్పష్టత కొరవడిందన్నారు. నిజంగా కేంద్రం ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, వారు సంతోషిస్తారన్నారు. ఇప్పుడు మోడి ప్రకటించిన పథకం తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు కంటే గొప్పగా ఏమీ లేదన్నారు. కిసాన్ సమ్మాన్ పథకంలో స్పష్టత కొరవడినందున దీని అమలు, విధివిధానాలను ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. మరో నెల రోజుల్లో ఎన్నికల షెడ్యూలు వస్తున్న సమయంలో ఈ పథకాన్ని ప్రవేశపెట్టినందున అమలు కష్టసాధ్యమేనని, అమలు కోసం కసరత్తు మొదలుపెట్టే సమయానికి ఎన్నికల కోడ్ వచ్చేస్తుందన్నారు. ఇంత స్వల్ప వ్యవధిలో ఈ పథకాన్ని అమలు చేయడం సాధ్యం కాదని వినోద్ అభిప్రాయపడ్డారు.

'కిసాన్ సమ్మాన్' కంటే 'రైతుబంధు' మేలు : చెన్నమనేని రమేశ్



ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రైతులను మచ్చిక చేసుకోడానికి, ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగానే 'కిసాన్ సమ్మాన్' పేరుతో ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది తప్ప తెలంగాణ ప్రభుత్వం ప్రజల అవసరాల్లోంచి తీసుకొచ్చి అమలు చేస్తున్న 'రైతుబంధు' తరహాలో లేదని శాసనసభ్యుడు చెన్నమనేని రమేశ్ వ్యాఖ్యానించారు. ఎన్నికలకు వెళ్తున్న నెల రోజుల వ్యవధిలో ఇప్పటికిప్పుడు ఈ పథకాన్ని ప్రకటించి ఓట్లు రాల్చుకోవాలని కేంద్రం భావిస్తోందని అన్నారు.



బడ్జెట్ పత్రాలను జాగిలాలతో తనిఖీ చేయిస్తున్న దృశ్యం

కేంద్రం రాష్ట్రాల అవసరాలను విస్మరించింది: రావుల



మన తెలంగాణ/హైదరాబాద్: కేంద్రప్రభుత్వం మూడు నెలల కోసం ప్రవేశ పెట్టిన తాత్కాలిక బడ్జెట్ రాష్ట్రాల అవసరాలను విస్మరించిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఎన్నికల తాయిలాల కోసమే బడ్జెట్ ప్రవేశ పెట్టినట్లుగా ఉందన్నారు. ఎన్‌టిఆర్ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నాలుగున్నరేళ్లలో కేంద్ర ప్రభుత్వం ప్రజలను ఇబ్బంది పెట్టడమే పనిగా పెట్టుకుందన్నారు. నోట్ల రద్దు వల్ల ఎంత నష్టం జరిగిందో ఇప్పటికీ కనీసం అంచనా వేసే పని కూడా చేయలేదన్నారు. జిఎస్‌టిని శ్లాబులుగా విడదీశారు కానీ పెట్రోల్,డీజిల్, ఎరువుల ధరలు తగ్గుదలపై చర్యలు తీసుకోలేదన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన కింద ఐదెకరాలలోపు ఉన్న హెక్టార్లలోపు భూమి ఉన్న రైతులకు ఎకరాకు యేడాదికి రూ.6 వేలు ఇస్తామంటున్నారని అసలు రైతులకు సంబంధించిన గణాంకాలు కేంద్రం దగ్గర ఉన్నాయా? అని ప్రశ్నించారు. మూడు విడతలుగా రైతు ఖాతాలోకి నేరుగా కేంద్ర ప్రభుత్వం డబ్బులు జమ చేయడం అనేది ఫెడరల్‌కు విరుద్ధమన్నారు. వ్యవసాయానికి నీళ్లు ముఖ్యమైనవని బడ్జెట్‌లో దీనిపై ప్రస్తావనే లేదన్నారు. నదుల అనుసంధానం, పెట్రోల్, డీజిల్, మద్దతు ధరలపై బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదన్నారు.

తెలంగాణ రైల్వేకు స్వల్ప వరాలు

- కొత్తపల్లి, మనోహరాబాద్ లైన్‌కు రూ. 200 కోట్లు
- కాజీపేట, విజయవాడ లైన్‌కు రూ. 110 కోట్లు
- అక్కన్నపేట, మెదక్ లైన్‌కు రూ. 10 కోట్లు
- కాజీపేట వర్క్‌షాపునకు రూ. 10 కోట్లు
- దక్షిణ మధ్య రైల్వేకు రూ.5,924 కోట్లు కేటాయింపు
- గత ఏడాదితో పోలిస్తే రూ.175 కోట్లు పెరుగుదల



మన తెలంగాణ / హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం శుక్రవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో దక్షిణ మధ్య రైల్వేకు పెద్దగా ప్రయోజనం చేకూరలేదు. గత ఏడాదితో పోలిస్తే స్వల్ప పెరుగుదల మినహా కొత్తగా ఎలాంటి ప్రాజెక్టులకు అమోదం లభించలేదు. గత ఆర్థిక సంవత్సరం కేంద్ర వార్షిక బడ్జెట్‌లో దక్షిణ మధ్య రైల్వేకు రూ.5,752 కోట్ల కేటాయింపు ఉంటే ఈసారి రూ.5,924 కోట్లకు పెరిగింది. కేవలం రూ.172 కోట్లు ఎక్కువ వచ్చింది. ప్రస్తుతం కొనసాగుతున్న (ఆన్‌గోయిం గ్) ప్రాజెక్టులతో పాటు గతంలోని ప్రాజెక్టుల పునరుద్ధరణకే కేంద్రం ఈ బట్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చింది. కొత్త పథకాలు, సర్వేలు, లైన్ల ఊసు బడ్జెట్‌లో కనిపించలేదు. గతంలో మంజూరైన లైన్ల నిర్మాణం కోసం రూ. 834 కోట్లు, డబ్లింగ్ పనుల కోసం రూ. 1,905 కోట్లు, ట్రాఫిక్ సౌకర్యాల మెరుగుదల కోసం రూ.138 కోట్లు, ప్రయాణికులకు మరింత మెరుగైన సేవల కోసం రూ.229 కోట్లను కేంద్రం ఈ బడ్జెట్‌లో కేటాయించింది. కొత్తగా ఎలాంటి ప్రతిపాదనలు ప్రకటించలేదు. బడ్జెట్‌లోని ముఖ్యాంశాలను ద.మ.రైల్వే అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్ మీడియాకు వివరిస్తూ, ఈ జోన్ పరిధిలో మొత్తం 541 ఆర్‌ఓబిలు, ఆర్‌యుబిల నిర్మాణా లకు నిధులను కేటాయించిందని తెలిపారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 24 బ్రిడ్జిలను నిర్మించనున్నట్లు తెలిపారు. బ్రిడ్జిల నిర్మాణంలో రహదారుల భద్రత కోసం రూ.397 కోట్లు, బ్రిడ్జిల నిర్మాణం కోసం రూ.52 కోట్లు, భద్రతతో కూడిన లెవల్ క్రాసింగ్‌లకు కోసం రూ.72.5 కోట్లు, ట్రాక్ పునరుద్ధరణకు రూ.657 కోట్లు, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్‌కు రూ.23.4 కోట్లు, ట్రైనింగ్ 16.4 కోట్లను కేటాయించినట్లు వివరించారు. మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి మధ్య కొత్త లైన్ నిర్మాణానికి రూ. 200 కోట్లు, భద్రాచలం టు సత్తుపల్లి కొత్త రైలు మార్గం నిర్మాణానికి రూ.405 కోట్లు, మునీరాబాద్ టు మహబూబ్‌నగర్ కొత్త ప్రాజెక్టు నిర్మాణానికి రూ.275 కోట్లు, కాజీపేట టు బలర్షా మూడవ లైన్ కోసం రూ.265 కోట్లు, నిర్మాణంలో ఉన్న అక్కన్నపేట, మెదక్ కొత్త రైలు మార్గం కోసం రూ.10 కోట్లు, కొనసాగుతున్న ఎంఎంటిఎస్ ఫేజ్ 2 కోసం రూ.10 లక్షలు, సికింద్రాబాద్ టు మహబూబ్‌నగర్ డబ్లింగ్ పనుల కోసం రూ. 200 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. కాజీపేట టు విజయవాడ మూ డవ లైన్ నిర్మాణానికి రూ.110 కోట్లు, ఎంఎంటిఎస్ ఫేజ్ టు పొడగింపు ప్రాజెక్టు కింద ఘట్కేసర్ నుంచి యాదాద్రి వరకు నిర్మించేందుకు రూ.20 కోట్లు, చెర్లపల్లి టర్మినల్ కోసం రూ. 5 కోట్లతో పాటు కాజీపేట వర్క్‌షాపు కోసం రూ.10 కోట్లు, మౌలాలిలోని రైల్వే ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ కోసం 1.5 కోట్లను కేటాయించినట్లు ఆయన వివరించారు. ఈ అంశాలు బడ్జెట్‌లోని ముఖ్యాంశాలు మాత్రమేనన్నారు. మరింత సమగ్రమైన సమాచారం బడ్జెట్ కేటాయింపులు పూర్తిస్థాయిలో ముగిసిన తర్వాత వెల్లడవుతాయని తెలిపారు. త్వరలోనే బడ్జెట్ లో దక్షిణ మధ్య రైల్వేకు కేటాయించిన సమగ్ర వివరాలు వెల్లడి చేస్తామని తెలిపారు. సమావేశంలో జోన్ పరిధిలోని వివిధ విభాగాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్రీడలపై కనికరం



న్యూఢిల్లీ : ఈసారి బడ్జెట్‌లో క్రీడలపై కేంద్ర ప్రభుత్వం కాస్త కనికరం చూపింది. కిందటి సారితో పోల్చితే ఈసారి క్రీడలకు పెద్ద పీట వేశారనే చెప్పాలి. శుక్రవారం ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో క్రీడలకు రూ.214.20 కోట్లను అదనంగా కేటాయించింది. అంతేగాక క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలను కూడా పెంచింది. కేంద్ర బడ్జెట్‌లో 2019–20 సంవత్సరానికిగాను క్రీడలకు రూ.2216.92 కోట్లను కేటాయించారు. గత ఏడాది ఇది రూ.2002.72 కోట్లుగా ఉంది. దీంతో గతంతో పోల్చితే ఈసారి క్రీడలకు కాస్త కనికరం దక్కిందనే చెప్పాలి. కాగా, కేంద్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాయ్)కు ఈసారి బడ్జెట్‌లో రూ.55 కోట్లు కేటాయించారు. దీంతో ఈ పద్దు రూ.395 కోట్ల నుంచి ఏకంగా రూ.450 కోట్లకు పెరిగింది. అంతేగాక జాతీయ క్రీడాభివృద్ధి నిధికి కేటాయింపులను భారీగా పెంచారు. గతంలో ఈ నిధికి కేవలం రెండు కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించగా ఈసారి దాన్ని రూ.70 కోట్లకు పెంచారు. మరోవైపు క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సహకాల నిధులను రూ.63 కోట్ల నుంచి రూ.89 కోట్లకు పెంచారు. ఇక, జాతీయ క్రీడా సమాఖ్య కేటాయింపుల్లో పెద్దగా పెరుగుదల కనిపంచలేదు. క్రీడాకారులకు పురస్కారాలు ఇచ్చేందుకు అదనంగా రూ.94.07 కోట్లను కేటాయించారు. ఈ పద్దు రూ.316.93 కోట్ల నుంచి రూ.411 కోట్లకు చేరింది. మరోవైపు ఖేలో ఇండియా పద్దు సయితం రూ.50 కోట్లు పెరిగింది. ప్రస్తుతం ఖేలో ఇండియా కేటాయింపులు రూ.601 కోట్లకు చేరాయి.



ఓడినా సిరీస్ భారత్‌దే

కివీస్‌కు ఓదార్పు విజయం

హామిల్టన్ : న్యూజిలాండ్ మహిళలతో జరిగిన వన్డే సిరీస్‌ను భారత్ 2–1తో కైవసం చేసుకుంది. శుక్రవారం ఇక్కడ జరిగిన చివరి, మూడో వన్డేలో ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు 8 వికెట్ల తేడాతో భారత మహిళా జట్టును చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో ఓడినా భారత్ సిరీస్ దక్కించుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 44 ఓవర్లలో 149 పరుగులకే కుప్పకూలింది. కివీస్ బౌలర్లు అద్భుత బౌలింగ్‌తో భారత్ ఇన్నింగ్స్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. కెరీర్‌లో 200వ వన్డే ఆడిన కెప్టెన్ మిథాలీ రాజ్ 9 పరుగులు మాత్రమే చేసి ఔటైంది. ఇక, తొలి రెండు మ్యాచుల్లో చెలరేగిన ఓపెనర్ స్మృతి మందన కూడా నిరాశ పరిచింది. మదన ఒక పరుగు మాత్రమే చేసింది. ఒంటరి పోరాటం చేసిన దీప్తి శర్మ 4 ఫోర్లతో 52 పరుగులు చేసింది. హర్మన్‌ప్రీత్ కౌర్ (24) తప్ప మిగతావారు విఫలమయ్యారు. ప్రత్యర్థి బౌలర్లలో పీటర్సన్ నాలుగు, లియా మూడు వికెట్లు తీశారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 29.2 ఓవర్లలోనే కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్ సుజి బేట్స్ 57, కెప్టెన్ సాటర్‌వైట్ 66(నాటౌట్) జట్టును గెలిపించారు.



భారత్‌కు చుక్కెదురు

ఇటలీతో డేవిస్ పోరు

కోల్‌కతా: ఇక్కడ ఇటలీతో జరుగుతున్న డేవిస్ కప్ గ్రూప్ క్వాలిఫయర్స్ పోటీల్లో భారత్‌కు చుక్కెదురైంది. శుక్రవారం జరిగిన తొలి సింగిల్స్‌లో భారత ఆటగాళ్లు రామ్‌కుమార్ రామనాథన్, ప్రజ్నేశ్ గునేశ్వరన్‌లు ఓటమి పాలయ్యారు. దీంతో ఇటలీ కీలకమైన 2–0 ఆధిక్యాన్ని అందుకుంది. శనివారం జరిగే డబుల్స్ పోటీలో గెలిస్తేనే భారత్ అవకాశాలు సజీవంగా ఉంటాయి. రోహన్ బోపన్న–దివిజ్ శరణ్‌లు డబుల్స్‌లో జంటగా బరిలోకి దిగుతున్నారు. వీరు తమ పోటీలో విజయం సాధిస్తేనే మ్యాచ్‌లో భారత్ పోటీలో నిలుస్తోంది. ఇందులో ఓడితే మాత్రం రివర్స్ సింగిల్స్‌తో ఫలితం లేకుండానే ఇటలీ ముందుకు వెళుతోంది. తొలి సింగిల్స్‌లో రామనాథన్‌ను సీనియర్ ఆటగాడు ఆండ్రియాన్ సిప్పి ఓడించాడు. ఏకపక్షంగా సాగిన పోరులో సిప్పి పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. తొలి సెట్‌లో రామనాథన్ కాస్త పోటీ ఇచ్చినా చివరి వరకు దాన్ని నిలబెట్టుకోవడంలో విఫలమయ్యాడు. చివరి వరకు దూకుడును కనబరిచిన సిప్పి 6–4, 6–2తో రామనాథన్‌ను ఓడించాడు. రెండో సింగిల్స్‌లో మటెరో బెరెటిని 6–4, 6–2తో భారత అగ్రశ్రేణి ఆటగాడు ప్రజ్నేశ్‌ను ఓడించాడు. ప్రారంభం నుంచే చెలరేగి ఆడిన బెరెటిని ఏ దశలోనూ ప్రజ్నేశ్‌కు కోలుకునే అవకాశం ఇవ్వలేదు. పూర్తి ఆధిపత్యం చెలాయించిన బెర్రిటెని సునాయాస విజయం అందుకున్నాడు. ఈ గెలుపుతో ఇటలీ కీలకమైన 2–0 ఆధిక్యాన్ని అందుకుంది.

టీమిండియాకే ఛాన్స్

ముంబయి: ఇంగ్లండ్ వేదికగా జరుగనున్న వన్డే ప్రపంచకప్‌లో టీమిండియాకే ట్రోఫీ అవకాశాలు అధికంగా ఉన్నాయని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) సిఈవో డేవిడ్ రిచర్డ్‌సన్ జోస్యం చెప్పారు. ప్రపంచకప్ ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు భారత్ వచ్చిన రిచర్డ్‌సన్ మీడియాతో మాట్లాడారు. ఇటీవల కాలంలో ప్రపంచ క్రికెట్‌లో భారత్ బలమైన జట్టుగా ఎదిగిందన్నారు. వన్డేల్లో, టి–20లలో భారత్ ఓడించడం పెద్దపెద్ద జట్లకే కష్టంగా మారిందన్నారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో చాలా బలంగా ఉన్న టీమిండియాకే ప్రపంచకప్ గెలుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయన్నారు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ఆటగాళ్లకు భారత జట్టులో కొదవలేదన్నారు. ధావన్, రోహిత్, కోహ్లి, ధోని తదితరులతో భారత్ చాలా పటిష్టంగా ఉందన్నారు. అంతేగాక షమీ, భువనేశ్వర్, చాహల్, బుమ్రా, కుల్దీప్‌లతో బౌలింగ్ కూడా చాలా బలంగా తయారైందన్నారు.
ఇలాంటి పరిస్థితుల్లో కప్పును గెలుచు కోవడం భారత్‌కు కష్టం కాదని రిచర్డ్‌సన్ అభిప్రాయపడ్డారు. ఇక, ఆతిథ్య ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్లను కూడా తక్కువ అంచన వేయలేమన్నారు. అయితే పరిస్థితులు గమనిస్తే మాత్రం ఈసారి భారత్ కప్పును ఎగురేసుకు పోవడం ఖాయమని రిచర్డ్‌సన్ పేర్కొన్నారు.

సంక్షోభంలో లంక క్రికెట్



కొలంబో: ఒకప్పుడూ ప్రపంచ క్రికెట్‌లో ఎదురులేని శక్తిగా కొనసాగిన శ్రీలంక జట్టు ప్రస్తుతం దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఒకవైపు వరుస ఓటములతో జట్టు పరిస్థితి రోజు రోజుకు తీసికట్టుగా మారుతుండగా, క్రికెట్ బోర్డులో నెలకొన్న గొడవలు సమస్యను మరింత జఠిలంగా మార్చాయి. ఇటువంటి స్థితిలో శ్రీలంక క్రికెట్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. బోర్డు సభ్యులపై అవినీతి ఆరోపణలు రోజురోజుకు పెరుగుతున్నాయి. బోర్డులోనే గొడవలు నెలకొనడంతో జట్టును పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రపంచకప్ తరుముకొస్తున్న తరుణంలో బోర్డులో తలెత్తిన సంక్షోభం లంక జట్టును వెంటాడుతోంది. ఇప్పటికే వరుస ఓటములతో లంక దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. దశాబ్దం క్రితం వరకు ప్రపంచ క్రికెట్‌లోని బలమైన జట్లలో లంక ఒకటిగా ఉండేది. అయితే రాను రాను పరిస్థితి పూర్తిగా తారుమారు అయ్యింది. లంక చివరికి అఫ్గానిస్థాన్ వంటి చిన్న జట్టును సయితం ఓడించ లేక చేతులెత్తేస్తోంది. బోర్డు సభ్యుల మధ్య తలెత్తిన వివాదం లంక క్రికెట్‌కు శాపంగా మారింది. ఒకవైపు వరుస ఓటములు, మరోవైపు జట్టులో ఆత్మస్థైర్యాన్ని నింపే ఆటగాళ్లు కొరవడడంతో జట్టు పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. పరిస్థితి ఇలాగే ఉంటే రానున్న రోజుల్లో జింబాబ్వే కంటే బలహీనంగా మారడం ఖాయం. ఉపఖండంలోని భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ జట్లతో పోల్చితే లంక క్రికెట్ జట్టు పరిస్థితి అధ్వాన్నంగా మారింది. జట్టుకు అండగా నిలువాల్సిన బోర్డు సభ్యులు, మాజీ క్రికెటర్లు ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదు. వీరంతా తమ సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తూ జట్టును పట్టించుకోవడం మానేశారు. దీంతో పరిస్థితి ఈ విధంగా తయారైంది. ఇప్పటికైనా బోర్డు అధికారులు దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే జట్టు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడం ఖాయమనే చెప్పాలి.

చిన్నారుల్లో చిరు'నవ్వే'లక్ష్యం

రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ ఐజిపి స్వాతి లక్ర



మన తెలంగాణ/హైదరాబాద్ : తప్పిపోయిన పిల్లలు, బాలకార్మికులు, చిన్నారుల అక్రమ రవాణ, రోడ్లపై భిక్షాటన చేసే చిన్నారులను చేరదీసి వారిలో చిరునవ్వు నింపడమే 'ఆపరేషన్ స్మైల్' లక్ష్యమని లా అండ్ ఆర్డర్, రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ స్వాతి లక్రా పేర్కొన్నారు. జనవరి నెలలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ విజయాలను శుక్రవారం ఆమె మీడియాకు వివరించారు. అభంశుభం తెలియని చిన్నారులను వారి తల్లితండ్రుల చెంతకు చేర్చే ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయం సాధించిందన్నారు. ఆపరేషన్ ముస్కాన్ మాదిరాగానే అపరేషన్ స్మైల్ నిర్వహించామని, ఈ కార్యక్రమంలో పోలీసులతో పాటు ఇతర శాఖలు సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 2119 పిల్లలను రక్షించడం జరిగిందని, వారిలో 1653 మైనర్ బాయ్స్ ఉన్నారన్నారు. అలాగే చిన్నపిల్లలు(బాలికలు)466 మంది ఉన్నారన్నారు.
ఇదిలావుండగా 1303 పిల్లలను వారి తల్లితండ్రులకు, సంరక్షకులకు అప్పగించామని, ఇందులో 1029 మగ పిల్లలు, 274మంది బాలికలు ఉన్నారన్నారు. అలాగే 816 మంది (బాలురు 624, బాలికలు 192)కి సంబంధించిన వారి తల్లితండ్రుల ట్రాక్ చేస్తున్నామని తెలిపారు. ఇతర రాష్ట్రాలలోని 763 మందిని గుర్తించామని, వారిలో 545 బాలురు, 218 బాలికలను కాపాడటం జరిగిందన్నారు. అదేవిధంగా నిర్భందంగా పనిచేస్తున్న 340 మంది చిన్నారులు, 535 వీధుల వెంట బిక్షాటన చేస్తున్న చిన్నారులను గుర్తించి కాపాడటం జరిగిందన్నారు. ఇటుక పరిశ్రమలలో పనిచేస్తున్న 119 చిన్నారులను రక్షించామని, అలాగే 51 మంది చిన్నారులు బిక్షాటన కంబంధ హస్తాల నుంచి రక్షించామన్నారు. చిన్నారులతో వెట్టి చారికి చేయిస్తున్న వారిపై 58 కేసులు నమోదు చేశామని, చిన్నారులతో బిక్షాటన, నిర్భంధంగా పనులు చేయించుకునేవారిపై ఐపిసి సెక్షన్ 370, 374, 26, 79 జువెనల్ చట్టం, 2015, ఎఎంపి ది బాండెడ్ లేబర్ చట్టాల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డివిజన్‌లలో ఈ కార్యక్రమం నిర్వహించామని సబ్ డివిజన్‌లో ఒక ఎస్ఐ, లుగురు కానిస్టేబుళ్ల బృందంతోపాటు సిడబ్ల్యూడి, కార్మికశాఖ, చైల్డ్‌వేల్ఫేర్ కమిటీలు, డిస్ట్రిక్ చైల్డ్ వెల్ఫేర్ ప్రొటక్షన్ యూనిట్స్, ఎన్‌జిఒలు కలిసి సంయుక్తంగా నిర్వహించామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆపరేషన్ స్మైల్ పై జనవరి 7 న శిక్షణా సమావేశం నిర్వహించామని, ఇందులో జెజె చట్టం, పోక్సో, దర్పన్, చైల్డ్ ట్రాక్ పోర్టల్, రైల్వేస్టేషన్స్, బస్‌స్టాండ్స్, మత పరమైన దేవాలయాలు, రహదారుల కూడళ్లలో బిక్షాటన చేసేవాళ్లను చేరదీసి వారిని వారి తల్లితండ్రులకు, సంరక్షకులకు అప్పగించే అంశాలపై చర్చించామన్నారు.

ఆస్ట్రేలియా భారీ స్కోరు

కాన్‌బెర్రా: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 354 పరుగుల భారీ స్కోరు సాధించింది. బర్న్స్ 172(బ్యాటింగ్), ట్రావిస్ హెడ్ (181) శతకాలతో కదం తొక్కారు. దీంతో మొదటి రోజే ఆస్ట్రేలియా భారీ స్కోరు చేసి పట్టు సాధించింది. సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో కూడా లంకకు ఇబ్బందులు తప్పేలా లేవు.

అంగన్‌వాడి కేంద్రాలకు చౌక దుకాణాల బియ్యం

మేడ్చల్‌లో ప్రక్రియను పరిశీలన



మన తెలంగాణ / హైదరాబాద్ : అంగన్‌వాడి కేంద్రాలకు రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం ప్రారంభమైంది. బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రాష్టంలోని 31 జిల్లాల్లో ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రారంభించారు. పలు ప్రాంతాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు సైతం పాల్గొన్నారు. బియ్యం పంపిణీలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచడం కోసం ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టిందని మహిళా, శిశు సంక్షేమశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. రాష్ట్రంలోని 35,700 కేంద్రాలకు సమీపంలోని చౌక డిపోల్లోని ఈ పాస్ యంత్రాల ద్వారా బియ్యం పంపిణీ చేపడుతున్నారు. ఇందుకోసం అంగన్‌వాడి కేంద్రాల్లో పనిచేస్తున్న 72 వేల మంది వర్కర్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్ల ఆధార్‌తో పాటు వేలిముద్రలను ఈ పాస్ మిషన్లకు నేషనల్ ఇన్‌ఫార్మాటిక్ సెంటర్ (ఎన్ఐసి) సహకారంతో అనుసంధానం చేసినట్లు చెప్పారు. కార్యక్రమం ప్రారంభోత్సవాన్ని దృష్టిలో ఉంచుకొని మేడ్చల్ జిల్లాలోని పలు రేషన్ దుకాణాల్లో బియ్యం సరఫరా ప్రక్రియతో పాటు నాణ్యతను మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.జగదీశ్వర్, డైరెక్టర్ విజయేందిర బోయి పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్‌సబర్వాల్ పరిశీలించారు. కొత్త విధానం ద్వారా ఏ రోజు, ఎంత మంది, ఎన్ని క్వింటాళ్ల బియ్యం తీసుకెళ్లారు, ఇంక ఎంత తీసుకెళ్లాల్సి ఉంది, ఓపెనింగ్, క్లోజింగ్, బ్యాలెన్స్ వంటి వివరాల ను ఎప్పటికప్పుడూ తెలుసుకునే వీలుందన్నారు. మొత్తం సరఫరా ప్రక్రియను పర్యవేస్తణకు కూడా సులువుగా ఉంటుందన్నారు. గతంలో పౌసరసరఫరాల సంస్థ గోదాముల నుంచి రవాణా కాంట్రాక్టర్ల ద్వారా అంగన్‌వాడి కేంద్రాలకు బియ్యం సరఫరా చేసే విధానముండేదన్నారు. కాంట్రాక్టర్ల ద్వారా సరఫరా చేయడం వల్ల పలు రకాల అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను దృష్టిలో పెట్టకొని ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టిందన్నారు. రేషన్ షాపుల ద్వారా వేలిముద్రలతో అక్రమాలను ఆరికట్టడంతో పాటు ప్రభుత్వానికి నిధులు కూడా ఆదా అవుతాయని తెలిపారు. ప్రతి ఏడాది 32 వేల మెట్రిక్ టన్నుల బియ్యన్ని అంగన్‌వాడి కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.





'శ్రీచైతన్య' విజ్ఞానయాత్ర

మన తెలంగాణ/హైదరాబాద్: చదువుతో పాటు విద్యార్థులకు వినోదం, వికాసం, విజ్ఞానం, ప్రపంచ అవగాహన కలిపించేందుకు శ్రీచైతన్య స్కూల్ ఎడ్యుకేషన్ మరో ముందడుగు వేసింది. భారతదేశంలో పాఠశాల విద్యలో అగ్రగామిగా ఉన్న శ్రీచైతన్య స్కూల్స్, ప్రైమరీ నుంచి ఒలింపియాడ్స్, హైస్కూల్ నుంచే ఐఐటి,జేఈఈ,నీట్‌లకు ఫౌండేషన్ శిక్షణ ఇస్తోందని, విద్యార్థులను ఆల్ రౌండర్స్‌గా, గ్లోబల్ లీడర్స్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఎడ్యుకేషనల్ టూర్స్ నిర్వహిస్తోందని ఆ సంస్థ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొనింది. ఇటీవల 105 మంది విద్యార్థులతో,10 మంది ఉపాధ్యాయులతో, 8 రోజుల మలేషియా, సింగపూర్ దేశాల్లో టూర్‌ను విజయవంతం చేసి విద్యార్థులకు మధుర జ్ఞాపకాలను మిగిలించిందని పేర్కొనింది. ఈ టూర్ విషయాలను శుక్రవారం జూబ్లీ హిల్స్ శ్రీచైతన్యలో జరిగిన మీడియా సమావేశంలో విద్యార్థులు పంచుకున్నారు. మలేషియాలో పుత్ర మసీదు, పెర్ధన పుత్ర (ప్రధానమంత్రి కార్యాలయం) నూతన నిర్మిత పుత్ర సరస్సు, దానిపై నిర్మించిన మూడంతస్తుల బ్రిడ్జి, ప్రపంచంలోనే ఎత్తైన భవనం పెట్రోనాస్ తదితర జ్ఞాపకాలు చెదిరిపోనివని సంస్థ అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. సింగపూర్‌లోని సైన్స్ సెంటర్‌లో చేసిన వివిధ రకాల ప్రయోగాలు, వేస్ట్ వాటర్ రీసైకిలింగ్, బటుకేవ్స్ తదితర ప్రాంతాలు విజ్ఞాన దాయకంగా ఉన్నాయని విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. విద్యార్థుల విజ్ఞాన పర్యటనలు భవిష్యత్‌లో వారిని అంతరిక్ష యాత్రికులుగా, చరిత్రకారులుగా అనేక ఉన్నత పదవులు అధిష్ఠించేందుకు ఉపయోగపడతాయని శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ బియస్.రావు తెలిపారు. ఈ విజ్ఞాన పర్యటనను ప్రోత్సహించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.
అమెరికాలో జరగనున్న అంతర్జాతీయ అంతరిక్ష అభివృద్ధి సమావేశాలకు విద్యార్థులను సమాయత్తం చేస్తున్నట్లు శ్రీచైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమ చెప్పారు.


కూలర్ కంపెనీలో అగ్ని ప్రమాదం

భారీగా ఆస్తి నష్టం

మనతెలంగాణ/శంషాబాద్ : కూలర్ కంపెనీలో విద్యుత్ షాక్‌తో మంటలు చెలరేగి భారీగా ఆస్తి నష్టం జరిగిన సంఘటన శుక్రవారం సాయంత్రం శంషాబాద్ మండల పరిధిలోని సాతంరాయ్ గ్రామంలో ఉన్న వివిఎన్‌ఆర్ కాలనీలో చోటుచేసుకుంది. ఆర్జీఐఏ ఎస్సై పైడినాయుడు తెలిపిన వివరాల ప్రకారం ఏలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్న ఓ ప్రైవేట్ కూలర్ కంపెనీలో షార్టు సర్క్యూట్‌తో మంటలు చెలరేగిందన్నారు. కూలర్‌లను ప్లాస్టిక్‌తో తయ్యారు చేయడంతో మంటలు తొందరగా భవనం మొత్తం వ్యాపించిందన్నారు. అయితే స్థానికులు సమాచారం ఇవ్వడంతో హుటహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ఐదు ఫైర్ ఇంజన్లతో మంటలను దాదాపు మూడు గంటలు శ్రమించి అదుపులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. అయితే ఎంత ఆస్తి నష్టం అనేది ఇంకా పూర్తిగా నిర్ధారణ కాలేదన్నారు.యాజమాన్యం ఇచ్చే ఆధారాలతో ఎంత నష్టం జరిగింది అనేది తెలుస్తుందన్నారు.ఈ సంఘటనలో భవనం పూర్తిగా శిధిలమైందన్నారు. కాని ఎలాంటి ప్రాణా నష్టం జరగలేదన్నారు.ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు రావల్సింది ఉందన్నారు.

నడికుడిలో అగ్నిప్రమాదం

సుమారు రూ. 7 లక్షలు ఆస్తినష్టం



మన తెలంగాణ / భద్రాచలం భద్రాద్రి కొత్తగూడెం : దుమ్ముగూడెం మండలం నడికుడిలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుని సుమారు రూ. 7 లక్షలు ఆస్తినష్టం సంభవించిది. శుక్రవారం సాయత్రం అపక పెదగుట్టయ్యకు చెందిన ఇల్లు విద్యుత్‌షాట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఇంటితో పాటు బంగారం, నగదుతో పాటు పండించుకున్న ప్రత్తి, ధాన్యం కూడా దగ్ధమైందని, కట్టుబట్టలు మాత్రమే మిగిలాయని స్థానికులు చెబుతున్నారు. మిగతా వివరాలు తెలియాల్సిఉంది.

పోలీసులు తమ యూనిఫారాలను వదిలి సివిల్ డ్రస్‌ల్లో వెళ్లి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే ఎలాగని హైకోర్టు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. రమ్మీ చట్ట వ్యతిరేకం కాదని హైకోర్టు పలు-సార్లు తేల్చినా కరీంనగర్‌లో ఒక రిసార్ట్‌పై మఫ్టీలోని పోలీసులు దాడులు చేయడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. రిసార్ట్‌పై అన్యాయంగా దాడి చేశారని కరీంనగర్‌లోని పుష్పాంజలి కంట్రీ రిసార్ట్ హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. సీఆర్‌పీసీ కంటే పోలీసుల ఆదేశాలేమీ ఉన్నతం కాదని హైకోర్టు న్యాయమూర్తి పీవీ సంజయ్‌కుమార్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

విశాల




ఎన్‌ఆర్‌ఐ చిగురుపాటి హత్య

హైదరాబాద్ తరలివచ్చిన ఎపి పోలీసు బృందాలు

మన తెలంగాణ/హైదరాబాద్‌: ప్రముఖ ఎన్నారై, ఎక్స్‌ప్రెక్స్ టీవీ చైర్మన్ చిగురుపాటి జయరామ్ అనుమానస్పద స్థితిలో మృతి చెందిన ఘటనలో హైదరాబాద్‌కు చెందిన కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కృష్ణా జిల్లా నందిగామ మండల ఐతవరం దగ్గర హైవేలో కారులో శుక్రవారం జయరామ్ మృతదేహం లభ్యమైంది. కాగా ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నారు. కుటుంబ సభ్యులే ఈ దారుణానికి ఒడికట్టారన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అయితే చిరుగుపాట హత్యకు హైదరాబాద్‌లో కుట్ర జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈక్రమంలో చిగురుపాటి డ్రైవర్‌ను అదుపులోకి తీసకున్నారు. అలాగే కుటంబ సభ్యులను, చిగురుపాటి జయరాం మేనకోడలు శిఖాచౌదరిని పోలీసులు ప్రశ్నించినట్లు సమాచారం. చిగురుపాటి కేసు దర్యాప్తులో భాగంగా ఎపికి చెందిన ప్రత్యేక పోలీసులు శుక్రవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. నగరంలోని మాదాపూర్, కొండాపూర్,అమీర్‌పేట్‌లోని చిగురుపాటి సమీప బంధువులున ప్రశ్నించే అవకాశం ఉంది.

క్యాన్సర్‌పై యశోద హాస్పిటల్ '5కె రన్'

మన తెలంగాణ/ హైదరాబాద్‌: క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించి ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు హైదరాబాద్ మలక్‌పేట యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈ నెల మూడో తేదీన 5కే రన్ ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి నాలుగున ప్రపంచ కేన్సర్ డే సందర్భంగా ఈ రన్ ఏర్పాటు చేసినట్టు హాస్పటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. ఆ రోజు ఉదయం ఏడు గంటలకు ఎల్బి నగర్ లోని సరూర్ నగర్ స్టేడియం నుంచి కొత్తపేట ఫ్రూట్ మార్కెట్ వరకు అక్కడి నుంచి తిరిగి స్టేడియం వరకు జరుగుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సినీ హీరో నవదీప్, హీరోయిన్ తేజస్వి తో పాటు ఇతర సినీ ప్రముఖులు ఐఏఎస్ ఐపీఎస్ అధికారులు, వైద్య నిపుణులు, రాజకీయ నాయకులు పాల్గొంటారని ఆయన వివరించారు. దేశంలో ప్రతి ఎటా 10 నుంచి 12 లక్షల మంది క్యాన్సర్ వ్యాధికి గురవుతున్నారని, ప్రతి నిమిషానికి ఐదు నుంచి ఎనిమిది చొప్పున క్యాన్సర్ కారణంగా మరణిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆయన వివరించారు ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా ఈనెల 4వ తేదీ నుండి 28వ తేదీ వరకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు తక్కువ ధరలకు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు.

కూలిన మిరేజ్ 2000, ఇద్దరు పైలట్ల మృతి



బెంగళూరు: ఇక్కడి హిందుస్థాన్ ఏరో నాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఎఎల్) ఎయిర్‌పోర్ట్‌లో భారత వైమానిక దళానికి (ఐఎఎఫ్) చెందిన మిరేజ్ 2000 విమానం శుక్రవారం ఉదయం కూలిపోయింది. ఇందులో ఉన్న ఇద్దరు పైలట్లూ ఈ ప్రమాదంలో మరణించారు. 'అభివృద్ధి పరచిన మిరేజ్ 2000 విమానం శుక్రవారం ఉదయం 10.30 కూలిపోయింది. ఇందులో ఉన్న ఇద్దరు పైలట్లు స్క్వాడ్రన్ లీడర్ సమీర్ అబ్రోల్, స్క్వాడ్రన్ లీడర్ సిద్ధార్థ నెగి ఈ దుర్ఘటనలో మరణించారు' అని హెచ్‌ఎఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఐఎఎఫ్‌తో కలిసి ఈ ప్రమాదంపై దర్యాప్తు జరుపుతామని హెచ్‌ఎఎల్ చెప్పింది. ఉత్తరప్రదేశ్‌లోని ఖుషీనగర్‌లో గత సోమవారం జాగ్వర్ ఫైటర్ విమానం కూలిపోయిన వారం రోజుల తర్వాత సంభవించిన రెండో విమాన ప్రమాదమిది.

పట్టాలు తప్పిన జబల్పూర్– అజ్మీర్ ఎక్స్‌ప్రెస్



జైపూర్: జబల్పూర్ – అజ్మీర్ మధ్య నడిచే సూపర్‌ఫాస్ట్ రైలు శుక్రవారం జైపూర్ సమీపంలో పట్టాలు తప్పిందని అధికారులు తెలిపారు. ఇక్కడికి దక్షిణదిశగా 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న సంగనేర్ రైల్వేస్టేషన్ సమీపంలో దయోదయా ఎక్స్‌ప్రెస్ ఇంజన్ ఒక్కసారిగా పట్టాలు తప్పి, తిరగబడడంతో దానివెనకే ఉన్న కోచ్ కూడా పట్టాలు తప్పింది. శుక్రవారం మధ్యాహ్నం ఒంటగంట ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని వాయవ్య రైల్వే ప్రతినిధి ఒకరు తెలిపారు. ప్రమాదంలో ప్రయాణికులెవరూ గాయపడలేదు. కానీ ఇంజన్ డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. 'ఇంజన్ పట్టాలుతప్పి తిరగబడినప్పుడు రైలు అజ్మీర్ నుంచి జైపూర్ జంక్షన్ వైపు ప్రయాణిస్తోంది' అని సంగనేర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌ఛార్జి లఖన్ ఖటానా చెప్పారు. ఈ సంఘటన కారణంగా మూడు రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. మరో రెండింటిని వేరే మార్గంలో నడిపారు.



బిజెపీ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు అమిత్ షా సతీమణి సోనాల్ షా, ఆమె బంధువులు శుక్రవారం చారిత్రక చార్మినార్ చెంతన గల శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు శంభు మహారాజ్ వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ విశిష్టతను తెలియజేశారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. —మన తెలంగాణ, చాంద్రాయణగుట్ట

ఇవిఎంలపై ఇసి వద్దకు


ప్రతిపక్షాలు సన్నద్ధం



న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై (ఇవిఎం) తమ భయాందోళనలను ప్రతిపక్షాలు ఎన్నికల సంఘానికి తెలియచేయనున్నాయి. ట్యాంపరింగ్ అంశంపై సోమవారం ప్రతిపక్ష బృందం ఇసిని కలుస్తుందని కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ శుక్రవారం తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇక్కడ సమావేశం అయ్యాయి. తరువాత వివరాలను రాహుల్ విలేకరులకు వెల్లడించారు. పలు ఎన్నికల సందర్భంగా ఫలితాల సరళితో తమకు ఇవిఎంలపై అనుమానాలు తలెత్తాయని రాహుల్ చెప్పారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికలలో ఇవిఎంల వాడకం ఎంతవరకు సబబు అనేది తమ ప్రశ్న అని రాహుల్ చెప్పారు. తమ సందేహాలను, ఇవిఎంల బదులుగా తిరిగి బ్యాలెట్ పద్ధతికి వెళ్లడం గురించి ఎన్నికల సంఘం అధికారులకు తెలియచేస్తామని రాహుల్ వివరించారు. ఇవిఎంలపై తామంతా సుదీర్ఘంగా చర్చించినట్లు, ఇది మంచి పరిణామంగా మారిందని అన్నారు.

ఇవిఎంల గురించే కాకుండా ఉద్యోగాల సృష్టి, వ్యవసాయ సంక్షోభం, వ్యవస్థలపై దాడుల అంశాలపై గురించి కూడా ప్రతిపక్షాలు విశ్లేషించాయని వివరించారు. వ్యవస్థలలోకి కేంద్రం చొరబాటు, నిర్మాణాత్మక రంగాల గడ్డు పరిస్థితి ఆందోళనకరం అన్నారు. రాబోయే ఎన్నికలలో పలు కీలక అంశాలు ప్రస్తావనకు వస్తాయని చెప్పారు. యువతకు ఉద్యోగాలు , వ్యవసాయరంగం, వ్యవస్థలకు తూట్లు, రాఫెల్ డీల్‌లో ప్రధాని అవినీతి వంటివి ప్రధాన అంశాలు అని, వీటిని ప్రజల వద్దకు తీసుకువెళ్లుతామని రాహుల్ తెలిపారు. బడ్జెట్‌ను ప్రతిపక్షాలపై సర్జికల్ దాడిగా బిజెపి వర్గాలు పేర్కొనడంపై రాహుల్ స్పందించారు. రాఫెల్, పెద్ద నోట్ల రద్దు, ఉద్యోగాలపై ఇప్పుడు ప్రధానిపై ఆయన ప్రభుత్వంపై ఓట్ల మెరుపుదాడి జరుగుతుందన్నారు. ఇవిఎంల ట్యాంపరింగ్ అక్రమాలకు తావిస్తోందని , దీనిని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తేవడం తమ బాధ్యత అని రాహుల్ తెలిపారు. ప్రతిపక్షాల భేటీలో రాహుల్ గాంధీతో పాటు శరద్ పవార్, ఉమర్ అబ్దుల్లా, రామ్ గోపాల్ యాదవ్, కనిమొళి, డి రాజా, టికె రంగరాజన్ మనోజ్ ఝా ఇతరులు పాల్గొన్నారు. ప్రపంచంలో కేవలం రెండు లేదా మూడు దేశాలే ఇవిఎంలను వాడుతున్నాయని , అవి సరిగ్గా పనిచేయడం లేదనే ఆరోపణలు రావడంతో తిరిగి బ్యాలెట్ పత్రాల తోవకు వెళ్లారని కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఎన్నికలకు ముందు దేశంలో సగానికి పైగా బూత్‌లలో ఇవిఎంల పనితీరుపై నమూనా తనిఖీలు చేయాలని, ప్రజలలో ఏర్పడ్డ అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు.

బ్యాలెట్‌కు వెళ్లేది లేదు : ఇసి



దేశంలో తిరిగి బ్యాలెట్ పత్రాల పద్ధతిలో ఎన్నికలకు వెళ్లే ప్రసక్తే లేదని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సునీల్ అరోరా తెలిపారు. ఇవిఎంల ట్యాంపరింగ్‌కు అవకాశం ఉందనే ప్రతిపక్షాల వాదన నేపథ్యంలో అరోరా స్పందించారు. బ్యాలెట్ పద్ధతికి వెళ్లడం కుదరదు. దేశంలో ఎన్నికల నిర్వహణకు ఇవిఎం వాడకానికి దిగి రెండు దశాబ్దాలు దాటింది. చాలా కాలంగా ఎన్నికల సంఘం ఈ పద్ధతినే పాటిస్తోంది. ఈ దశలో ఇదే ఇక ముందు కూడా కొనసాగుతుందని, వెనుకకు వెళ్లే ప్రసక్తి లేదని సిఇసి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల తరువాత అతి పెద్ద భాగస్వామ్య పక్షాలు రాజకీయ పార్టీలే. ఇవిఎంల గురించి కానీ ఇతరత్రా కానీ పార్టీలు తమకు అందిన సమాచారం తెలియచేసుకునే హక్కుంది. అయితే ఎన్నికల సంఘం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవిఎంలను కాదని బ్యాలెట్ పద్ధతి వైపు తిరోగమించే ప్రసక్తే లేదన్నారు. బ్యాలెట్ పత్రాల అపహరణలు, కండబలం, రిగ్గింగ్‌లు , చివరికి కౌంటింగ్‌లలో తీవ్ర జాప్యాలు, గందరగోళానికి అవకాశాలు కల్పించడం తాము ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమించేది లేదని స్పష్టం చేశారు.

అమెరికాలో అగచాట్లు

(మొదటిపేజీ తరువాయి)

అక్రమంగా ఆమెరికాలో నివాసం ఉంటున్న వారిలో 130 మందికి జియోట్యాగ్‌తో బంధించారు. ఎప్పటికప్పుడు వారి కదలికలను తెలుసుకునేందుకు భారత విద్యార్థుల కాళ్లకు జియోట్యాగ్ భిగించారు. సదరు విద్యార్థులు 60 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించకుండా ఆంక్షలు విధించారు.

ముఖ్యంగా కరీంనగర్‌కు చెందిన ఓ నిండు గర్భవతి కాళ్లకు జియోట్యాగ్ భిగించి వదిలేశారు. ఈక్రమంలో అమెరికాలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలుగు విద్యార్థులను కాపాడేందుకు అక్కడి తెలుగు రాష్ట్రాల ఎన్‌ఆర్‌ఐ సంఘాలు ఏకమైయ్యాయి. ఈ నేపథ్యంలో భారత విద్యార్థుల పట్ల అమెరికా తీరుపై భారత అటార్నీ ఉమ ఆగ్రహం వ్యక్తం చేశారు. హోంల్యాండ్ సెక్యూరిటీ చేపట్టిన స్టింగ్ ఆపరేషన్‌లో చిక్కుకున్న తెలుగు విద్యార్థులను ఆదుకునేందుకు అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా)రంగంలోకి దిగింది. ఈ వ్యవహారంలో పోలీసులు ఇప్పటికి 600 మందికి వారెంట్లు జారీ చేయగా 130మందిని అరెస్టు చేశారు. ఈ కేసులో మరో 500 మంది విద్యార్థులను అరెస్టు చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. విద్యార్థుల తరపున అమెరికా కోర్టులో వాదించేందుకు గంట వ్యవధికి 500 డాలర్లను అక్కడి న్యాయవాదులు డిమాండ్ చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. దీంతో తెలుగు రాష్ట్రాల ఎన్నారైలు ప్రత్యేక న్యాయవాదుల బృందాన్ని ఏర్పాటు చేశారు. బాధితుల పక్షాన వాదించేందుకు తెలుగు రాష్ట్రాలోని న్యాయవాదులు సైతం అమెరికా బయలుదేరుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇందులో భాగంగా బాధితులను ఆదుకునేందుకు ఇండియన్ ఎంబసికి అవసరమైన సహాయసహకారాలు అందిస్తామని ఆటా ప్రెసిడెంట్ పరమేష్ భీమ్‌రెడ్డి తెలిపారు. అదే విధంగా నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసాలకు గురికాకుండా ఉండేందుకు ఆటా వెబినార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేష్ భీమ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో విద్యార్థులకు మరే ఇతర దేశం కల్పించని గొప్ప అవకాశాలను అమెరికా కల్పిస్తోందన్నారు. ఇక్కడ నివసించేందుకు విద్యార్థులు అడ్డదారులు తొక్కడ సరికాదని, చట్టాలను అతిక్రమించడం వల్ల ఇలాంటి విపత్కకర పరిస్థితులు ఎదుర్కొవాల్సి ఉంటుందన్నారు. అటా వెబినార్ సదసుసలో అట్లాంటాకు చెందిన ఇమ్మిగ్రేషన్ అటార్నీలు రవికుమార్ మన్నం, మైఖేల్ సోఫో, హేమంత్ రామచంద్రన్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

తెలుగు విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి

అమెరికా కాన్సుల్ జనరల్ కేథరిన్‌కు కెటిఆర్ విజ్ఞప్తి



మన తెలంగాణ/హైదరాబాద్: అమెరికాలో సంక్షోభంలో చిక్కుకున్న తెలుగు విద్యార్థుల సమస్యలను సానుభూతితో పరిష్కరించాలని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆ దేశ కాన్సుల్ జనరల్ కేథరిన్ హడ్డాను కోరారు. శుక్రవారం ప్రగతి భవన్‌లో కేథరిన్ హడ్డాతో టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చజరిగింది. నకిలీ ధృవపత్రాలతో అమెరికాకు వెళ్లి చదువు పేరుతో ఉద్యోగాలు చేస్తున్న వారిలో తెలుగు విద్యార్థులు కూడా ఉన్నారని, వారిపై కేసులు నమోదు చేయకుండా సానుభూతితో పరిష్కరించాలని కెటిఆర్ కోరారు. నకిలీ విద్యాసంస్థల్లో మోసపోయిన విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సంక్షోభంలో చిక్కుకున్న తెలుగు విద్యార్థుల సమస్యలను అమెరికా ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించాలని కేథరిన్‌కు వివరించారు. అలాగే ఈ సమావేశంలో తెలంగాణతో అమెరికాకు సంబంధించిన వ్యాపార వాణిజ్య అంశాలపైనా చర్చించారు. భవిష్యత్‌లో చేపట్టబోయే ప్రాజెక్టులపైకూడా చర్చించినట్లు తెలిసింది. వ్యాపార, వాణిజ్యాల పై ప్రత్యేకంగా చర్చించినట్లు సమావేశం అనంతరం కేథలిన్ తెలిపారు. అమెరికా తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉన్న సహకారాన్ని కూడా సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. కెటిఆర్ తనకు మంచి స్నేహితుడనీ ఆమె చెప్పారు. టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన కెటిఆర్‌ను కేథరిన్ అభినందించారు. అన్నివిషయాల్లో అత్యంత చొరువ, ఉత్సాహం చూపే కెటిఆర్‌కు నూతన బాధ్యతలు సరిగ్గాసరిపోతాయన్నారు. కెటిఆర్ తెలిపిన మిగతా అంశాలను సానుకూలంగా పరిష్కరించేందుకు ప్రయత్నించనున్నట్లుహామీ ఇచ్చారు.

20 తర్వాత రాష్ట్ర బడ్జెట్ సభ?

(మొదటిపేజీ తరువాయి)

రోజులపాటు జూబ్లిహాల్‌లో సమావేశం నిర్వహించనున్నందున ముఖ్యమంత్రి కూడా హాజరుకానున్నారు. ఇప్పటికే అన్ని శాఖల నుంచి వివరాలను సేకరించిన రాష్ట్ర ఆర్థిక శాఖ ఆర్థిక సంఘంతో అనేక అంశాలపై లోతుగా చర్చించనుంది. డివొల్యూషన్‌ను పెంచాలనే డిమాండ్‌తో పాటు రాష్ట్రంలోని మొత్తం 31 జిల్లాల్లో మూడు మినహా మిగిలినవన్నీ ఆర్థికంగా వెనకబడి జిల్లాలుగానే గుర్తించేలా ఆర్థిక సంఘానికి వివరాలతో సహా సమగ్రమైన నివేదికను ఇవ్వడానికి ఆర్థిక శాఖ సిద్ధమవుతోంది. తొలి రెండు రోజుల పాటు జూబ్లీ హాల్‌లో జరిగే సమావేశం అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి ఆర్థిక సంఘం ప్రతినిధి బృందం వెళ్ళనుంది. ఈ బృందం వెళ్ళిపోయిన తర్వాతనే రాష్ట్ర ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల నిర్వహణ గురించి తేదీల ఖరారుతో పాటు ఎన్ని రోజుల పాటు నిర్వహించాల్సిన అవసరం ఉంటుందో ప్రభుత్వం ఒక స్పష్టతకు రానున్నట్లు తెలిసింది.

కేంద్ర బడ్జెట్‌తో తెలంగాణకుం వచ్చే నిధులేమీ లేవు

తాజా కేంద్ర బడ్జెట్‌తో తెలంగాణకు పెద్దగా వచ్చే నిధులు ఏమి ఉండవని ఆర్థిక శాఖ అధికారులు అభిప్రాయం. గ్రామీణ సడక్ యోజన, జాతీయ విద్యా మిషన్, జాతీయ జీవనోపాధి (లైవ్లీహుడ్) మిషన్ ద్వారా రాష్ట్రానికి కొద్దిగా నిధులు పెరుగొచ్చని, వీటికి గతం కంటే కొంత పెరిగి రూ. 13 వేల కోట్లు వస్తాయని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలకు గత బడ్జెట్‌లో రూ. 3.04 లక్షల కోట్లు ఉంటే ఈసారి 3.27 లక్షల కోట్లకు పెరిగిందని గుర్తుచేశారు. జాతీయ రహదారుల అథారిటీకి నిధులు పెంచినందున ఇందులో తెలంగాణకి కొన్ని నిధులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతుబంధును పోలిన 'కిసాన్ సమ్మాన్' పథకం ద్వారా దేశవ్యాప్తంగా 12.56 కోట్ల మంది రైతులకు లబ్ది చేకూరుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా రైతుల సాగులో ఉన్న కమతాలు 14.57 కోట్ల ఎకరాలుగా అంచనా ఉన్నందున దాదాపు మొత్తం రైతుల్లో 86 శాతం మందికి లబ్ది చేకూరనుందని పేర్కొన్నారు. ఈ పథకం అమలుకు రూ. 75,381 కోట్లు అవసరమని, కేంద్ర పథకాన్ని వెంటనే అమలు చేసేందుకు వీలుగా తెలంగాణా ప్రభుత్వం దగ్గర లబ్ధిదారుల వివరాలు పూర్తిస్థాయిలో ఉన్నాయని, వెంటనే అమలుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని తెలిపారు. రైతుబంధు పథకం అమలు కోసం లబ్ధిదారుల గణాంకాలు, బ్యాంకు ఖాతాలు, ఆధార్ నెంబర్ల తదితర వివరాలన్నీ సిద్ధంగా ఉన్నాయని, మన రాష్ట్రం తరహాలోనే ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, గుజరాత్, ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో కూడా కొంత మేరకు అందుబాటులో ఉన్నందున అమలుకు పెద్దగా సమయం తీసుకోదని వివరించారు.

ఇంటి ముంగిటకే భగీరథ నీరు

- ఆరోగ్య తెలంగాణకు తొలి అడుగు
- కార్యదర్శి స్మితా సబర్వాల్



మన తెలంగాణ / హైదరాబాద్ : ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ప్రభుత్వం ప్రతీ ఇంటికీ గుమ్మం ముందుకే తాగునీటిని తీసుకొస్తున్నదని, ప్రతీ బొట్టును ప్రజలు జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని, ఇది లబ్ధిదారులందరి బాధ్యత అని ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్ వ్యాఖ్యానించారు. మిషన్ భగీరథతో వెలకట్టలేని 'ఆరోగ్యనిధి' ని తెలంగాణ భావితరాలకు ప్రభుత్వం అందిస్తోందని, ఆరోగ్య తెలంగాణకు ఇది తొలి అడుగు అని అన్నారు. మిషన్ భగీరథ ఆపరేషన్, మెయింటెనాన్స్ పాలసీ, మార్గదర్శకాలపై నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ రెండో రోజు కార్యక్రమానికి హాజరైన స్మితా సబర్వాల్ తాగునీటి ప్రాముఖ్యత గురించి వివరించారు. ఎంతో ఖర్చుతో, ప్రజల అవసరాలను గుర్తెరిగి ప్రభుత్వం మిషన్ భగీరథకు రూపకల్పన చేసి అందిస్తున్న రక్షిత త్రాగునీటిని పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ నిరంతర పర్యవేక్షణ, ఇంజనీర్లు, సిబ్బంది అంకితభావంతో ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి భగీరథతో శుద్ధిచేసిన తాగునీరు సరాఫరా అవుతోందన్నారు. ప్రస్తుతం ప్రతీ మనిషికి గ్రామాల్లో రోజుకు వంద లీటర్లు, పట్టణాల్లో రోజుకు 135 లీటర్లు, నగరాల్లో 150 లీటర్ల చొప్పున సరాఫరా అవుతున్నదని పేర్కొన్నారు. అంతకు ముందు మిషన్ భగీరథ వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్స్, స్థిరమైన తాగునీటి సరాఫరా అంశాలపై చీఫ్ ఇంజనీర్ విజయ్ ప్రకాష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మిషన్ భగీరథతో ఎలాంటి ఆటంకాలు లేని తాగునీటి సరాఫరా కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆ క్రమంలో తలెత్తే సమస్యలను వివరించారు. ఇక మిషన్ భగీరథతో 24 గంటలు తాగునీటిని సరాఫరా చేయడంలో ఉన్న సాధ్యాసాధ్యాలు, ఆటంకాలపై 'అస్కీ' (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) డైరెక్టర్ శ్రీనివాసచారి ప్రజేంటేషన్ ఇచ్చారు. ఇక 'ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్' ఉపయోగించి లోపాలు లేకుండా తాగునీటిని సరాఫరా ఎలా చేయవచ్చో 'స్మార్ట్ టెర్రా' స్టార్టప్ ప్రతినిధి గోకుల్ కృష్ణ వివరించారు. తాగునీటి సరాఫరాలో తలెత్తే సమస్యలను ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో పరిష్కరించవచ్చని తెలిపారు. రోజువారీ నీటి వినియోగం, లీకేజీలను ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో సమర్థవంతంగా లెక్కగట్టచ్చన్నారు. ఆ తర్వాత యునిసెఫ్ ప్రతినిధులు తమ బేస్ లైన్ సర్వేపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న తాగునీటి సౌకర్యాలు, పరిశుభ్రమైన మంచినీరు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు, నీటి సంబంధిత వ్యాధులపై తాము సర్వే చేశామని చెప్పారు. తాము గమనించిన సమస్యలన్నీ మిషన్ భగీరథతో పరిష్కారం అవుతాయన్న నమ్మకం ఉందన్నారు. యునిసెఫ్ లాంటి ప్రతిష్టాత్మకమైన సంస్థ మిషన్ భగీరథతో భాగం కావడం తమకు గర్వకారణమని స్మితా సభర్వాల్ అన్నారు. ఇప్పుడు రాష్ట్రమంతటా మిషన్ భగీరథతో స్వచ్ఛమైన శుద్ధిచేసిన తాగునీటిని అందిస్తున్నామని, ఈ నీటి వినియోగం తర్వాత ప్రజల సామాజిక, ఆర్థిక స్థితుల్లో వచ్చిన మార్పులను తెలుసుకునేందుకు ఎదురుచూస్తున్నామన్నారు. ఆ తర్వాత మిషన్ భగీరథ ఎలక్ట్రో మెకానికల్ పరికరాల నిర్వహణపై చీఫ్ ఇంజనీర్ జగన్మోహనర్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారు. కచ్చితమైన మార్గదర్శకాలు, జాగ్రత్తలతో ఎలక్ట్రో, మెకానికల్ యంత్రాలు ఎక్కువ రోజులు పనిచేస్తాయన్నారు. వాటర్ ఆడిట్, ఎనర్జీ ఆడిట్, నిర్వహణ పద్ధతులపై వర్క్ షాప్‌లో చర్చలు జరిగాయి. ఈ వర్క్‌షాప్‌లో ఈఎన్‌సి కృపాకర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజనీర్లు జగన్మోహన్ రెడ్డి, విజయపాల్ రెడ్డి, విజయప్రకాశ్, వినోభాదేవి, చిన్నారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, శ్రీనివాస్, కన్సల్టెంట్లు నర్సింగరావు, జగన్, మనోహర్ బాబుతో పాటు ఎస్‌ఈ, ఈఈ, డిఈఈలు పాల్గొన్నారు.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666